మంగళవారం 27 అక్టోబరు 2026 https://www.telugudesam.org




# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు




# అర్నబ్ తుఫాన్‌పై హైఅలర్ట్

- ఆస్తి, ప్రాణనష్టం లేకుండా ముందస్తు చర్యలు
- ముంపు ప్రాంతాల్లో షెల్టర్లకు బాధితుల తరలింపు
- ప్రతి 4 గంటలకూ ప్రజలకు హెచ్చరికల జారీ
- ప్రభావిత ప్రాంతాల్లో విద్యాసంస్థలకు సెలవులు
- కలెక్టర్లతో సమీక్షలో సీఎం చంద్రబాబు సూచనలు

బంగాళాఖాతంలో ఏర్పడిన ఆర్నబ్ తుఫాన్ నేపథ్యంలో రాష్ట్ర యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. తుఫాను ప్రభావం నేపథ్యంలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని సూచించారు. ముంపు ప్రాంతాల్లోని ప్రజలను తుఫాన్ షెల్టర్లకు తరలించాలి..వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణీలు, శిశువులకు తొలి ప్రాధాన్యతనిచ్చి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని స్పష్టం చేశారు. ప్రభావిత జిల్లాల్లోని ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య బృందాలను, అంబులెన్సులను సిద్ధంగా ఉంచాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రంలో 7 ఎన్డీఆర్ఎఫ్, 8 ఎస్డీఆర్ఎఫ్ బృందాలను 11 ప్రభావిత జిల్లాల్లో మోహరించాలని సూచించారు. కోసిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు చేర్చేలా చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖను సీఎం నిర్దేశించారు.

2



## తీరప్రాంతంలో ముందస్తు చర్యలు

- సహాయక చర్యలకు రూ.27 కోట్ల నిధులు విడుదల
- రహదారుల బంద్.. ఉదయం నుంచి బీచ్‌ల మూసివేత
- నేడు, రేపు పలు జిల్లాల్లో పాఠశాలలకు సెలవులు
- సమస్యల పరిష్కారానికి మనమిత్ర వాట్సాప్ సేవలు
- దక్షిణ కోస్తా రైల్వే జోన్ పరిధిలో పలు రైళ్లు రద్దు
- 11 జిల్లాలకు ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు
- జిల్లా, మండల స్థాయిలో 2,907 కంట్రోల్ రూమ్‌లు
- 1,763 తుఫాన్ షెల్టర్ల ఏర్పాటు చేసిన ప్రభుత్వం
- రేవుల్లోనే 30,043 పడవల నిలిపివేత
- ప్రభావిత ప్రాంతాల్లో వైద్య సేవలకు ప్రత్యేక ఏర్పాట్లు
- సహాయక చర్యల కోసం నోడల్ ఆఫీసర్లు



## ఎన్టీఆర్ సంకల్పం... ఆరోగ్య విశ్వవిద్యాలయం

**వర్సిటీ 40వ వార్షికోత్సవం వేడుకలు**

**సీఎం చంద్రబాబు, లోకేష్ శుభాకాంక్షలు**

అమరావతి(చైతన్యరథం): డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం 40వ వార్షికోత్సవం సందర్భంగా రూబీ జూబ్లీ వేడుకలు జరుపుకుంటున్న విద్యార్థులు, అధ్యాపకులు, వైద్యులు, పరిశోధకులు, సిబ్బందికి సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలియజేశారు. దివంగత ఎన్టీఆర్ సంకల్పంతో ప్రారంభమైన ఈ విశ్వవిద్యాలయం నాలుగు దశాబ్దాలుగా వైద్య విద్య, పరిశోధన, ప్రజారోగ్య రంగాల్లో కీలకపాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. నాణ్యమైన వైద్యవిద్యతో సమాజానికి నిబద్ధత కలిగిన వైద్యులను అందించడం గర్వకారణం. వైద్యం ఒక వృత్తి మాత్రమే కాదు.. ప్రాణాలను కాపాడే పవిత్రమైన బాధ్యత. సాంకేతికత వైద్యానికి శక్తిని ఇస్తే.. మానవత్వం ఆ వైద్యానికి మరింత విలువ చేకూరు స్తుంది. 40 ఏళ్ల వైద్యసేవా స్ఫూర్తితో ఈ విశ్వవిద్యాలయం మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

### 40వ వార్షికోత్సవం చారిత్రక సంబరం: లోకేష్

ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ 40వ వార్షికోత్సవం ఒక చారిత్ర క సంబరమని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. విద్య, వైద్య, ఆరోగ్య, సంక్షేమ, సాంస్కృతిక రంగాలు, తెలుగు భాషాభివృద్ధికి ఎనలేని కృషి చేసిన మహా నాయకుడు నందమూరి తారక రామా రావు గారి మానస పుత్రిక ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ. రూబీ జూబ్లీ వేడుకలు జరుపుకుంటున్న శుభ సందర్భంలో వైద్యులు, వైద్య విద్యార్థులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రతి చోటా కూటమి జెండా ఎగరాలి

- మిత్ర ధర్మాన్ని పాటించి తీరాల్సిందే
- 'చెప్పాం-చేస్తున్నాం' ప్రచారం ముమ్మరం
- గొడ్డలి పార్టీ అరాచకాలపై అప్రమత్తం చేయాలి
- స్థానిక ఎన్నికలపై సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

స్థానికఎన్నికలపై సీఎం చంద్రబాబు పార్టీముఖ్యనేతలతో సమీక్షించారు. 2024 తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల వేళ ప్రచారానికి వెళుతున్నాం..ఈ ఎన్నికలను



ప్రతిఒక్కరూ సీరియస్‌గా తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎన్నికల్లో చెప్పినవి మొత్తం చేస్తున్నాం. అందుకే 'చెప్పాం -చేస్తున్నాం' కార్యక్రమంతో ప్రజ ల్లోకి వెళ్లాలి. కూటమి పార్టీలు మిత్రధర్మాన్ని తప్పకుండా పాటిం చాల్సిందే. ఇందులో ఎలాంటి వెసులుబాటూ లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం చేసే మంచిని వివరించడంతో పాటు... గొడ్డలి పార్టీ చేసే అరాచకాలపైనా ప్రజలను అప్రమత్తం చేయాలని దిశానిర్దేశం చేశారు.

2

## దేశంలోనే తొలి ఆరోగ్య విశ్వవిద్యాలయం

# ఎన్టీఆర్ దూరదృష్టికి నిదర్శనం



- వర్సిటీ నుంచి నోబెల్ గ్రహీతలు రావాలి
- అంతర్జాతీయ పరిశోధనల్లో గుర్తింపు సాధించాలి
- చెన్నై నగరానికి తెలుగుగంగ నీరు ప్రశంసనీయం
- 40వ వార్షికోత్సవంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణ
- మరిన్ని విజయాలు సాధించాలని గవర్నర్ ఆకాంక్ష

5

ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ 40వ వార్షికోత్సవం సోమవా రం విజయవాడలో ఘనంగా జరిగింది. భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్య, వైద్య, ఆరోగ్య, సంక్షేమ, సాంస్కృతిక రంగాలు, తెలుగు భాషాభివృద్ధికి స్వర్గీయ ఎన్టీఆర్ చేసిన సేవలు గుర్తు చేసుకున్నారు. దేశంలోనే తొలి ఆరోగ్య విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ దూరదృష్టికి నిదర్శన మని కొనియాడారు. 'తెలుగు గంగ' ప్రాజెక్టు ద్వారా చెన్నై నగ రానికి తాగునీరు అందించిన ఎన్టీఆర్ దాతృత్వాన్ని ప్రశంసించారు. యూనివర్సిటీ నుంచి భవిష్యత్తులో నోబెల్ బహుమతి గ్రహీతలు రావాలని ఆకాంక్షించారు.

## ఏపీకి కేంద్రం భారీ సాయం

- రూ.27,370 కోట్ల గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుకు ఆమోదం
- పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి విస్తరణకు గ్రీన్‌సిగ్నల్



రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం భారీ సాయం అందించింది. ఏపీలో రూ.27,370 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న భారీ విద్యుత్ ప్రసార ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజ్ విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానించడమే లక్ష్యంగా గ్రీన్ ఎనర్జీ కారిడార్-3కు ఆమోదించింది.

2

## గన్నవరం విమానాశ్రయంలో ఉపరాష్ట్రపతికి ఘనస్వాగతం



ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వార్షికోత్సవాల్లో పాల్గొనేందుకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌కు మంత్రి నారా లోకేష్ ఘనస్వాగతం పలికారు.

## డిసెంబరులో డీజీపీ, ఐజీపీల సమావేశం

4

- హాజరుకానున్న ప్రధాని నరేంద్ర మోదీ
- సీఎస్ సాయిప్రసాద్ ఆధ్వర్యంలో సమీక్ష

చైతన్యరథం

# అర్నబ్ హై అలర్ట్

- తుఫాన్‌తో రెండురోజులు భారీ వర్షాలకు ఆస్కారం
- ఆస్తి, ప్రాణనష్టం లేకుండా ముందస్తు చర్యలు
- ముంపు ప్రాంతాల్లో షెల్టర్లకు బాధితుల తరలింపు
- ప్రతి 4 గంటలకూ ప్రజలకు హెచ్చరికల జారీ
- ప్రభావిత ప్రాంతాల్లో విద్యాసంస్థలకు సెలవులు
- ఉన్నతాధికారులు, కలెక్టర్లతో సమీక్షలో సీఎం చంద్రబాబు



అమరావతి(చైతన్యరథం): బంగాళాఖాతంలో ఏర్పడిన అర్నబ్ తుఫాన్ నేపథ్యంలో రాష్ట్ర యంత్రాంగం అప్రమత్తం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం కూడా ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లతో వర్చువల్‌గా సమీక్షించారు. మంగళవారానికి తీవ్ర తుఫాన్‌గా మారి రాష్ట్రంపై ప్రభావం చూపే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం హెచ్చరికల నేపథ్యంలో ఆయాతీరప్రాంత జిల్లాల కలెక్టర్లు ముందస్తు చర్యలు చేపట్టాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ నెల 28వ తేదీన అర్నబ్ తీవ్ర తుఫాను బాపట్ల-విశాఖ మధ్య యానాం సమీపంలో తీరాన్ని దాటే అవకాశం ఉందని అధికారులు వివరించారు. తుఫాన్ కారణంగా రేపు మధ్యాహ్నం నుంచి శ్రీకాకుళం నుంచి నెల్లూరుజిల్లా వరకూ వివిధ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలకు ఆస్కారం ఉందని తెలిపారు. అలాగే తీరప్రాంతాల వెంబడి బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. తుఫాన్ ప్రభావంతో ఉత్తర కోస్తాంధ్ర జిల్లాలు, కోనసీమ,తూర్పు,పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పలనాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఈ నెల 28, 29 తేదీల్లో భారీ వర్షాలు, కొన్ని చోట్ల అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని వివరించారు.అర్నబ్ తుఫాన్‌విషయంలో రాష్ట్రం తీసుకుంటున్న ముందస్తుచర్యలను ఎప్పటి కప్పుడు కేంద్రందృష్టికి తీసుకెళ్లాలని సీఎం ఆదేశించారు.

### షెల్టర్లకు లోతట్టు ప్రాంతాల ప్రజలు

తుఫాను ప్రభావం నేపథ్యంలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ముంపు ప్రాంతాల్లోని ప్రజలను తుఫాన్ షెల్టర్లకు తరలించాలని సూచించారు. వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణీలు, శిశువులకు తొలి ప్రాధాన్యతనిచ్చి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన 4,711 మంది గర్భిణీల ను ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాలకు, ఆస్పత్రులకు తరలించే ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు వివరించారు. ప్రభావిత జిల్లాల్లోని ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య బృందాలను, అంబులెన్సులను సిద్ధంగా ఉంచాలని సీఎం ఆదేశిం చారు. రాష్ట్రంలో 7 ఎన్డీఆర్ఎఫ్, 8 ఎస్డీఆర్ఎఫ్ బృందాలను 11 ప్రభావిత జిల్లాల్లో మోహరించాలని సీఎం సూచించారు. ఎన్టీఆర్, విశాఖపట్నం జిల్లాల్లో అదనపు బలగాలను రిజర్వ్‌లో ఉంచాలన్నా రు. మెరైన్ పోలీసులతో పాటు నౌకాదళంతో పాటు కోస్టుగార్డుల సేవలను ఈ తుఫాన్ సహాయక చర్యల్లో వినియోగించుకునేలా చూడాలని నిర్దేశించారు. సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకా రులందరినీ సురక్షితంగా తీరప్రాంతానికి తిరిగి రప్పించామని అధికారులు వివరించారు. మొత్తం 30,043 పడవలు సురక్షి తంగా హార్బర్‌లకు చేరుకున్నాయని తెలిపారు. తుఫాన్ బలహీన పడి సముద్రంలో సాధారణ పరిస్థితులు నెలకొనేంత వరకూ మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవా లని సూచనలు జారీ చేశారు.

### పంటనష్టం వాటిల్లకుండా చర్యలు

కోసిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు చేర్చేలా చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖను సీఎం నిర్దేశించారు. దాదాపు 1.82 లక్షల హెక్టార్లలోని ఉద్యాన పంటలకు ముప్పు పొంచి ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రేషన్ దుకాణాల్లోనూ సరకులు అందుబాటులో ఉంచాలని సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం వచ్చిన చోట తక్షణమే పునరుద్ధరించేలా చూడాలని స్పష్టం చేశారు. ఎప్పటి కప్పుడు తుపాను గమనాన్ని అంచనా వేస్తూ ప్రతీ నాలుగు గంటలకూ ప్రజలకు హెచ్చరికతో కూడిన బులెటిన్ జారీ చేయాలని దిశానిర్దేశం చేశారు. గతంలో వచ్చిన తుఫాన్ల సమాచారాన్ని విశ్లేషిస్తూ రైతులకు, ప్రజలను ఎప్పటికప్పుడు హెచ్చ రించాలని సూచించారు. అలాగే అర్నబ్ తుఫాన్ కారణంగా వివిధ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మొత్తం 22 రిజర్వాయర్ల పరిధిలో వరద ప్రవాహాలు వస్తాయని అధికారులు అంచనా వేశారు. ఈ ప్రవాహాలతో 10-12 టీఎంసీల మేర నీటిని నిల్వ చేసేలా చూడాలని ఆదేశించారు. తాండవ, రైవాడ, ఏలేరు, తమ్మిలేరు, ఎర్ర కాలువ, తాడిపూడి రిజర్వాయర్లకు పూర్తిస్థాయిలో నీటి నిల్వలు వచ్చే అవకాశం ఉందని సీఎం తెలిపారు. వాగులు, వంకలు, కాలువల ప్రవాహాలకు అడ్డంకి లేకుండా చూడాలన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా తుఫాన్ ప్రభావంపై దుష్ప్రచారం చేసేం దుకు ప్రయత్నిస్తే కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్లను ఆదే శించారు. ఇక తుఫాన్ ప్రభావం ఏయే ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటుందో చూసి... ఆ మేరకు విద్యాసంస్థలకు సెలవులు ప్రక టించాలని సీఎం సూచించారు. ప్రతి తుఫాన్ ప్రభావంపై ముఖ్యమంత్రి గంట గంటకూ అధికారుల నుంచి సమాచారాన్ని తీసుకుంటున్నారు. ఈ సమీక్షకు సీఎస్ సాయిప్రసాద్, ఆర్టీజీఎస్, విపత్తు నిర్వహణ సహా వివిధ శాఖల అధికారులు, మంత్రి రామానాయుడు వర్చువల్‌గా హాజరయ్యారు.

# ప్రతి చోటా కూటమి జెండాలు ఎగరాలి

- మిత్ర ధర్మాన్ని పాటించి తీరాల్సిందే
- 'చెప్పాం-చేస్తున్నాం' ప్రచారం ముమ్మరం
- గొడ్డలి పార్టీ అరాచకాలపై అప్రమత్తం చేయాలి
- స్థానిక ఎన్నికలపై సీఎం చంద్రబాబు దిశానిర్దేశం



అమరావతి(చైతన్యరథం): స్థానిక ఎన్నికలపై సీఎం చంద్రబాబు పార్టీ ముఖ్యనేతలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. 2024 తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల వేళ ప్రచారానికి ప్రజల వద్దకు వెళుతున్నాం.. ఈ ఎన్నికలను ప్రతిఒక్కరూ సీరియస్‌గా తీసుకోవాలని స్పష్టం చేశారు. 2024ఎన్నికల్లో లభించిన అద్భుత విజయం తర్వాత... ఇచ్చిన హామీలను నెరవెరుస్తూ వస్తున్నాం. 151 సీట్లతో గెలుపొంది అరాచకాలు చేసిన గొడ్డలి పార్టీకి కేవలం 11 సీట్లే ఇచ్చి నాడు ప్రజలు తిరుగుబాటు చేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక పెద్ద ఎత్తున సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. ప్రజలకు ప్రభుత్వ సేవలను సులభతరం చేస్తూ సుపరిపాలన అందిస్తున్నాం. రాష్ట్రంలోని ప్రతి వర్గానికీ... ప్రతి ప్రాంతానికీ లబ్ధి చేకూర్చేలా పాలన సాగిస్తున్నాం. రికార్డులు సృష్టించేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. కూటమి అధికారంలోకి వచ్చాక చేపట్టిన మంచి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

### 'చెప్పాం -చేస్తున్నాం' కార్యక్రమంతో ప్రజల్లోకి వెళ్లాలి

ఎన్నికల్లో చెప్పినవి మొత్తం చేస్తున్నాం... అందుకే 'చెప్పాం - చేస్తున్నాం' కార్యక్రమంతో ప్రజల్లోకి వెళ్లాలి. స్థానిక సంస్థల ఎన్నిక ల్లో బీసీలకు న్యాయం చేశాం... చిన్న కులాలకు కూడా ప్రాధాన్య తనిచ్చాం. పాలనలో తామూ భాగస్వాములమనే సంతృప్తి ప్రతిఒక్క వర్గానికి కలగాలి. ప్రభుత్వానికి... ప్రజలకు కూటమి పార్టీల కార్యకర్తలే వారధిగా నిలవాలి. కూటమి పార్టీలు చక్కటి సమ న్వయంతో క్షేత్రస్థాయిలో పనిచేయాలి. మిత్రధర్మాన్ని తప్పకుండా పాటించాల్సిందే. ఇందులో ఎలాంటి వెసులుబాటూ లేదని స్పష్టం చేశారు. మూడు స్థాయిల్లోనూ ఒకే ప్రభుత్వం ఉంటే కలిగే లాభాలను వివరించాలి. అగ్ర నేతలు మొదలుకుని... కార్యకర్త వరకు చేసే పనిని రికార్డ్ చేస్తున్నామని తెలిపారు.

### పార్టీ కోసం పనిచేసిన వారికి గుర్తింపు

పొత్తుల కారణంగా... రిజర్వేషన్ల కారణంగా... సోషల్ రీ-ఇంజనీరింగ్‌లో భాగంగా కొంతమందికి అవకాశాలు దక్కలేదు. రాష్ట్రం, పార్టీ కోసం పనిచేసిన వారికి గుర్తింపునిస్తాం. నామినేటెడ్ పదవులతో గౌరవిస్తాం. ప్రభుత్వం చేసే మంచిని వివరించడంతోపాటు... గొడ్డలి పార్టీ చేసే అరాచకాలపైనా ప్రజలను అప్రమత్తం చేయాలి. గొడ్డలి పార్టీ వల్ల రాష్ట్రానికి జరిగే నష్టాన్ని ప్రజలకు వివరించాలి. గొడ్డలి పార్టీ అధ్యక్షుడు తన స్వార్థం కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడతాడు..కుటుంబ బంధాలనూ పట్టించుకోడు. వార్డు... డివిజన్ మొదలుకుని ప్రతి స్థానంలోనూ కూటమి పార్టీల జెండాలు ఎగరాల్సిందే. కూటమి పార్టీలకు పాజి టివ్ ఓట్లు పడాలి... కూటమికి పాజిటివ్ ఓటు బ్యాంకు మరింత పటిష్టం కావాలి. ప్రతి ఓటరు పోలింగ్ బూత్‌కు వచ్చి ఓటేసేలా చూడాలి. ప్రతి పోలింగ్ బూత్‌లోనూ 2024 ఎన్నికల కంటే ఎక్కువ ఓట్లు పడాలని దిశానిర్దేశం చేశారు.

## ఏపీకి కేంద్రం భారీ సాయం

**రూ.27,370 కోట్ల గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుకు ఆమోదం**




అమరావతి(చైతన్యరథం): రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం భారీ సాయం అందించింది. ఏపీలో రూ.27,370 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న భారీ విద్యుత్ ప్రసార ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజ్ విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానించడమే లక్ష్యంగా గ్రీన్ ఎనర్జీ కారిడార్-3కు ఆమోదించింది. ఏపీలో గ్రీన్ ఎనర్జీ రంగానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ సర్కార్ ఊతమిచ్చింది. పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిని విస్తరించేందుకు గ్రీన్ ఎనర్జీ కారిడార్ (జీఈసీ 3) కింద ప్రాజెక్టుకు పచ్చజెండా ఊపింది. రాష్ట్రవ్యాప్తంగా 7,872 సర్క్యూట్ కిలోమీటర్ల విద్యుత్ లైన్లు, రామాయపట్నం, కొప్పాకలలో కొత్తగా 400 కేవీ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఏపీలో విద్యుత్ ప్రసార వ్యవస్థ ఆధునికీకరణకు మోదీ సర్కార్ ఆమోదం తెలిపింది. రూ.27,370 కోట్ల విలువైన ప్రాజెక్టుకు ఆమోదించింది. 9,500 వీఏ సామర్థ్యంతో కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం జరగనుంది. 2029-30 నాటికి ఈ ప్రాజెక్టు పూర్తి చేయడానికి ప్రణాళికలను కేంద్రం రచించింది. ఏపీలోని పోర్టు ప్రాంతాలు, పారిశ్రామిక క్లస్టర్లకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు రామాయపట్నంలో 400 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పా టు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

# మంగళగిరి టీడీపీలోకి పెద్దఎత్తున చేరికలు

- పార్టీలోకి కొలనుకొండ, ఆత్మకూరు సీపీఎం నేతలు
- పేరుకలపూడి, ఈమని, చిలువూరు వైసీపీ నేతలు
- వీరితో పాటు సుమారు 200 కుటుంబాలు చేరిక
- కండువాలు కప్పి ఆహ్వానించిన మంత్రి నారా లోకేష్



అమరావతి(చైతన్యరథం): మంగళగిరి నియోజక వర్గంలో తెలుగుదేశం పార్టీలోకి పెద్దఎత్తున చేరికలు జరిగాయి. తాడేపల్లి మండలం కొలనుకొండ గ్రామానికి చెందిన సీపీఎం మండల కమిటీ మాజీ సభ్యుడు, కాట్రగడ్డ శివన్నారాయణతోపాటు ఆ పార్టీకి చెందిన 100 కుటుంబాలు, మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామానికిచెందిన సీపీఎం మండల మాజీ కార్యదర్శి, మాజీ ఉపసర్పంచ్ ముసలి జ్యోతిబసుతోపాటు 40 కుటుంబాలు మంత్రి నారా లోకేష్ సమక్షంలో టీడీపీలో చేరాయి. దుగ్గిరాల మండలం పేరుకలపూడికి చెందిన వైసీపీ సీనియర్ నేత నూతలపాటి చెన్నకేశవ రావుతోపాటు 10 కుటుంబాలు, దుగ్గిరాల మండలం ఈమని గ్రామానికి చెందిన వైసీపీ నేత ఉయ్యూరు వెంకటేశ్వరరావుతోపాటు వైసీపీకి చెందిన 15 కుటుంబాలు, ఈమనికి చెందిన వైసీపీ నేత ముద్రబోయిన శ్రీనుతోపాటు 15 కుటుంబాలు, దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామానికి చెందిన వైసీపీ నేత షేక్ యూసబ్‌తోపాటు 10కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఉండవల్లి నివాసంలో వీరందరికీ టీడీపీ కండువాలు కప్పి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

## అత్యధిక మెజార్టీతో గెలిపించారు

ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో 21 రోజుల ముందు మంగళగిరికి వచ్చాను. నేనేంటో మీకు అర్థం కాలేదు. మీ సమస్యలేంటో నాకు తెలియవు. ఫలితంగా 5,300ఓట్ల తేడాతో ఓడిపోయాను. అప్పటి నుంచి ఐదేళ్లపాటు ప్రజల్లో ఉండి వారి సమస్యలు అర్థం చేసుకున్నా. మంగళగిరి నియోజకవర్గ ప్రజల కోసం 26 సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పార్టీ పరంగా చేపట్టాం. అంతకుముందు 15ఏళ్లు మంగళగిరి నుంచి ఎమ్మెల్యేగా, మంత్రిగా ప్రాతినిధ్యంవహించిన వారు చేసిన అభివృద్ధిని, నేను చేపట్టిన కార్యక్రమాలను బేరీజు వేసుకుని 53వేల ఓట్ల మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశా. ఎంత ఎక్కువ మెజార్టీతో గెలిపిస్తే అంత బలం వస్తుందని ఆనాడు చెప్పా. 2024 ఎన్నికల్లో రాష్ట్రంలోనే మూడో అత్యధిక 91వేల మెజార్టీతో గెలిపించారని తెలిపారు.

## 7 వేల ఇంటి పట్టాలు అందించాం

అత్యధిక మెజార్టీతో గెలిపించారు కనుకనే మంగళగిరి నియోజకవర్గంలో పెద్దఎత్తున అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాం. కమ్యూనిటీ, అంగన్‌వాడీ భవనాలు, పార్కులు, చెరువులు, శ్మశానాలు, చర్చిలు, దేవాలయాలు అభివృద్ధిచేశాం. దేశం మొత్తం మంగళగిరి వైపు చూసేలా నిడమర్రు ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేశాం. క్రమ పద్ధతిలో ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నాం. కక్షలు ముఖ్యం కాదు.. అభివృద్ధి ముఖ్యం అనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. మొదటి దశ కింద రూ.1,300 కోట్లతో భూగర్భ డ్రైనేజీ పనులు చేపట్టాం. 2029నాటికి ప్రతి గడపకు భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువస్తాం. అండర్ గ్రౌండ్ డ్రింకింగ్ వాటర్, గ్యాస్, కరెంట్ అందిస్తాం. దశాబ్దాలుగా ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న వారికి శాశ్వత ఇంటి పట్టాలు అందజేశాం. నూతన వస్త్రాలు, భోజనం పెట్టి ఇప్పటి వరకు 7వేల ఇంటి పట్టాలు అందించిన ఘనత ఎన్డీయే ప్రభుత్వానిదని చెప్పారు.

## నేతలు ప్రజల మనస్సు గెలుచుకోవాలి

మంగళగిరి నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాం. నియోజకవర్గ అభివృద్ధికి ఐదేళ్లు అహర్నిశలు కష్టపడతా.స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు భారీమెజార్టీతో గెలిచేలా చూడాల్సిన బాధ్యతస్థానిక నాయకత్వానిదే. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలి. ప్రజల మనస్సు గెలుచుకోవాల్సిన బాధ్యత ఇక్కడి నాయకులపై ఉంది. అహంకారం వీడాలి. అందరినీ కలుపుకునిపోవాలి.నియోజకవర్గ అభివృద్ధికి అందరం కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరంఉందని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనుంజయరావు,పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ నందం అబద్ధయ్య, మంగళగిరి నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, తాడేపల్లి రూరల్ టీడీపీ అధ్యక్షుడు దాసరి కృష్ణ, మంగళగిరి మండల పార్టీ అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### మీ ఆశీస్సులు ఎప్పటికీ ఉండాలి

మంగళగిరి నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెద్దుల బండిలా ముందుకు తీసుకువెళుతున్నాం. మీ ఆశీస్సులు ఎప్పటికీ ఉండాలని కోరుతున్నా. మంగళగిరిలో భారీ మెజార్టీతో గెలిపించడం వల్ల అడిగిన పనులు కాదనకుండా మంజూరు చేస్తున్నారు. దేశం మొత్తం మంగళగిరి వైపు చూసే లా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలనేది నా లక్ష్యం. నా మొదటి ప్రాధాన్యత మంగళగిరి. ఈరోజు ఉపరాష్ట్రపతి వస్తే మంగళగిరి చేనేత శాలువాతో సత్కరించాం. వారి సతీమణికి మంగళగిరి చేనేత చీరను బహూకరించాం. ఇక్కడ పుట్టక పోయినా మంగళగిరిని నా సొంతం చేసుకున్నా. మంగళగిరిని నా గుండెల్లో పెట్టుకుని చూసుకుంటానని తెలిపారు.









# ఏపీలో ఆయిల్ పామ్ సంస్థ పెట్టుబడి

- **నల్లజర్లలో రూ.224 కోట్లతో త్రీఎఫ్ కాంప్లెక్స్**
- **సాగు, ప్రాసెసింగ్‌తో 750 ఉద్యోగాలు**
- **ఎక్స్ వేదికగా మంత్రి నారా లోకేష్ వెల్లడి**

అమరావతి(చైతన్యరథం): ఏపీకి మరో పెట్టుబడి వచ్చింది. దేశంలో ప్రముఖ ఆయిల్ పామ్ సాగు, ప్రాసెసింగ్ సంస్థ త్రీ ఎఫ్ ఆయిల్ పామ్ రూ.224 కోట్ల పెట్టుబడులు పెడుతోందని మంత్రి నారా లోకేష్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లాలోని నల్లజర్లలో ఈ సంస్థ ఆయిల్ పామ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేసి..ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ చేపట్టనుందని తెలిపారు. తద్వారా గోదావరి ప్రాంతంలోని వేలాది మంది ఆయిల్ పామ్ రైతులకు ప్రాసెసింగ్, శుద్ధి మరింత చేరువకావడంతో వారి ఆదాయ మార్గాలు పెరుగుతాయని, వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ బలోపేతమ వుతుందని పేర్కొన్నారు. ఈ సంస్థ పెట్టుబడులతో 750 ఉద్యోగా లు రానున్నాయని వివరించారు. పెట్టుబడులను ఆకర్షిస్తూ రాష్ట్రం లోని ప్రతి మూలకూ అభివృద్ధిని తీసుకెళ్లే విధానాలను అను సరి స్తున్నాం. 'చెప్పాం.. చేసి చూపించాం' అని పేర్కొన్నారు.

# అర్నబ్ తుఫాన్ ఎఫెక్ట్

## నేడు, రేపు పలు జిల్లాల్లో పాఠశాలలకు సెలవులు



అమరావతి(చైతన్యరథం): ఆర్నాబ్ తుఫాన్ తీవ్రత దృష్ట్యా ఏపీలోని పలు జిల్లాల్లో పాఠశాలలకు అధికారులు సెలవులు ప్రకటించారు. ఈ నెల 27, 28 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతో పాటు అంగన్వాడీ కేంద్రాలకు సెలవులిస్తున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి వెల్ల డించారు. మరోవైపు విశాఖ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పాఠశాలలకు మంగళ, బుధవారాల్లో సెలవులు ప్రక టించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమకుమార్ వెల్లడించారు. విద్యార్థుల రక్షణ, భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలి పారు. నిబంధనలు ఉల్లంఘించి ఎవరైనా పాఠశాలలు తెరిస్తే.. కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కృష్ణా జిల్లా వ్యాప్తంగా పాఠశాలలకు మంగళ, బుధవారాల్లో సెలవులు ఇస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రకటన విడుదల చేశారు.

### కాకినాడలో ప్రత్యేక బృందాలు

తుఫాన్ దృష్ట్యా కాకినాడ జిల్లాలో 101 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. తీర ప్రాంతాల్లోని 89 వేల మందికి ముందస్తు హెచ్చరికలు జారీ చేశామన్నారు. మంగళవారం మధ్యాహ్నం లోపు తీరప్రాంత ప్రజల తరలింపునకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. ఆరు తీరప్రాంత మండలాలతోపాటు మరో ఐదు మండలాలపై ప్రత్యేక దృష్టి సారించాం. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దని ఇప్పటికే సూచించాం. జిల్లాలోని 4,602 బోట్లలో 4,559 బోట్లు సురక్షిత ప్రాంతాలకు తరలించాం. మిగిలిన 43 బోట్లు పారాదీప్ తదితర హార్బర్లలో సురక్షితంగా ఉన్నాయి. ఆసుపత్రులు, తాగునీటి పథకా లకు ప్రత్యామ్నాయ విద్యుత్ ఏర్పాటు చేశాం. విద్యుత్ అంత రాయాల పరిష్కారానికి, రహదారులపై కూలిన చెట్ల తొలగింపునకు ప్రత్యేక బృందాలను సిద్ధం చేశాం. పెట్రోల్ బంకుల్లో ఇంధన నిల్వలు సమృద్ధిగా ఉంచాలని ఆదేశించాం. మంగళవారం మధ్యాహ్నం 2 నుంచి ఎల్లుండి సాయంత్రం వరకు అత్యవసరమైతేనే ప్రయాణాలు చేయండి. రెండు, మూడురోజులకు సరిపడా ఆహారం, తాగునీరు, మందులు సిద్ధం చేసుకోవాలి. ఈ నెల 27, 28 తేదీల్లో పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించాం. అత్యవసర సహాయం కోసం 0884 2356001, 984990 3879 నంబర్లను సంప్రదించవచ్చు అని కలెక్టర్ వెల్లడించారు.





- *ఒకే రాజధాని అభివృద్ధి వికేంద్రీకరణ*
- *2019లో చంద్రన్న పాలన కొనసాగి ఉంటే ప్రజా రాజధాని అమరావతి ఇప్పటికే మరో సైబరాబాద్ అయి ఉండేది.*
- *సైబరాబాద్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని ప్రతి పల్లె, ప్రతి పట్టణంలోని 30 లక్షల మందికి ఉద్యోగాలు, ఉపాధి కల్పించింది.*
- *అమరావతి నవ్యాంధ్రలోని 175 నియోజకవర్గాల యువతకు లక్షలాది ఉద్యోగాలు కల్పిస్తుంది.*
- *అమరావతిలో ప్రభుత్వానికి రైతులిచ్చిన మిగులు భూముల విలువ రూ.3లక్షల కోట్లు*
- *ఈ నిధుల్లో కొంత భాగంతోనే అమరావతి నిర్మాణాలు*
- *మిగులు నిధులతో 175 నియోజక వర్గాల అభివృద్ధి*




- *స్వర్ణాంధ్ర విజన్ 2047 ద్వారా తలసరి ఆదాయం రూ.3 లక్షల నుంచి రూ.50 లక్షలకు పెంచుతుంది.*
- *రాజధానిలోసుమారు రూ.50,999 కోట్ల విలువైన పనులు శరవేగంగా జరుగుతున్నాయి.*
- *దేశంలోనే తొలి క్వాంటమ్ వ్యాలీ ట్విన్ టవర్లు అమరావతిలో నిర్మాణమవుతున్నాయి.*






# డిసెంబరులో డీజీపీ, ఐజీపీల సమావేశం

### *హాజరుకానున్న ప్రధాని నరేంద్ర మోదీ*

### *సీఎస్ సాయిప్రసాద్ ఆధ్వర్యంలో సమీక్ష*



అమరావతి(చైతన్యరథం): తిరుపతి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (ఐఐఎస్‌ఈఆర్)లో డీజీపీలు, ఐజీపీల సమావేశం డిసెంబరు 4వ తేదీ నుంచి 6 తేదీ వరకు జరుగనుంది. ఈ సమావేశానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హాజరుకానున్నారు.

ఇందుకు సంబంధించి సోమవారం ఏపీ సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఆధ్వర్యంలో ఇంటర్ డిపార్టు మెంటల్ కమిటీ సమావేశం జరిగింది.

ఈ సమీక్షలో అధికారులకు పలు కీలక అంశాలపై సీఎస్ దిశానిర్దేశం చేశారు. ప్రధాని పాల్గొనే సమావేశంలో ఎక్కడా పొరపాట్లకు ఆస్కారం లేని రీతిలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సీఎస్ సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆయా శాఖల వారీగా చేప ట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## దేశంలోనే తొలి ఆరోగ్య విశ్వవిద్యాలయం

# ఎన్టీఆర్ దూరదృష్టికి నిదర్శనం





- వర్సిటీ నుంచి నోబెల్ గ్రహీతలు రావాలి
- అంతర్జాతీయ పరిశోధనల్లో గుర్తింపు సాధించాలి
- చెన్నై నగరానికి తెలుగుగంగ నీరు ప్రశంసనీయం
- 40వ వార్షికోత్సవంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణ
- మరిన్ని విజయాలు సాధించాలని గవర్నర్ ఆకాంక్ష

విజయవాడ(చైతన్యరథం):దేశంలోనే తొలి ఆరోగ్య విశ్వవిద్యా లయం ఎన్టీఆర్ దూరదృష్టికి నిదర్శనమని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణ కొనియాడారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ 40వ వార్షికోత్సవం సోమవారం విజయవాడలో ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌తో పాటు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి మాట్లాడుతూ వైద్య విద్యారంగం, ఎన్టీఆర్ సేవలు, దేశ ఆరోగ్య రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులపై కీలక వ్యాఖ్యలు చేశారు. విద్య, వైద్య, ఆరోగ్య, సంక్షేమ, సాంస్కృతిక రంగాలు, తెలుగు భాషాభివృద్ధికి స్వర్గీయ ఎన్టీఆర్ చేసిన సేవలు కొని యాడారు. దేశంలోనే తొలి వైద్య విశ్వవిద్యాలయాన్ని స్థాపించడంలో ఎన్టీఆర్ చూపిన దూరదృష్టి ఎంతో కీలకమైనదని పేర్కొన్నారు. 'తెలుగు గంగ' ప్రాజెక్టు ద్వారా చెన్నై నగరానికి తాగునీరు అందించిన ఎన్టీఆర్ దాతృత్వం, మానవతా దృక్పథం ఎంతో ప్రశంసనీయ మని గుర్తు చేసుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో 'వికసిత్ భారత్ 2047' లక్ష్యానికి అనుగుణంగా గత 12 ఏళ్లలో దేశవ్యాప్తంగా వైద్య కళాశాలలు, సీట్ల సంఖ్య గణనీయంగా పెరి గిందని ఉపరాష్ట్రపతి గణాంకాలతో సహా వివరించారు. ఎన్టీఆర్ యూనివర్సిటీ నుంచి భవిష్యత్తులో నోబెల్ బహుమతి గ్రహీతలు రావాలని, ఇక్కడి విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో పరిశోధన ల్లో గుర్తింపు



సాధించాలని ఆకాంక్షించారు. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు సరికొత్త పరిష్కారాలు కనుగొనేలా అధునాతన పరిశోధనలపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. వైద్య రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ హెల్త్ సాంకే తికతలకు ప్రాధాన్యం పెరుగుతోందని, సాంకేతికత ఎంత పెరిగి నా వైద్యులు 'మానవీయ స్పర్శ'ను మరవకూడదని హితవు పలికా రు. వైద్య వృత్తిలో కరుణ, మానవత్వం, రోగుల పట్ల ఆప్యాయత చూపడం అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. మాదకద్రవ్యాల విని యోగాన్ని అరికట్టేందుకు వైద్యులు, యువత ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలపై సమాజంలో విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు.




### విద్యా రంగంలో ఎన్టీఆర్ చరిత్రాత్మక నిర్ణయం: గవర్నర్

గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ భారతదేశంలోనే తొలి ప్రత్యేక వైద్య విశ్వవిద్యాలయంగా ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి గుర్తింపు ఉందని పేర్కొన్నారు. 1986లో ఎన్టీఆర్ దార్శనికతతో ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయాన్ని స్థాపించారన్నారు. విద్యా రంగంలో ఎన్టీఆర్ చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారన్నారు. ఆధు నిక వైద్యం నుంచి నర్సింగ్, దంత వైద్యం వరకు విద్యా విభా గాలు విస్తరించాయని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగు ణంగా వైద్య విద్యలో సాంకేతిక పరిజ్ఞానం కీలకమని చెప్పుకొ చ్చారు. వైద్య విద్యలో కృత్రిమ మేధస్సు, డిజిటల్ అభ్యసనానికి ప్రాధాన్యం పెరుగుతోందన్నారు. విద్యార్థులకు పుస్తక జ్ఞానంతో పాటు కమ్యూనికేషన్, సానుభూతి, టీమ్‌వర్క్ అవసరమన్నారు. వైద్య విద్య, శిక్షణ జీవితాంతం కొనసాగాల్సిన ప్రక్రియలని చెప్పు కొచ్చారు. విద్యా ప్రమాణాలు, పారదర్శక పరిపాలన, నిష్పక్షపాత పరీక్షలకు ప్రాధాన్యమన్నారు. విద్యార్థుల ప్రతిభ, నాణ్యతే విశ్వ విద్యాలయానికి నిజమైన బలమని వ్యాఖ్యానించారు. వైద్య వృత్తిలో నైతిక విలువలు, రోగుల గోప్యత, మానవీయ దృక్పథం కీలకమని తెలిపారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థుల సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. వైద్య విద్యతో పాటు పరిశోధనా రంగాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. అధ్యాప కుల నైపుణ్యాభివృద్ధి, మెరుగైన క్లినికల్ శిక్షణకు ప్రాధాన్యమ న్నారు. అనుబంధ కళాశాలలు, ప్రభుత్వంతో సమన్వయం పెంచుకోవాలని సూచించారు. యువ పరిశోధకులను ప్రోత్సహి స్తూ పరిశోధనా సహకారాన్ని విస్తరించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ బలోపేతానికి విశ్వవిద్యాలయం కృషి చేయాలని, రాబోయే దశాబ్దాల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ కుటుంబానికి గవర్నర్ అబ్దుల్ నజీర్ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.





# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణ



తిరుమల(చైతన్యరథం): భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ సోమవారం సాయంత్రం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ముందుగా క్షేత్ర సాంప్రదాయాన్ని పాటిస్తూ ఉప రాష్ట్రపతి వరాహ స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీవారి ఆలయం వద్దకు ఉపరాష్ట్రపతి చేరుకోగానే టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, సీవీఎస్వో మురళీకృష్ణలు ఆయనను సాదరంగా ఆహ్వానించగా, అర్చక బృందం ఆలయ మర్యాదలతో ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. తరువాత ఆయన ధ్వజస్తంభానికి నమస్కరించుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం వకుళామాత, విమాన వేంకటేశ్వర స్వామి, భాష్యకార్ల సన్నిధి, యోగ నరసింహస్వామివారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందించారు. భారత ఉపరాష్ట్రపతికి టీటీడీ ఈవో, అదనపు ఈవో స్వామి వారి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను అందించారు. ఉప రాష్ట్రపతి శ్రీవారి ఆలయం ఎదురుగా ఉన్న బేడి ఆంజనేయస్వామి వారిని కూడా అనంతరం దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖుల్లో జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, టీటీడీ బోర్డు సభ్యులు రామ్మూర్తి, దివాకర్‌రెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు, పలువురు రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## గన్నవరం విమానాశ్రయంలో

# ఉపరాష్ట్రపతికి ఘనస్వాగతం





విజయవాడ(చైతన్యరథం): ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వార్షికోత్సవాల్లో పాల్గొనేందుకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌కు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌తో కలిసి మంత్రి నారా లోకేష్ ఘనస్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందించారు.

లోకేష్‌తో పాటు ఉపరాష్ట్రపతికి స్వాగతం పలికిన వారిలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు. సీపీ రాధాకృష్ణన్‌ను లోకేష్ శాలువాతో సత్కరించి ప్రత్యేక జ్ఞాపికను బహూకరించారు. విజయవాడ అంబేద్కర్ కళావేదికలో డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వ విద్యాలయం 40 ఏళ్ల రూబీ జూబ్లీ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు. అనంతరం మధ్యాహ్నం తిరుపతికి చేరుకుని శ్రీవారిని దర్శించుకుంటారు.









## ఏపీ మున్సిపల్ ఎన్నికలు..

# పోస్టల్ బ్యాలెట్‌పై కొత్త మార్గదర్శకాలు

### ప్రచార ఖర్చులపైనా కీలక సూచనలు




విజయవాడ(చైతన్యరథం): మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపా లిటీలు, నగర పంచాయతీల ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ముద్రణపై ఏపీ రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. పోస్టల్ బ్యాలెట్ల లో అభ్యర్థుల పేర్ల ముద్రణకు సంబంధించి పాత నిబంధనలను ఎన్నికల సంఘం సవరించింది.

తాజా మార్గదర్శ కాల ప్రకారం అభ్యర్థులను మూడు కేట గిరీలుగా విభజిస్తూ నిర్ణయం తీసుకుంది. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్య ర్థులు, రిజిస్టర్డ్ రాజకీయ పార్టీల అభ్యర్థు లు, ఇతర అభ్యర్థులుగా విభజించింది. పోస్టల్ బ్యాలెట్ ప్యానెల్‌పై అభ్యర్థి పేరు, పార్టీ పేరును మొదట తెలుగులో, కింద ఆంగ్లంలో ముద్రించాలని ఎస్ఈసీ సూచించింది.

పోస్టల్ బ్యాలెట్ పత్రాలపై ఎలాంటి ఎన్నికల గుర్తులు (సింబల్స్) ముద్రించరాదని ఎన్నికల సంఘం మరో సారి స్పష్టం చేసింది. ఏ రాజకీయ పార్టీకి చెందని స్వతంత్ర అభ్యర్థుల పేర్ల కింద తెలుగు, ఆంగ్లంలో ఇండిపెండెంట్ అని ముద్రించాలని పేర్కొంది. సాధారణ బ్యాలెట్ పత్రం, పోస్టల్ బ్యాలెట్ పత్రం రెండింటిలోనూ అభ్యర్థుల పేర్ల వరుస క్రమం ఒకే విధంగా ఉంటుందని రాష్ట్ర ఎన్నికల సంఘం(ఎస్ఈసీ) వెల్లడించింది.

### స్థానిక ఎన్నికల్లో ప్రచార ఖర్చులపై మార్గదర్శకాలు

స్థానిక సంస్థల ఎన్నికల ప్రచార ఖర్చులపై రాష్ట్ర ఎన్నికల సంఘం అధి కారులు కీలక మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రకటనల్లో అభ్యర్థి పేరు లేదా ఫొటో ఉంటే ఆ ఖర్చు పూర్తిగా అభ్యర్థిదేనని స్పష్టం చేశారు. అభ్యర్థి ప్రస్తావన లేకుండా, కేవలం పార్టీ నేతల ఫొటోలతో ఇచ్చే సాధారణ ప్రకటనల ఖర్చు రాజకీయ పార్టీల ఖాతాలోకే జమ చేస్తామని తెలిపారు. పోస్టర్లు, బ్యానర్లు, జెండాలు తదితర ప్రచార సామగ్రిపై అభ్యర్థి ప్రస్తావన ఉంటే అది అభ్యర్థి ఎన్నికల ఖర్చు కిందే లెక్కకు వస్తుందని ఎన్నికల అధికారులు వెల్లడించారు. అభ్యర్థి పేరు లేకుండా పార్టీల నేతల ఫొటోలు మాత్రమే ఉన్న ప్రచార సామగ్రి ఖర్చును కూడా పార్టీల ఖాతాలోకే వర్తింపజేస్తున్నట్లు తెలిపారు. సాధారణ ప్రచారానికి పార్టీ నేతలకు కేటాయించిన వాహనాల్లో అభ్యర్థి కూడా పాల్గొంటే, ఆ వాహన ఖర్చును అభ్యర్థి ఖర్చుల జాబితాలోనే లెక్కిస్తామని చెప్పుకొచ్చారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నేతలకు (స్టార్ క్యాంపెయినర్లకు) సాధారణ ప్రచారం కోసం ఆయా నిబంధనల ప్రకారం వాహన పాసులను మంజూరు చేస్తామని ఎన్నికల అధికారులు పేర్కొన్నారు.

# తుఫాన్ సహాయక చర్యలకు
# రూ.27 కోట్ల నిధులు విడుదల

## సమస్య తెలిపేందుకు మనమిత్ర వాట్సాప్ - దక్షిణ కోస్తా పరిధిలో పలు రైళ్లు రద్దు



అమరావతి(చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో అర్నబ్ తుఫాన్ సహాయక చర్యల కోసం రాష్ట్ర ప్రభుత్వం 20 జిల్లాలకు రూ.27కోట్ల నిధులు విడుదల చేసింది. బాపట్ల, కృష్ణా, పశ్చిమగోదావరి, కోనసీమ, తూర్పుగోదావరి, కాకినాడ, అనకాపల్లి జిల్లాలకు రూ.2 కోట్ల చొప్పున నిధులు విడుదల చేశారు. శ్రీకాకుళం, మార్కాపురం, గుంటూరు, ఎన్టీఆర్, ఏలూరు, అల్లూరి, పోలవరం, మన్యం, విశాఖపట్నం, విజయ నగరం, శ్రీసత్యసాయి, నెల్లూరు, తిరుపతి జిల్లాలకు రూ.కోటి చొప్పున నిధులు మంజూరు చేస్తూ విపత్తుల నిర్వహణశాఖ స్పెషల్ సీఎస్ జి.సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.




### సమస్యల పరిష్కారానికి వాట్సాప్ సేవలు

తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు తమ సమస్యలు మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా తెలిపే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. తుఫాన్ సమయంలో కరెంటు సమస్యలు, చెట్లు కూలడం, గోడలు కూలడం, నీళ్లు రావడం వంటి సమస్య లు ఎదురైతే మనమిత్ర ద్వారా వెంటనే అధికారులకు తెలియ జేయవచ్చు. ఈ సేవల కోసం 9552300009 నెంబరుకు హాయ్ అని మెసేజ్ చేయాలి. అర్నబ్ తుఫాన్ సమస్య అనే ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలి. రిపోర్ట్ ఇష్యూను ఎంపిక చేసుకుని కన్ఫర్మ్ ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలని వెల్లడించారు. ఆ తర్వాత రిజిస్ట్రేషన్ ఆప్షన్ ఎంపిక చేసుకోవాలని తెలిపారు. తర్వాత మీ పేరు, జిల్లా, మండలం నమోదు చేసి సమస్యను నమోదు చేయవచ్చు. వర్షానికి సంబంధించిన ఫొటోలు కూడా అప్‌లోడ్ చేయొచ్చు. వెంటనే ఆ సమస్యను ఆ ప్రాంతంలో సంబంధిత అధికారికి పంపి వెంటనే సమస్య పరిష్కారమయ్యేలా చూస్తారు.

### తుఫాన్ వేళ పలు రైళ్ల రద్దు

అర్నబ్ తుఫాన్ వేళ దక్షిణ కోస్తా రైల్వే జోన్ పరిధిలో పలు రైళ్లు రద్దయ్యాయి. ఈ మేరకు జోన్ అధికారులు ఆ రైళ్ల వివరాలను వెల్లడించారు. మంగళవారం ప్రయాణించే విజయవాడ - రాజమండ్రి (67202), విజయవాడ-నరసాపురం (67257), విజయవాడ-మచిలీపట్నం (67267), నరసాపురం- గుంటూరు (67247), రాజమండ్రి- కాకినాడ పోర్ట్ (67301), రాజమండ్రి- విశాఖ (67285/67286), విజయవాడ-నరసాపురం (67258), నరసాపురం-విజయవాడ (67276), నరసాపురం- రాజమండ్రి (67246), విజయవాడ- నరసాపురం (17269), నరసాపురం- భీమవరం (17264), విజయవాడ-కాకినాడ పోర్ట్ (17257) రైళ్లను రద్దు చేశామని రైల్వే జోన్ అధికారులు ప్రకటించారు. అలాగే 28వ తేదీన బుధవారం ప్రయాణించే నరసాపురం-నిడదవోలు (67244/67245), నరసాపురం - విజయవాడ (17270), గుంటూరు- రేపల్లె (67249/67223), రేపల్లె - గుంటూరు/తెనాలి (67250/67224), విజయవాడ -రాజమండ్రి (67262), గుంటూరు/తెనాలి -విజయవాడ (67248/67222), విజయవాడ- గుంటూరు (67229), భీమవరం- మచిలీపట్నం (67251), విజయవాడ-మచిలీపట్నం (67266/ 67268/ 67269/67270), విజయవాడ -భీమవరం (67275/67281), భీమవరం- నిడదవోలు (67277/67283), నిడదవోలు - భీమ వరం (67278/67284), భీమవరం-విజయవాడ(67282), కాకినాడ పోర్ట్- రాజమండ్రి (67302), కాకినాడ- విజయవాడ (17258) రైళ్లు రద్దయ్యాయి. మంగళ, బుధవారాలు రెండు రోజుల పాటు మరికొన్ని రైళ్లను అధికారులు రద్దు చేశారు. అందులో కాకినాడ పోర్ట్ - విశాఖ (17267/17268), పార్వతీపురం -విశాఖ (07267/07268), రాజమహేంద్రవరం-విజయవాడ (67261), విజయవాడ- మచిలీపట్నం (67263/67265), మచిలీపట్నం- విజయవాడ (67264/67256), మచిలీపట్నం- గుడివాడ (67271/67252/67254), గుడివాడ-మచిలీపట్నం (67272/67253/67255) రైళ్లు ఉన్నాయి.



## తీరప్రాంతంలో ముందస్తు చర్యలు

అమరావతి (చైతన్యరథం): అర్నబ్ తుఫాన్ మరింత బలపడే అవకాశం ఉండటంతో ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మంగళవారం మధ్యాహ్నం నుంచి తీర ప్రాంత రహదారులను బంద్ చేస్తూ నిర్ణయం తీసుకుంది. ముందస్తు చర్యలలో భాగంగా మంగళవారం ఉదయం నుంచి బీచ్‌లను మూసివేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ప్రాణ నష్టం జరగకుండా చూడటమే లక్ష్యమని అధికారులు తెలిపారు. బంగాళాఖాతంలో వాయుగుండం కదలికలు.. ప్రభావంపై ఆర్టీజీఎస్ కార్యదర్శి కాంటనేని భాస్కర్, సీఈవో ప్రఖర్ జైన్ నిరంతర సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఆయా శాఖల అధికారులతో ముందస్తు సన్నద్ధతపై సమీక్షలు నిర్వహించారు. తుఫాన్ సన్నద్ధత చర్యలపై ఎప్పటికప్పుడు సీఎంకు వివరిస్తున్నారు. 11 జిల్లాలకు ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ ఎఫ్ బృందాలను తరలించారు. ఇదే సమయంలో లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. 16 జిల్లాల్లో 2,460 రెవె న్యూ గ్రామాలు, 92 పట్టణ ప్రాంతాల్లో తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. 1,763 తుఫాన్ షెల్టర్లను ఏర్పాటు చేశారు. జిల్లా స్థాయి, మండల స్థాయిలో 2,907 కంట్రోల్ రూములు ఏర్పాటు చేశారు. తుఫాన్ సహా యక చర్యల కోసం 3,185 మంది నోడల్ ఆఫీసర్లను ప్రభుత్వం నియమించింది. 2,107 స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డుల పరిధిలో బాధితుల తరలింపునకు చర్యలు చేపట్టారు. చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులంతా ఇళ్లకు చేరుకునేలా చర్యలు

- రహదారుల బంద్.. ఉదయం నుంచి బీచ్‌ల మూసివేత
- 11 జిల్లాలకు ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు
- జిల్లా, మండల స్థాయిలో 2,907 కంట్రోల్ రూమ్‌లు
- 1,763 తుఫాన్ షెల్టర్ల ఏర్పాటు చేసిన ప్రభుత్వం
- రేవుల్లోనే 30,043 పడవల నిలిపివేత
- ప్రభావిత ప్రాంతాల్లో వైద్య సేవలకు ప్రత్యేక ఏర్పాట్లు
- సహాయక చర్యల కోసం నోడల్ ఆఫీసర్లు

చేపట్టారు. మత్స్య కారులకు చెందిన 30,043 పడవలన్నీ రేవుల్లో నిలిపివేశారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో వైద్య సేవలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నీటి సమస్య తలెత్తకుండా 2,613 అత్య వసర నీళ్ల ట్యాంకులు సిద్ధం చేశారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో చెట్లు కూలితే వెంటనే తొలగించేలా అగ్నిమాపక దళాలను ప్రభుత్వం సిద్ధం చేసింది.

చైతన్యరథం

# ‘అర్నబ్’ తీవ్ర తుఫాను నేపథ్యంలో
# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి






- రేపు బాపట్ల-విశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశం
- గంటకు 115-125 కి.మీ. వేగంతో గాలులు
- గరిష్ఠంగా 140 కి.మీ. వరకు పెరిగే ప్రమాదం
- ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీరాలకు రెడ్ అలర్ట్
- మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దు
- రైతులు పంటల సంరక్షణకు ముందస్తు చర్యలు చేపట్టాలి
- పంటల కంటే ప్రాణ రక్షణకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలి
- వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్యశాఖ అధికారుల సూచనలు పాటించాలి
- వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

అమరావతి (చైతన్యరథం): బంగాళాఖాతంలో ఏర్పడిన ‘అర్నబ్’ తుఫాను తీవ్రరూపం దాల్చుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రజలు, రైతులు, మత్స్యకారులు, పశు పోషకులు, పౌల్ట్రీ రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. పశ్చిమ మధ్య ప్రాంతంలో కొనసాగిన తీవ్ర వాయుగుండం తుఫానుగా మారిందన్నారు. మంగళవారం అత్యంత తీవ్ర తుఫానుగా బలపడి బుధవారం ఉదయం బాపట్ల-విశాఖపట్నం మధ్య ఆంధ్రప్రదేశ్-యానాం తీరాన్ని దాటే అవకాశముందన్నారు. తీరం దాటే సమయంలో గంటకు 115-125 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉండగా... గరిష్ఠంగా 140 కిలోమీటర్లకు చేరవచ్చని హెచ్చరించారు. 27, 28 తేదీల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే ప్రమాదముందున్న అధికారులు జారీచేసే హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.

తీర ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు అవసరమైతే ముందుగానే సురక్షిత ప్రాంతాలు, పునరావాస శిబిరాలకు తరలివెళ్లాలని, అత్యవసర మందులు, తాగునీరు, పొడి ఆహారం, టార్చ్‌లైట్లు, బ్యాటరీలు, మొబైల్ చార్జర్లు, ముఖ్యమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన తీగలు, పెద్ద చెట్లు, బలహీన భవనాలు, హోర్డింగులు, నిర్మాణ ప్రాంతాలకు దూరంగా ఉండాలని, వరద నీటిలో మునిగిన విద్యుత్ పరికరాలను తాకవద్దని స్పష్టం చేశారు. చిన్న పిల్లలు, వృద్ధులు, గర్భిణులు, దివ్యాంగుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, అనవసర ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించారు. కలుషిత నీటిని వినియోగించకుండా కాచి చల్లార్చిన నీటిని తాగాలని, భారీ గాలులు, ఉరుములు, పిడుగుల సమయంలో బయటకు వెళ్లొద్దని కోరారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని, ఇప్పటికే సముద్రంలో ఉన్న పడవలు తక్షణం సురక్షిత తీరాలకు చేరుకోవాలని ఆదేశించారు. పడవలు, వలలు, ఇంజిన్లు, ఇతర సామగ్రిని భద్రపరచుకోవడంతో పాటు బీచ్‌లు, రేవులు, సముద్రపు గట్ల వద్దకు ఎవరూ వెళ్లవద్దని హెచ్చరించారు.

తుఫాను ప్రభావంతో పంటలకు నష్టం వాటిల్లకుండా రైతులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. కోతకు సిద్ధంగా ఉన్న వరి, పత్తి, మొక్కజొన్న, వేరుశనగ, మినుము, పెసర, కంది తదితర పంటలను వాతావరణం అనుకూలంగా ఉన్నప్పుడు కోసి సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ధాన్యం, వ్యవసాయ ఉత్పత్తులు తడవకుండా టార్పాలిన్లతో కప్పి భద్రపరచుకోవాలన్నారు. పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా మురుగు కాలువలను శుభ్రం చేయాలని, వరి పైరుపై వర్షాల సమయంలో యూరియా, ఇతర ఎరువుల పైపూతను వాయిదా వేయాలని సూచించారు. పత్తిలో పింక్ బోల్‌వార్మ్, తామర పురుగులు, మొక్కజొన్నలో కాండం కుళ్లు, కత్తెర పురుగు, వేరుశనగలో టిక్కా ఆకుమచ్చ, వేరు కుళ్లు, పప్పుధాన్యాల్లో కాయ తొలుచు పురుగుల ఉధృతిని వర్షాల అనంతరం పరిశీలించాలన్నారు. తడిసిన పత్తి, ధాన్యం, కాయలు, గింజలను పూర్తిగా ఆరబెట్టిన తర్వాతే నిల్వ చేయాలని కోరారు.

మిరప, టమాటా, వంగ, బెండ తదితర కూరగాయల పొలాల్లో నీటిపారుదల సక్రమంగా ఉండేలా చూడాలని, తీగజాతి పంటల పందిళ్లను బలపరచాలని సూచించారు. అరటి, బొప్పాయి వంటి ఉద్యాన పంటలకు మద్దతు కర్రలు ఏర్పాటు చేయాలని, పండిన పండ్లు, కూరగాయలను అనుకూల వాతావరణంలో కోసి భద్రపరచుకోవాలన్నారు. చెరకు, ఇతర నిలువు పంటలు గాలులకు పడిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వర్షాల తరువాత ఆకుమచ్చలు, బ్యాక్టీరియా వ్యాధులు, కాండం, వేరు కుళ్లు లక్షణాలను పరిశీలించాలని తెలిపారు. వర్షాలు కురుస్తున్నప్పుడు పురుగు మందుల పిచికారీ చేయకూడదని, పంట పరిస్థితిని బట్టి శాస్త్రవేత్తల సలహాతో మాత్రమే ఎరువులు, మందులు వినియోగించాలని సూచించారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, ధాన్యం బస్తాలను ఎత్తైన ప్రదేశాల్లో ఉంచాలని, కోత యంత్రాలు, ట్రాక్టర్లు, పంపుసెట్లు, డ్రిప్ వ్యవస్థలు, విద్యుత్ మోటార్లను వరదనీటి నుంచి రక్షించుకోవాలన్నారు.

తుఫాను అనంతరం పొలాల్లో నిల్వ నీటిని తొలగించి పంటలు, పశువులు, కోళ్ల షెడ్లు, వ్యవసాయ పరికరాలకు జరిగిన నష్టాన్ని అంచనా వేయాలని మంత్రి పేర్కొన్నారు. నష్టానికి సంబంధించిన ఫొటోలు, పత్రాలను భద్రపరచుకుని సంబంధిత అధికారులకు, బీమా సంస్థలకు నిబంధనల ప్రకారం తెలియజేయాలన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తల సూచనలను స్థానిక వాతావరణ పరిస్థితులు, పంట దశ, నేల స్వభావానికి అనుగుణంగా పాటించాలని కోరారు. భారత వాతావరణ శాఖ, రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ, కలెక్టర్లు, వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక, మత్స్యశాఖల నుంచి వెలువడే అధికారిక సమాచారాన్నే పరిగణ లోకి తీసుకోవాలని, వదంతులను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. పంటలు, ఆస్తులను కాపాడుకునే ప్రయత్నంలో రైతులు, ప్రజలు ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టుకోవద్దని, ముందస్తు అప్రమత్తతతోనే తుఫాను నష్టాన్ని తగ్గించుకోవచ్చని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, నదులు, వాగులపై
# నిరంతర పర్యవేక్షణ చేపట్టాలి

***- అధికారులకు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశం***

అమరావతి (చైతన్యరథం): అర్నబ్ తుఫాను నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. తుఫాను ప్రభావం, వర్షాల తీవ్రతను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, నదులు, వాగులు, వంకలు, కాలువలు, డ్రెయిన్ల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. తుఫాను పరిస్థితులపై సోమవారం ఆయన తన శాఖ ఉన్నతాధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో ఇరిగేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్, సలహాదారు వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ నరసింహమూర్తి, సీఈలు, ఎస్ఈలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ... ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు, ఇన్‌ఫ్లోలు, అవుట్‌ఫ్లోలను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. నదులు, వాగులు, వంకల్లో వరద ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున క్షేత్రస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు, నదీ పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తూ అవసరమైన ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలని తెలిపారు.

**ప్రాణ, ఆస్తి, పంట నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలి**

తుఫాన్ ప్రభావంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, ప్రాణ, ఆస్తి, పంట నష్టం జరగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి నిమ్మల ఆదేశించారు. రెవెన్యూ, విపత్తుల నిర్వహణ, జలవనరుల శాఖల మధ్య సమన్వయం పెంచుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితు లను ఎదుర్కొనేందుకు అవసరమైన సిబ్బంది, యంత్రాలు, ఇతర సామగ్రిని సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. కాలువలు, డ్రెయిన్లలో నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, తుఫాను ప్రభావం పూర్తిగా తగ్గి పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకునే వరకు అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు.

**బుడమేరు ఛానెల్‌లో అడ్డంకులను తొలగించాలి**

ఎన్టీఆర్ జిల్లాలో భారీ వర్షాల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని బుడమేరు ఛానెల్‌లో నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా అన్ని అవరోధాలను ముందుగానే తొలగించాలని మంత్రి ఆదేశించారు. భారీ వర్షాలు కురిసినప్పుడు వరద నీరు సజావుగా ప్రవహించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

**ఏలేరు రిజర్వాయర్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి**

ఏలేరు రిజర్వాయర్‌లో కుషన్ తక్కువగా ఉన్నందున, రిజర్వాయర్ పరివాహక ప్రాంతంలో కురిసే వర్షాలను బట్టి అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని మంత్రి కోరారు. వర్షపాతం, రిజర్వాయర్‌కు వచ్చే వరద ప్రవాహాలను నిరంతరం పర్యవేక్షిస్తూ పరిస్థితులకు అనుగుణంగా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**పోలవరం నిర్మాణ పనులకు ఆటంకం కలగకుండా చర్యలు**

పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని 2027 మార్చి నాటికి పూర్తి చేయాలనే లక్ష్యానికి తుఫాను, భారీ వర్షాల వల్ల ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని మంత్రి రామానాయుడు అధికారులకు సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పద్ధతుల్లో నిర్మాణ పనులను కొనసాగించేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. తుఫాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.

# అర్నబ్ తుఫానును ఎదుర్కొనేందుకు సిద్ధం

- **12 జిల్లాలపై ప్రభావం నేపథ్యంలో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక**
- **జీరో క్యాజువాలిటీ లక్ష్యంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశాలు**
- **అధికారుల సెలవులు రద్దు**
- **క్షేత్రస్థాయిలోనే విధులు... అత్యవసర బృందాల మోహరింపు**
- **నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు**



అమరావతి (చైతన్యరథం): అర్నబ్ తీవ్ర తుఫాను గంటకు 115-140 కి.మీ. గాలి వేగంతో రాష్ట్రంలోని 12 జిల్లాలపై విరుచుకుపడే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించేందుకు ఆర్అండ్బీ శాఖను అప్రమత్తం చేసినట్టు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు జీరో క్యాజువాలిటీ లక్ష్యంగా ముందస్తు చర్యలు, నిరంతర పర్యవేక్షణ, అత్యవసర పరిస్థితుల్లో తక్షణం స్పందించాలని ఆయన అధికారులను ఆదేశించారు.

**12 జిల్లాలపై ప్రత్యేక పర్యవేక్షణ**

తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో జాతీయ, రాష్ట్ర రహదారుల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి సూచించారు. ఆర్టీజీఎస్ సమాచారం, ఉపగ్రహ డేటా, డ్రోన్ల నిఘా సహాయంతో ముంపునకు గురయ్యే రహదారులు, ప్రమాదకర మలుపులు, వంతెనలను ముందుగానే గుర్తించాలని ఆదేశించారు. అవసరమైన చోట్ల ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేసి వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

**అత్యవసర టాస్క్‌ఫోర్స్ సిద్ధం**

తుఫాను ప్రభావంతో చెట్లు కూలిపోవడం, రహదారులు దెబ్బతినడం వంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక విపత్తు నిర్వహణ బృందాలను సిద్ధంగా ఉంచాలని మంత్రి ఆదేశించారు. ట్రీ కట్టర్లు, పొక్లెయిన్లు, జేసీబీలను అందుబాటులో ఉంచి రహదారులపై అడ్డంకులు ఏర్పడితే అత్యవసర చర్యలు చేపట్టి రవాణా వ్యవస్థను వీలైనంత త్వరగా పునరుద్ధరించేలా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు.

**అధికారుల సెలవులు రద్దు**

చీఫ్ ఇంజినీర్, సూపరింటెండెంట్ ఇంజినీర్లు (ఎస్ఈ), ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు (ఈఈ) సహా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కలెక్టర్లు, పోలీసు యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. తుఫాను ప్రభావం తగ్గే వరకు అధికారులు ప్రధాన కార్యాలయాలను విడిచి వెళ్లకూడదని... విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**వంతెనలు, కాజ్‌వేల వద్ద భద్రత**

వరద ఉధృతి అధికంగా ఉండే లోతట్టు కాజ్‌వేలు, బలహీన వంతెనల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలని, అవసరమైన చోట్ల రాకపోకలను నిలిపివేయాలని మంత్రి ఆదేశించారు. ప్రమాదకర ప్రాంతాల్లో రెవెన్యూ, పోలీసు శాఖలను సమన్వయం చేసుకుంటూ ప్రజలు ప్రాణాపాయ పరిస్థితుల్లో చిక్కుకోకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

**పునరావాస కేంద్రాల్లో అన్ని వసతులు**

తుఫాను ప్రభావిత ప్రజలకు ఆశ్రయం కల్పించే సహాయక శిబిరాలు, పునరావాస కేంద్రాల్లో భవనాల భద్రతను తనిఖీ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, ఆర్అండ్బీ భవనాలను ఆశ్రయ కేంద్రాలుగా వినియోగించే సందర్భంలో వాటి నిర్మాణ భద్రతను నిర్ధారించడంతో పాటు తాగునీరు, ఇతర మౌలిక వసతులకు కొరత లేకుండా చూడాలని సూచించారు.

**విపత్తు సమయంలో బాధ్యతాయుతంగా పనిచేయాలి**

తుఫాను పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకునే వరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. అత్యవసర పనుల నిర్వహణకు అవసరమైన వనరులను సిద్ధంగా ఉంచి, రహదారుల భద్రతకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని ఆదేశించారు. ప్రజల ప్రాణరక్షణే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని, విపత్తు సమయంలో బాధ్యతాయుతంగా పనిచేయాలని మంత్రి పేర్కొన్నారు.

# మచిలీపట్నం సమగ్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం

- **ప్రజలకు మేలు చేసే కూటమి అభ్యర్థికే మద్దతివ్వండి**
- **బార్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర పిలుపు**



మచిలీపట్నం (చైతన్యరథం): మచిలీపట్నం పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే కాకుండా, పోర్ట్, పారిశ్రామికాభివృద్ధి ద్వారా యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మచిలీపట్నం బార్ అసోసియేషన్ ప్రతినిధులతో మేయర్ అభ్యర్థి అబ్దుల్ అబీదాతో కలిసి సోమవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ... టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తరఫున మేయర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అబ్దుల్ అబీదాను, 60 డివిజన్లలో పోటీ చేస్తున్న కార్పొరేటర్ అభ్యర్థులందరినీ భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. 'మేయర్ అభ్యర్థి అబీదా మామ దివంగత కలీం బేగ్ బందరు ప్రజలకు నిబద్ధతతో సేవ చేశారు. వారి కుమారుడు హసీం బేగ్ పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ పూర్తి చేసి ప్రజలకు సేవ చేయాలనే ఆశయంతో రాజకీయాల్లోకి వచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, కూటమి పెద్దలు ఆలోచించి చదువుకున్న మైనారిటీ మహిళ అయిన అబీదాని మేయర్ అభ్యర్థిగా ఎంపిక చేశారు' అని తెలిపారు. 2014-19 మధ్య కాలంలో బందరులో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నీరు అందించామని గుర్తు చేశారు. వర్షపు నీరు, మురుగునీటి సమస్య పరిష్కారానికి రూ.100 కోట్లతో ప్రారంభించిన డ్రైనేజీ పనులను, అధునాతన సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, పంపింగ్ సిస్టమ్స్ ద్వారా శాశ్వతంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. సాయిబాబా గుడి వద్ద కల్వర్టు నిర్మాణం, పైప్‌లైన్లు, కేబుల్స్ డైవర్షన్ ద్వారా రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేసి, చారిత్రక ప్రాధాన్యత కలిగిన జిల్లా కోర్టు వరకు రోడ్డును అభివృద్ధి చేస్తామని తెలిపారు. రూ.2.60 కోట్లతో ధర్మం చెరువు అభివృద్ధి, బ్యూటిఫికేషన్ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. రూ.7.50 కోట్ల వ్యయంతో మున్సిపల్ కార్యాలయ నిర్మాణ పనులు చేపట్టాం. ఫీనక్స్ సంస్థ, సీఎస్ఆర్ నిధులతో పట్టణంలో శ్మశాన వాటికలను అధునికీకరిస్తున్నామని చెప్పారు.

'వచ్చే ఏడాది మచిలీపట్నం పోర్టు అందుబాటులోకి వస్తుంది. దానికి అనుబంధంగా రూ.8వేల కోట్ల పెట్టుబడితో దాదాపు 10వేల మందికి ఉపాధి కల్పించేలా గోవా షిప్‌యార్డ్ ఏర్పాటు కాబోతోంది. మచిలీపట్నంలో పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా గతంలో బందర్ బీచ్ ఫెస్టివల్ నిర్వహించాం. సముద్రతీరంలో 63 అడుగుల మహా గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేసి అంగరంగ వైభవంగా ఉత్సవాలు నిర్వహించాం. అదే సమయంలో రిసార్ట్‌లు, గోల్ఫ్ కోర్టుల నిర్మాణాలకు అనేక సంస్థలు ముందుకొస్తున్నాయి. లాయర్ల రక్షణ చట్టం తీసుకు రావడానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోంది. రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదే. అలాంటి ప్రభుత్వానికి న్యాయవాదులు కూడా అండగా నిలవాలి' అని మంత్రి రవీంద్ర పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, టీడీపీ సీనియర్ నాయకులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

# గ్లోబల్స్ కూడా ఆశ్చర్యపోయేలా వైసీపీ నాయకుల తీరు

- **ప్రజాస్వామ్యబద్ధంగా గెలవాలనే ఆలోచనే లేని వ్యక్తి జగన్**
- **ప్రశాంతంగా ఉన్న రాయలసీమలో జగన్ మళ్లీ ఫ్యాక్షన్ సంస్కృతిని తీసుకొస్తున్నాడు**
- **రాష్ట్రంలో జరుగుతున్న హింసకు జగన్ బాధ్యత వహించాలి**
- **నాడు నేరాలు-నేడు ప్రవచనాలు చెప్తున్న వైసీపీ**
- **ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి**



మంగళగిరి (చైతన్యరథం): గత పది రోజులుగా రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో వైసీపీ నాయకులు అడ్డంకులు సృష్టిస్తూ దుష్ప్రచారం చేస్తున్నారు. వారి వైఖరి చూస్తుంటే 'ఆడలేక మద్దెల ఓడు' అనే సామెత గుర్తుకొస్తోందని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ ఎద్దేవా చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'జగన్ తన పత్రిక, ఛానల్, సోషల్ మీడియా, పెయిడ్ ప్రచారాల ద్వారా రాష్ట్రంలో ఏదో గందరగోళం జరుగుతున్నట్టు చిత్రీకరిస్తూ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. వైసీపీ అబద్ధపు ప్రచారాన్ని చూస్తే గోబెల్స్ కూడా ఆశ్చర్యపోయేవాడు. సాక్షి పత్రిక, సాక్షి ఛానల్ ద్వారా జగన్మోహన్ రెడ్డి శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా జరుగుతున్న ఎన్నికలను విచ్ఛిన్నం చేసి రాష్ట్రాన్ని అస్థిరపరచాలనే దురుద్దేశంతో ప్రచారం చేస్తున్నారు. సుప్రీంకోర్టు సూచనల మేరకు ఎన్నికల సంఘం కొన్ని ప్రాంతాల్లో, మైదుకూరు మున్సిపాలిటీలో మళ్లీ నామినేషన్లు వేయడానికి అవకాశం కల్పించింది. కడప, తిరుపతి, రాజంపేటలో నామినేషన్లు వేసిన వైసీపీ మైదుకూరులో ఒక్క స్థానానికి కూడా నామినేషన్ ఎందుకు వేయలేదో జగన్మోహన్ రెడ్డి సమాధానం చెప్పాలి. పుంగనూరు, పులివెందుల్లో జడ్పీటీసీలకు నామినేషన్లు వేసి, ఎంపీటీసీలకు వేయకుండా వదిలేశారు. ఇది కేవలం కోర్టుల్లో, ఎన్నికల సంఘంపై ఇబ్బంది కలిగించడానికే తప్ప ప్రజాస్వామ్యబద్ధంగా పోటీ చేయాలనే ఆలోచన వారికి లేదు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న హింసాత్మక చర్యలకు జగన్మోహన్ రెడ్డి ఆదేశాలే కారణం. రెండు నెలల క్రితం ఆయనే "ఏకగ్రీవం అయితే ఇన్‌చార్జ్‌కు టికెట్ ఇవ్వం" అని చెప్పి కార్యకర్తలను రెచ్చగొట్టారు. ప్రశాంతంగా ఉన్న రాయలసీమ, పల్నాడు ప్రాంతాల్లో మళ్లీ ఫ్యాక్షన్ సంస్కృతిని తీసుకొస్తున్నారు. ఇది అత్యంత ప్రమాదకరం. మేనకోడలి పెళ్లికి భద్రత లేదని జగన్ రెడ్డి నాటకాలు ఆడుతున్నారు' అన్నారు.

గతంలో తాడేపల్లిలో సంక్రాంతి, దసరా, క్రిస్మస్ సంబరాలు వందలాది మందితో జరుపుకున్నప్పుడు భద్రత గుర్తుకు రాలేదా? శుభకార్యాల్లో కూడా అడ్డుపడే ఆయన మానసిక స్థితి ఆలోచించదగినది. గతంలో తుపాకులు, బాంబులు చేతబట్టి ఊళ్లపై దాడులు చేసినవారు, పోలింగ్ బూత్‌లపై దాడులు చేసినవారు ఈరోజు శాంతి ప్రవచనాలు పలుకుతున్నారు. 2021 బాధితులకు ప్రతీకారం తీర్చుకునే అవకాశం వచ్చింది. అయినా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు బాబు సూచన మేరకు అణచుకొని శాంతియుతంగా ఉన్నారు. జడ్పీటీసీలకు వైసీపీ 1817 నామినేషన్లు వేయగా, తెలుగుదేశం పార్టీ 2078 వేసింది. ఎంపీటీసీలకు వైసీపీ 20,556, తెలుగుదేశం పార్టీ 22,013 నామినేషన్లు వేశారు. మొత్తం జడ్పీటీసీలకు 5,724, ఎంపీటీసీలకు 51,902 నామినేషన్లు వచ్చాయి. ఇంతమంది నామినేషన్లు వేసిన తర్వాత కూడా 'అడ్డుకుంటున్నారు' అని చెప్పడం వితండవాదనే. ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా ఎన్నికలు జరగాలి. తెలుగుదేశం పార్టీ, ఎన్డీఏ కూటమి ఎప్పుడూ ప్రజాస్వామ్యానికి కట్టుబడి ఉంటుంది. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గుర్తించి కూటమి అభ్యర్థులందరినీ గెలిపించాలి' అని రాష్ట్ర ప్రజలకు రాంగోపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## విధం మరిచి పోలీసులపై బూతులతో రెచ్చిపోవడం

# వైసీపీ నాయకులకు తగదు

- ఓటమి భయంతోనే వైసీపీ నేతలు పోలీసులపై అసభ్యకరమైన బూతు పురాణం వాడుతున్నారు
- నిన్న రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పోలీసులను అసభ్య పదజాలంతో దూషించడం చట్టరీత్యా నేరం
- తమ మాటకాదన్న పోలీసుల పేర్లు డిజిటల్ బుక్‌లో నమోదు చేయండి నేను అధికారంలోకి వస్తే వారి సంగతి చూస్తానని జగన్ మాట్లాడడం హాస్యాస్పదం
- పోలీసులపై అనవసరంగా అసభ్యపదజాలంతో రెచ్చిపోతున్న వైసీపీ మూకలపై ఎస్‌ఈసీ చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి
- ఎమ్మెల్సీ వర్ల రామయ్య డిమాండ్

మంగళగిరి (చైతన్యరథం): 2024 ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు వైసీపీని పూర్తిగా తిరస్కరించి కేవలం 11 స్థానాలకే పరిమితం చేసినా ఆ పార్టీ నేతల తీరులో, ప్రవర్తనలో ఏమాత్రం మార్పు రాలేదని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, ఎమ్మెల్సీ వర్ల రామయ్య మండిపడ్డారు.

ప్రజలు ఇంత ఘోరంగా తిరస్కరించిన తర్వాతైనా చేసిన తప్పులను సరిదిద్దుకోవాల్సింది పోయి జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో ఆ పార్టీ నేతలు ఇంకా అహంకారంతో, నిర్లజ్జగా మాట్లాడుతున్నారని ఆయన తీవ్రంగా ధ్వజమెత్తారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'వైసీపీకి ఇకపై గెలిచే అవకాశమే లేదు. గత ఎన్నికల్లో ప్రజలు వారి పాలనను ఛీత్కరించి ఇంట్లో కూర్చోబెట్టారు. సాధారణంగా ఇంతటి పరాభవం ఎదురైతే ఎవరైనా సిగ్గుతో తలదించుకుని ఆత్మపరిశీలన చేసుకుంటారు. కానీ వైసీపీ నేతల ఆరాచకం, దుర్మార్గపు భాష, వేధింపుల ధోరణి ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ప్రజాస్వామ్యంలో మీకు సమస్యలు ఉంటే ప్రతిపక్షంగా అధికారంలో ఉన్న మాతో రాజకీయంగా మాట్లాడాలి. కానీ యూనిఫాం వేసుకుని విధులు నిర్వహించే పోలీసుల పట్ల ఇష్టానుసారంగా మాట్లాడటం దుర్మార్గం.' అన్నారు.



**వైసీపీ నేతల భాష అత్యంత హేయం**

'అనంతపురం జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి లాంటి వారు పోలీసుల గురించి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు. పోలీసుల బట్టలు విప్పిస్తామని బెదిరించడం సభ్య సమాజం తలదించుకునే చర్య. అసలు ఆయన సంస్కారవంతమైన కుటుంబం నుంచి వచ్చారా? లేక గాలివాటంగా రాజకీయాల్లోకి వచ్చారా? ఒక ప్రజాప్రతినిధిగా పనిచేసిన వ్యక్తి వాడే భాషేనా ఇది? ప్రజలు ఐదేళ్లపాటు ఇలాంటి వారిని ఎలా భరించారో అర్థం కావట్లేదు. లేదు. ఇతరుల బట్టలు విప్పించడమే వైసీపీ నాయకుల పనా? నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న ఈ ప్రభుత్వంలో పోలీసులు పూర్తిగా నిష్పక్షపాతంగా తమ విధులు నిర్వర్తిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలోలా ఇక్కడ కక్షసాధింపులు ఉండవు. తప్పు ఎవరు చేసినా చట్టం తన పని తాను చేసుకుపోతుంది. అవసరమైతే మా పార్టీ వాళ్లయినా, ప్రెస్‌వాళ్లైనా నిబంధనల ప్రకారమే చర్యలు తీసుకుంటున్నారు తప్ప ఎవరికీ మినహాయింపు లేదు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ పోలీసుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా మాట్లాడితే చూస్తూ ఊరుకునేది లేదని, వైసీపీ నాయకులు తమ సంస్కారహీనమైన నోటిని అదుపులో పెట్టుకోవాలి' అని రామయ్య హెచ్చరించారు.

**జగన్ మళ్లీ అధికారంలోకి రావడం పగటికలే**

'రాష్ట్రంలో రాజ్యాంగబద్ధ వ్యవస్థలు, పోలీసులు నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తిస్తుంటే ఓర్వలేని వైసీపీ నేతలు బరితెగించి మాట్లాడుతున్నారు. నామినేషన్ కేంద్రాల్లో గందరగోళం సృష్టిస్తే సొంత పార్టీ వాళ్లయినా సరే కేసులు పెట్టిన ఘనత ప్రస్తుత కూటమి ప్రభుత్వానిది. చట్టం అందరికీ సమానంగా అమలవుతోంది. రాష్ట్ర ఎన్నికల సంఘం, పోలీసు యంత్రాంగం నిష్పక్షపాతంగా వ్యవహరిస్తుంటే... వైసీపీ నాయకులు మాత్రం విధుల్లో ఉన్న పోలీసుల బట్టలు విప్పుతామని మాట్లాడటం సిగ్గుచేటు. బట్టలు లేకుండా తిరగడం వాళ్ల పార్టీలోని కొందరు ఎంపీలకు అలవాటు కావచ్చేమో కానీ, బాధ్యతాయుతమైన పోలీసు అధికారుల పట్ల ఇలాంటి అసభ్యకర మాటలు మాట్లాడితే సహించేది లేదు. నోరుంది కదా అని సభ్యత, సంస్కారం లేకుండా మాట్లాడితే సమాజం హర్షించదు. పోలీసులు నిబంధనల ప్రకారం పనిచేస్తుంటే, వారి పేర్లను డిజిటల్ పుస్తకాల్లో రాసుకుంటున్నామని జగన్మోహన్ రెడ్డి బెదిరించడం హాస్యాస్పదం. పేర్లు రాసుకుని ఏం చేస్తారు? అధికారంలోకి వచ్చాక సంగతి చూస్తాననడం పగటి కల తప్ప మరొకటి కాదు. అసలు నిన్ను మళ్లీ రమ్మని ఆహ్వానించేందుకు రాష్ట్రంలో ఏ ఒక్కరైనా సిద్ధంగా ఉన్నారా? అధికారంలో ఉన్న ఐదేళ్లపాటు రాష్ట్రాన్ని సర్వనాశనం చేసినందుకు ప్రజలు మిమ్మల్ని మళ్లీ ఆహ్వానిస్తారా? పోలీసులను తిట్టి, వ్యవస్థలను బెదిరిస్తే ప్రజలు మళ్లీ ఓట్లు వేస్తారనుకుంటున్నారా? ప్రజాస్వామ్యంలో ప్రజలు నాయకుల నడవడికను, సంస్కారాన్ని, మంచి పనితీరును చూసి గౌరవిస్తారు తప్ప... ఇలాంటి రౌడీయిజాన్ని, బూతు మాటలను చూసి కాదు. ప్రస్తుతం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే, నిన్నటిదాకా నమ్ముకున్న నాయకులే తాడేపల్లి ప్యాలెస్ వైపు వెళ్లడానికి భయపడుతున్నారు. కనీసం స్థానిక ఎన్నికల్లో పోటీ చేయాలన్నా జగన్ పేరును గానీ, పార్టీ గుర్తును గానీ వాడుకోవడానికి భయపడే దుస్థితి వచ్చింది. సొంత పార్టీ వారే మిమ్మల్ని నమ్మే పరిస్థితి లేనప్పుడు, ఇంకా పోలీసుల సంగతి చూస్తామని ప్రగల్భాలు పలకడం విడ్డూరం. ప్రజలు అధికారం నుంచి తరిమికొట్టినా వైసీపీ నేతల్లో అహంకారం తగ్గలేదని, పోలీసుల మనోధైర్యాన్ని దెబ్బతీసేలా బెదిరింపులకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవు' అని హెచ్చరించారు.

**పోలీసులను అవమానిస్తే సహించేది లేదు**

రాష్ట్రంలో చట్టబద్ధంగా విధులు నిర్వర్తిస్తున్న పోలీసు వ్యవస్థపై వైసీపీ నాయకులు బరితెగించి అసభ్యకర వ్యాఖ్యలు చేయడంపై ఎమ్మెల్సీ వర్ల రామయ్య తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజలు ఛీత్కరించి అధికారం నుంచి గెంటేసినా వైసీపీ నేతల నోటి దురద, అహంకారం తగ్గలేదని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వంలో మహిళా మంత్రిగా పనిచేసిన ఆర్కే రోజా పోలీసులనుద్దేశించి "లంగా పోలీసులు" అంటూ వాడిన భాష అత్యంత హేయమైనది. ఒక మహిళ అయి ఉండి, తోటి సమాజం వింటోందన్న స్పృహ లేకుండా ఇలాంటి సంస్కారహీనమైన బూతులు మాట్లాడడాన్ని ఆమె విచక్షణకే వదిలేస్తున్నాం. మాట్లాడే ప్రతి మాటకు బాధ్యత ఉండాలి. కనీస ఆలోచన, సంస్కారం లేకుండా పోలీసు వ్యవస్థను కించపరిస్తే రాష్ట్ర మహిళా లోకం మిమ్మల్ని క్షమించదు. అధికారంలోకి వచ్చాక పోలీసుల సంగతి చూస్తానని జగన్మోహన్ రెడ్డి బెదిరించడం విడ్డూరంగా ఉంది. యూనిఫాం వేసుకున్న ఒక పోలీసు అధికారి దాదాపు 35 ఏళ్లపాటు సర్వీసులో ఉండి ప్రజాసేవ చేస్తారు. వారి సర్వీసు కాలంలో మీలాంటి ఎందరో రాజకీయ నాయకులను చూసి ఉంటారు. తమ విధిని తాము చేస్తుంటే వారిని అవమానించి, వారి కుటుంబ సభ్యులకు మానసిక వేదన కలిగించడం దుర్మార్గం. ఖద్దరు చొక్కాలు వేసుకోవడానికి వారేమీ రాజకీయ నాయకులు కాదు, రాజ్యాంగ రక్షకులు. వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా ప్రవర్తిస్తే పోలీసు యంత్రాంగం చూస్తూ ఊరుకోదు. పొద్దున్నే లేచి నోటికొచ్చినట్లు మాట్లాడటం ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డికి అలవాటుగా మారింది. అసలు పోలీసులతో మీకున్న సమస్య ఏమిటి? వారు మీకు ఏం ద్రోహం చేశారు? చట్టప్రకారం పనిచేస్తున్న అధికారులను దూషిస్తే మీకేం వస్తుంది? ప్రజలు ఎన్నికల్లో మిమ్మల్ని తరిమికొట్టిన బాధను పోలీసులపై చూపిస్తే ప్రజలు హర్షించరు. ప్రస్తుతం రాష్ట్రంలో పోలీసులు ఎన్నికల సంఘం పర్యవేక్షణలో, చట్టబద్ధ నిబంధనలకు లోబడి పని చేస్తున్నారు. ఏ అధికారి పైనైనా అభ్యంతరాలు ఉంటే చట్టప్రకారం ఎన్నికల కమిషన్‌కు గానీ, ఉన్నతాధికారులకు గానీ ఫిర్యాదు చేయాలి తప్ప మైకుల ముందుకొచ్చి బూతులు మాట్లాడటం సరైన పద్ధతి కాదు. ఒక్క పోలీసు అధికారిని కించపరిచినా వేలాది మంది పోలీసులు చూస్తూ ఊరుకోరు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు తమ సంస్కారహీనమైన భాషను మానుకోవాలి. విధుల్లో ఉన్న పోలీసుల గౌరవానికి భంగం కలిగిస్తే చట్టం తన పని తాను చేసుకుపోతుంది' అని రామయ్య స్పష్టం చేశారు.

---

# స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి

*- టీడీపీ శ్రేణులకు మంత్రి బాల వీరాంజనేయస్వామి పిలుపు*



కొండపి (చైతన్యరథం) స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన కొండపి నియోజకవర్గం టంగుటూరు మండలం సూరారెడ్డిపాలెం, ఎం.నిడమానూరు, పొందూరు గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై స్థానిక ఎన్నికలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త పనిచేయాలన్నారు. ఎన్నికల్లో పోటీచేసే అవకాశం ఎవరికి ఇచ్చినా అంతా కలిసికట్టుగా పని చేయాలన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందన్నారు. సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేశామని, మన రాష్ట్ర సంక్షేమం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా పెద్ద మొత్తంలో పింఛన్లు ఇస్తున్నామని, అన్న క్యాంటీన్లలో పేదలకు రూ.5కే భోజనం పెడుతున్నామన్నారు. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంత మందికీ 'తల్లికి వందనం' ఇస్తున్నాం. ఎన్నికల్లో చెప్పకపోయినా దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి పాలనలో గ్రామాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి, కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. వీటిని నాయకులు, కార్యకర్తలు ప్రజలకు తెలియచెప్పాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి నాయకులతో సమన్వయంతో పనిచేసి కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని మంత్రి వీరాంజనేయస్వామి కోరారు.

# విధ్వంసాలతో ప్రజల మద్దతు పొందలేరు జగన్ రెడ్డీ

**రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్**



అమరావతి (చైతన్యరథం): 'స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి భయంతోనే వైసీపీ రాష్ట్రవ్యాప్తంగా అల్లర్లు, విధ్వంసాలకు పాల్పడుతోంది. పుంగనూరు, తిరుపతి, రాయచోటి, పులివెందుల, కడప, దర్శి, కనిగిరి ప్రాంతాల్లో చోటుచేసుకున్న దాడులే అందుకు నిదర్శనం' అని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'లోకల్ బాడీ ఎన్నికల్లో ఛాంపియన్ కూటమే. సీఎం చంద్రబాబు ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమానికి ప్రజలు మద్దతు తెలిపారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజల మద్దతు పొందలేకే జగన్ హింసా రాజకీయాలను ఎంచుకున్నారు. ఎన్నికలు ఏవైనా హింసను ప్రోత్సహించడమే జగన్ చేసే రాజకీయం. ఐదేళ్ల వైసీపీ పాలనను చూసిన ప్రజలు 11 సీట్లకే పరిమితం చేసినా జగన్ తీరు మారలేదు. కుట్రలు, దాడులు, విధ్వంసాలతో ప్రజల ఓట్లు సాధించలేరని జగన్ గుర్తించాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయ దుందుభి మోగిస్తోంది. గొడ్డలి పార్టీ ఇక దుకాణం సర్దేసుకోవడం మంచిది. స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు చూసైన గొడ్డలి పార్టీ నాయకులకు, జగన్ రెడ్డికి బుద్ధి రావాలి.' అని మంత్రి వ్యాఖ్యానించారు.

## విశాఖను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దడమే

# కూటమి ప్రభుత్వ లక్ష్యం

- చంద్రబాబు నాయకత్వంలోనే ఇది సాధ్యం
- ఐదేళ్ల పాలనలో విశాఖకు చేసిందేమిటో చెప్పలేని గొడ్డలి పార్టీ
- గంగవరం బీచ్ అందాలను ప్రపంచానికి పరిచయం చేసిన ఆనంద్ మహీంద్రాకు నా కృతజ్ఞతలు
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

అమరావతి (చైతన్యరథం): గంగవరం బీచ్ అందాలను ప్రపంచానికి పరిచయం చేసిన ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రాకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. విశాఖ సహజ సౌందర్యం ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందేందుకు ఇటువంటి పరిచయాలు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. ప్రకృతి అందాలు, ఆధునిక సాంకేతికతను సమన్వయం చేస్తూ విశాఖను అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు లక్ష్యానికి ఇది మరింత ప్రాధాన్యం చేకూరుస్తుందని తెలిపారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్, డేటా సెంటర్లు సహా సాంకేతిక రంగాల విస్తరణకు మంత్రి నారా లోకేష్ చేస్తున్న కృషి విశాఖ భవిష్యత్తుకు కొత్త అవకాశాలు కల్పిస్తోందన్నారు. కొండలు, సముద్ర తీరం, రాతి కొండచరియలు వంటి ప్రకృతి అందాలు విశాఖకు గొప్ప బలమని, అదే సమయంలో టెక్నాలజీ రంగం వేగంగా విస్తరించే అవకాశాలున్నాయని పల్లా పేర్కొన్నారు. ప్రకృతి, ప్రగతి కలిసి నడిచే నగరంగా విశాఖను తీర్చిదిద్ది తూర్పు తీరానికి శాన్‌ఫ్రాన్సిస్కోగా అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవం, దూరదృష్టితో కూడిన ప్రణాళికలు, మంత్రి నారా లోకేష్ సాంకేతిక రంగంపై ప్రత్యేక దృష్టి రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి



అవకాశాలు తీసుకొచ్చేందుకు దోహదపడుతున్నాయని తెలిపారు.

### విశాఖ అభివృద్ధిని అడ్డుకున్న జగన్

ఐదేళ్ల వైసీపీ పాలనలో విశాఖ అభివృద్ధిని విస్మరించి, విలువైన భూముల వ్యవహారాలకే పెద్దపీట వేశారని పల్లా విమర్శించారు. విశాఖను కార్యనిర్వాహక రాజధానిగా ప్రకటించి ఊదరగొట్టిన జగన్... ఆ పేరుతో రియల్ ఎస్టేట్ ప్రయోజనాలకే ప్రాధాన్యమిచ్చారని ఆరోపించారు. నగరానికి, ఉత్తరాంధ్రకు చేసిన అభివృద్ధి పనులను చెప్పుకోలేని గొడ్డలి పార్టీ నేతలు ఇప్పుడు 'సేవ్ వైజాగ్' పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

### విశాఖ భూములపై వైసీపీ ముఠా కన్ను

జగన్ పాలనలో విశాఖలోని విలువైన భూముల వ్యవహారాలు వివాదాస్పదమయ్యాయని పల్లా పేర్కొన్నారు. బే పార్కు, రుషికొండ ఐటీ హిల్, లూలూ ప్రాజెక్టుకు సంబంధించిన స్థలాలు, వాల్తేరు క్లబ్, రామానాయుడు స్టూడియో, మాన్సాస్ ట్రస్టు, దసపల్లా భూములు, షీలానగర్ ప్రాంతంలోని భూముల కేటాయింపులపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేశారు. గంగవరం పోర్టు, కార్తీక వనం, విశాఖ మన్యంలో ఖనిజ సంపదకు సంబంధించిన వ్యవహారాలపైనా ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలని కోరారు. విశాఖకు రావాల్సిన పరిశ్రమలు, పెట్టుబడుల విషయంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. లూలూ, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ వంటి సంస్థల ప్రతిపాదనలు ముందుకు సాగకపోవడం, ఫిన్‌టెక్ వ్యాలీ నిర్వీర్యం కావడం, ఏఎంటీజెడ్ విషయంలో ఇబ్బందులు తలెత్తడం రాష్ట్రానికి నష్టం కలిగించా యన్నారు. భోగాపురం విమానాశ్రయం, గిరిజన విశ్వవిద్యాల యం, పెట్రోలియం విశ్వవిద్యాలయం వంటి కీలక అంశాల్లో గత ప్రభుత్వం ఆశించిన పురోగతి సాధించలేకపోయిందని విమర్శించారు.

### చంద్రబాబు నాయకత్వంలో విశాఖ అభివృద్ధి బాట

కూటమి ప్రభుత్వం విశాఖను అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని పల్లా తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించడం, ప్రపంచ స్థాయి సంస్థలను తీసుకురావడం ద్వారా ఉత్తరాంధ్రకు కొత్త అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. విశాఖ రైల్వే జోన్ కార్యాలయానికి స్థలం కేటాయించి పనులు ముందుకు తీసుకెళ్లడం, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్రం నుంచి రూ.20వేల కోట్ల ప్రత్యేక ఆర్థిక సాయం సాధించడం, భోగాపురం విమానాశ్రయ పనులను వేగవంతం చేయడం వంటి చర్యలను వివరించారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా ఉమ్మడి విశాఖ జిల్లాకు 30 టీఎంసీల నీటిని తరలించే దిశగా ముందడుగు పడిందని తెలిపారు.

### ఐటీ, టెక్నాలజీ రంగాల విస్తరణకు లోకేష్ చొరవ

విశాఖను ఐటీ, టెక్నాలజీ, డేటా సెంటర్లకు ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చేయడంలో మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవ చూపుతున్నారని పల్లా పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి సంస్థలను రాష్ట్రానికి ఆకర్షించడం, పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించడం, యువతకు నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలు పెంపొందించడం ద్వారా విశాఖ ఆర్థిక ప్రగతికి బాటలు వేస్తున్నారని తెలిపారు. గూగుల్ సంస్థ పెట్టుబడులు, డేటా సెంటర్ల ఏర్పాటుతో విశాఖకు అంతర్జాతీయ సాంకేతిక రంగంలో మరింత గుర్తింపు లభించే అవకాశాలున్నాయని పేర్కొన్నారు.

### అభివృద్ధిపై విష ప్రచారం తగదు

గూగుల్ సంస్థ పెట్టుబడులు, డేటా సెంటర్ల ఏర్పాటుపై గొడ్డలి పార్టీ నేతలు అవాస్తవాలు ప్రచారం చేస్తూ ప్రజల్లో అనుమానాలు రేకెత్తిస్తున్నారని పల్లా ఆరోపించారు. విశాఖకు పెట్టుబడులు రావడం, యువతకు ఉపాధి అవకాశాలు పెరగడం రాష్ట్ర ప్రయోజనాలకు కీలకమన్నారు. నగర అభివృద్ధికి సహకరించాల్సిందిపోయి అడ్డంకులు సృష్టించడం సరికాదని హితవు పలికారు.

### విశాఖ ప్రజలు వైసీపీకి గుణపాఠం చెప్పారు

2014లో విశాఖ ప్రజలు జగన్ తల్లిని ఎంపీగా ఓడించిన నేపథ్యంలో, విశాఖపై రాజకీయ కక్షతో వ్యవహరించారనే విమర్శలు అప్పట్లో వచ్చాయని పల్లా పేర్కొన్నారు. నగరంలో గంజాయి సమస్య, రుషికొండ నిర్మాణాలు, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాలపై అప్పటి ప్రభుత్వ వైఖరి ప్రజల్లో ఆందోళన కలిగించిందన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి తగిన గుణపాఠం చెప్పారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ప్రజలు అభివృద్ధి, పారదర్శకతకు ప్రాధాన్యమిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో విశాఖను అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దడం, మంత్రి నారా లోకేష్ చొరవతో ఐటీ, సాంకేతిక రంగాల విస్తరణకు ఊతమివ్వడం, ఉత్తరాంధ్రకు కొత్త భవిష్యత్తును అందించడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని శ్రీనివాసరావు స్పష్టం చేశారు. పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, పర్యాటకం, సాంకేతిక రంగాల అభివృద్ధితో విశాఖకు ప్రపంచవ్యాప్త గుర్తింపు తీసుకొస్తామని తెలిపారు. అభివృద్ధికి అడ్డంకులు సృష్టించడం మానుకుని, గత పాలనలోని భూ వ్యవహారాలపై వచ్చిన ఆరోపణలకు వైసీపీ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# రాయచోటి మున్సిపాలిటీలో కూటమి ఏకగ్రీవ విజయం

**మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన మున్సిపల్ చైర్మన్ బోనుమాల ఖాదర్ వలీ, కౌన్సిలర్లు**



రాయచోటి (చైతన్యరథం): రాయచోటి మున్సిపాలిటీలో 44కు 44 వార్డులను ఏకగ్రీవంగా కైవసం చేసుకున్న కూటమి తరపున నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ బోనుమాల ఖాదర్ వలీతో పాటు కౌన్సిలర్లు సోమవారం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిని శాలువాతో సత్కరించి తమ విజయంలో కీలక పాత్ర పోషించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నూతన మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లకు మంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలన్నారు. రాయచోటి పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యమివ్వాలని, తాగునీరు, రహదారులు, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి సమిష్టి కృషి చేయాలని సూచించారు.

## 9552300009 'అర్నబ్' తుఫాన్ ఎఫెక్ట్

# సమస్యల పరిష్కారానికి ఏపీ ప్రభుత్వం వాట్సాప్ సేవలు

అమరావతి (చైతన్యరథం): అర్నబ్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా తెలిపే అవకాశాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. ఈ మేరకు ఆర్టీజీఎస్ అధికారులు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తుఫాన్ సమయంలో చెట్లు కూలినా, గోడలు కూలినా, కరెంటు, నీరు తదితర సమస్యలు ఎదురైనా మనమిత్ర ద్వారా వెంటనే అధికారులకు తెలియజేయవచ్చని సూచించారు. ఈ సేవల కోసం 9552300009 నెంబరుకు హాయ్ అని మెసేజ్ చేయాలని ఆర్టీజీఎస్ అధికారులు తెలిపారు. అర్నబ్ తుఫాన్ సమస్య అనే ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలని పేర్కొన్నారు. రిపోర్ట్ ఇష్యూను ఎంపిక చేసుకుని కన్ఫర్మ్ ఆప్షన్ ఎంపిక చేసుకోవాలని వెల్లడించారు. ఆ తర్వాత రిజిస్ట్రేషన్ ఆప్షన్ ఎంపిక చేసుకోవాలని తెలిపారు. తర్వాత మీ పేరు, జిల్లా, మండలం నమోదు చేసి, మీ ప్రాంతంలో తుఫాన్ కారణంగా ఎదురవుతున్న సమస్యను అందులో నమోదు చేయాలని అధికారులు పేర్కొన్నారు. వర్షానికి సంబంధించిన ఫోటోలను కూడా అప్‌లోడ్ చేయొచ్చని చెప్పారు. వెంటనే ఆ సమస్యను ఆ ప్రాంతంలో సంబంధిత అధికారికి పంపి వెంటనే సమస్య పరిష్కారమయ్యేలా చూస్తారని తెలిపారు. ప్రజలందరూ ఈ సదుపాయాన్ని ఉపయోగించుకోవాలని ఆర్టీజీఎస్ అధికారులు కోరారు.




## డిసెంబరు 4 నుండి 6 వరకు తిరుపతిలో

# డీజీపీలు, ఐజీపీల జాతీయ స్థాయి సదస్సు

**హాజరు కానున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా**

**ఏర్పాట్లు పక్కాగా పూర్తి చేయాలి: చీఫ్ సెక్రటరీ సాయిప్రసాద్**

అమరావతి (చైతన్యరథం): డిసెంబరు 4 నుండి 6వ తేదీ వరకు తిరుపతిలోని 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్'లో డీజీపీలు, ఐజీపీల జాతీయ స్థాయి సదస్సు జరగనుంది. దీనికి సంబంధించిన నిర్వహణ ఏర్పాట్లపై సోమవారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఆధ్వర్యంలో 'ఇంటర్ డిపార్ట్‌మెంటల్ కో-ఆర్డినేషన్ కమిటీ' సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సుకు విస్తృతమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో పాటు వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన డీజీపీలు, ఐజీపీలు సహా 200 మందికి పైగా ఐపీఎస్ అధికారులు, 200 మంది వరకు ఐబీ అధికారులు, స్టేట్, సెంట్రల్ ఫోరెన్సిక్ అధికారులు, ఎన్ఎస్ఏ, కేంద్ర హోం శాఖ ఉన్నతాధికారులు పాల్గొంటారని సీఎస్ తెలిపారు. ప్రధాని మోదీ మొదటి రెండు రోజులు పాల్గొనే అవకాశం ఉన్నందున, దానికి అనుగుణంగా తిరుపతి నగరాన్ని సుందరీకరించడంతో పాటు భద్రత, రవాణా ఏర్పాట్లను కట్టుదిట్టంగా పూర్తి చేయాలని సూచించారు. సదస్సు ప్రాంగణంలో నెట్‌వర్క్ సమస్యలు రాకుండా ప్రత్యేక టవర్లు ఏర్పాటు చేయాలని ఐటీ శాఖను ఆదేశించారు. సమావేశంలో వర్చువల్‌గా పాల్గొన్న డీజీపీ హరీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ... ఏర్పాట్ల పురోగతిపై ప్రతి 15 రోజులకు ఒకసారి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించాలని సూచించారు. సమావేశంలో అదనపు డీజీపీ మధుసూదన్‌రెడ్డి, హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్, సాధారణ పరిపాలనా శాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు, సెకండరీ హెల్త్ కమిషనర్ చక్రధర్‌బాబు, ఎస్ఐబీ డిప్యూటీ డైరెక్టర్ అంబిక, ఐజీ కాంతిరాణా టాటా, వర్చువల్‌గా టీటీడీ ఈవో ఎం.రవిచంద్ర, ఇతర ఉన్నతాధికారులు, కలెక్టర్, ఎస్పీ పాల్గొన్నారు.

# తిరుమలలో వైభవంగా పౌర్ణమి గరుడ సేవ



### వాహన సేవలో పాల్గొన్న భారత ఉప రాష్ట్రపతి

తిరుమల (చైతన్యరథం): తిరుమలలో సోమవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించిన పౌర్ణమి గరుడ సేవలో భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ పాల్గొన్నారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామివారు గరుడునిపై ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. పౌరాణిక నేపథ్యంలో 108 వైష్ణవ దివ్యదేశాల్లో గరుడ సేవ అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది. గరుడ వాహనం ద్వారా స్వామివారు దాసానుదాస ప్రపత్తికి తాను దాసుడని తెలియజెప్తారు. అంతే గాక జ్ఞానవైరాగ్య ప్రాప్తికోరే మానవులు జ్ఞానవైరాగ్య రూపాలైన రెక్కలతో విహరించే గరుడుని దర్శిస్తే సర్వపాపాలు తొలగుతాయని భక్తకోటికి తెలియజేస్తున్నాడు. వేలాది సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని తరించారు. వాహన సేవలో జీయర్ స్వాములు, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, సీవీఎస్వో మురళీకృష్ణ, జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ డాక్టర్ వేంకటేశ్వర్, తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు, టీటీడీ పాలకమండలి సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.



## రాష్ట్రవ్యాప్తంగా ప్రజాస్వామ్యబద్ధంగా

# నామినేషన్ల ప్రక్రియ పూర్తి

- **కూటమి ప్రభుత్వ అభివృద్ధే మా ఎన్నికల అజెండా**
- **పులివెందుల మున్సిపాలిటీతో పాటు కడపలోనూ గెలుస్తాం**
- **బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ పూర్తయిందని, కూటమి పార్టీల అభ్యర్థులతో పాటు వైసీపీ, స్వతంత్ర అభ్యర్థులు కూడా నామినేషన్లు దాఖలు చేశారని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వ హయాంలో నామినేషన్లు వేయనీయకుండా దాడులు చేయడం, నామినేషన్ పత్రాలు చించేయడం, అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేయడం వంటి ఘటనలు జరిగాయని




విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోందని స్పష్టం చేశారు. గతంలో 151 మంది ఎమ్మెల్యేల బలం ఉందని విర్రవీగిన వైసీపీ అధినేత, తానే ఏకచక్రాధిపతి అన్నట్టు వ్యవహరించారని సవితమ్మ విమర్శించారు. ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష అభ్యర్థులకు నామినేషన్లు వేసే అవకాశం కూడా లేకుండా చేసిన ఘటనలను ప్రజలు ఇంకా మర్చిపోలేదన్నారు.

### అభివృద్ధే మా ఎన్నికల అజెండా

'కూటమి ప్రభుత్వానికి ప్రజల్లో ఉన్న ఆదరణ, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు వైసీపీ నేతలను కలవరపెడుతున్నాయి. రాష్ట్రంలో ఏ గ్రామానికి వెళ్లినా, ఏ పట్టణాన్ని సందర్శించినా అభివృద్ధి కనిపిస్తోంది. పోలవరం ప్రాజెక్టు, అమరావతి నిర్మాణం, సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు, విమానాశ్రయాలు, జాతీయ రహదారుల అనుసంధానం వంటి రంగాల్లో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ప్రజలు అభివృద్ధిని గమనిస్తున్నారు. ఎన్నికల్లో కూటమికి సంపూర్ణ మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు" అని పేర్కొన్నారు.

### ఎన్ని బెదిరింపులు వచ్చినా పులివెందుల, కడపల్లో టీడీపీ జెండా ఎగురుతుంది

'వైసీపీ నేతలు ఇతర రాష్ట్రాల నుంచి కార్యకర్తలను తీసుకొచ్చి రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. ఎవరూ ప్రలోభాలకు, రెచ్చగొట్టే వ్యాఖ్యలకు లోనుకావద్దు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం ప్రకారం చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లడంపైనే దృష్టి సారించాలి. చట్టం తన పని తాను చేసుకుపోతుంది. తప్పు చేసిన వారిపై చట్టప్రకారం చర్యలు ఉంటాయి. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఇతర నాయకుల మార్గదర్శకత్వంలో కూటమి అభ్యర్థులు సంపూర్ణ మెజారిటీతో విజయం సాధిస్తారు. పులివెందుల మున్సిపాలిటీతో పాటు కడపలోనూ కూటమి జెండా ఎగురవేస్తాం. టీడీపీ కార్యకర్తలను, పార్టీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులను నరికేస్తామంటూ వైసీపీ నేతలు బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఇలాంటి బెదిరింపులకు కూటమి శ్రేణులు భయపడాల్సిన అవసరం లేదు. ప్రజాస్వామ్యబ ద్ధంగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఎన్నికల ప్రక్రియకు ఆటంకాలు కలిగించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. ప్రజల తీర్పే అంతిమం" అని మంత్రి సవిత స్పష్టం చేశారు.

# అభివృద్ధిని అడ్డుకోవడమే వైసీపీ లక్ష్యం



- **ఓటమి భయంతో నామినేషన్లు వేయనివ్వట్లేదని వైసీపీ డ్రామాలు**
- **కూటమితో సమానంగా వైసీపీ నామినేషన్ల దాఖలు**
- **ఎన్నికలను అడ్డుకునేందుకు ఎన్ని కుట్రలు చేసినా విజయం కూటమిదే**
- **ఆళ్ళగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ**

ఆళ్ళగడ్డ (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడిపోతేమనే భయంతోనే నామినేషన్లు వేయనివ్వడం లేదంటూ వైసీపీ డ్రామాలు ఆడుతుందని... వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన అరాచకాలు, ఏకగ్రీవాలను ఆ పార్టీ నేతలు గుర్తు తెచ్చుకోవాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ దుయ్యబట్టారు. సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ 16వ ఆర్థిక సంఘం ద్వారా రాష్ట్రానికి రావాల్సిన నిధులను అడ్డుకుని గ్రామాల అభివృద్ధికి ఆటంకం కలిగించేలానే కుట్రతో వైసీపీ వ్యవహరిస్తోందని విమర్శించారు.

### ఏకగ్రీవాలపై వైసీపీ నేతలు సమాధానం చెప్పాలి

'2014లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎంపీటీసీ స్థానాల్లో కేవలం 2శాతం మాత్రమే ఏకగ్రీవమయ్యాయి. 2020లో జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎంపీటీసీ స్థానాల్లో 24 శాతం ఏకగ్రీవాలు జరిగాయి. 2014లో ఒక్క జడ్పీటీసీ స్థానం మాత్రమే ఏకగ్రీవం కాగా 2020లో 19శాతం జడ్పీటీసీ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. కడప జిల్లాలో జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమ యంలో 79 శాతం ఎంపీటీసీ స్థానాలు, 76శాతం జడ్పీటీసీ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. ఇంత భారీ స్థాయిలో ఏకగ్రీవాలు జరిగినప్పుడు వైసీపీ నేతలు ఏం సమాధానం చెబుతారు? 2021లో వైసీపీ తన అధికారిక సోషల్ మీడియా ఖాతాలో ఏకగ్రీవాలను సమర్థిస్తూ పోస్టులు పెట్టింది. "నిమ్మగడ్డకు రాజకీయం కావాలంటే రాజీనామా చేసి బయటకు రావాలి", "గ్రామ స్వరాజ్యం రావాలంటే ఏకగ్రీవాలు జరిగేది మా విధానం" అంటూ అప్పట్లో వ్యాఖ్యానించింది. ఆ పోస్టులు ఇప్పటికీ ఆ పార్టీ సోషల్ మీడియా పేజీలో ఉన్నాయని గుర్తు చేస్తున్నాం. అప్పుడు ఏకగ్రీవాలను సమర్థించిన వైసీపీ నేతలు, ఇప్పుడు అదే అంశంపై ఎందుకు రాద్ధాంతం చేస్తున్నారు? ఏకగ్రీవమైన గ్రామాలకు అదనంగా రూ.10 లక్షలు ఇస్తామని ప్రకటించిన జగన్ ఆ హామీని ఎంతవరకు అమలు చేశారు? గ్రామాలకు అదనపు నిధులు ఇచ్చారా? సర్పంచుల నిధులను సైతం సక్రమంగా వినియోగించని వైసీపీ నేతలకు ఇప్పుడు గ్రామాల అభివృద్ధి గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు" అని పేర్కొన్నారు.

### నామినేషన్ల గణాంకాలే వైసీపీ ఆరోపణలకు సమాధానం

'రాష్ట్రంలో నామినేషన్లు వేయనివ్వడం లేదని, నామినేషన్ పత్రాలు చించేస్తున్నారని, అభ్యర్థులను బెదిరిస్తున్నారని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. రాష్ట్రంలో ఏదో అరాచకం జరుగుతున్నట్టు కేంద్రం దృష్టికి తీసుకెళ్లి రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఎన్నికల్లో దాఖలైన నామినేషన్ల సంఖ్యను పరిశీలిస్తే వాస్తవాలు స్పష్టమవుతాయి. రాష్ట్రంలోని 9,829 ఎంపీటీసీ స్థానాలకు మొత్తం 46,045 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో టీడీపీ తరపున 19,760, వైసీపీ తరపున 17,726 నామినేషన్లు వచ్చాయి. 659జడ్పీటీసీ స్థానాలకు 4,770 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో వైసీపీ తరపున 1,445, టీడీపీ తరపున 1,693 నామినేషన్లు వచ్చాయి. ఈ గణాంకాలు అందుబాటులో ఉన్నప్పుడు తమ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటున్నారనే ఆరోపణలపై వైసీపీ నేతలు ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలి. ఆరోపణలు చేయడం కాదు.. వాస్తవాలతో మాట్లాడాలి" అని అఖిలప్రియ స్పష్టం చేశారు.

### గ్రామాల అభివృద్ధికి అడ్డుపడొద్దు

'ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తోంది. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు లక్షల రూపాయలతో పాటు అవసరమైనచోట కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ అభివృద్ధి కార్యక్రమా లను వేగవంతం చేస్తున్నాం. స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయితే గ్రామాల అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుంది. డిసెంబరులో 16వ ఆర్థిక సంఘానికి సంబంధించిన రూ.12,600 కోట్ల నిధులు రాష్ట్రానికి రావాల్సి ఉంది. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో జాప్యం వల్ల అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభావం పడకూడదు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు సకాలంలో అందేలా చూడాల్సిన సమయంలో, ఎన్నికల ప్రక్రియపై వివాదాలు సృష్టించడం ద్వారా వైసీపీ ఎవరికి మేలు చేయాలనుకుంటోంది" అని ప్రశ్నించారు.

### అభివృద్ధిని అడ్డుకునేందుకు వైసీపీ కుట్రలు

'ప్రజలకు అందాల్సిన మౌలిక సదుపాయాలు, గ్రామాలకు రావాల్సిన నిధులు రాజకీయాలకు బలికాకూడదు. కార్యకర్తలకు అన్యాయం జరుగు తోందంటూ కోర్టులను ఆశ్రయిస్తున్న వైసీపీ నేతలు, రాష్ట్ర అభివృద్ధిపై తమకున్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి. రాజకీయ ప్రయోజనాల కోసం ఎన్నికల ప్రక్రియకు ఆటంకాలు కలిగించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. వైసీపీ నేతలు రాజకీయ డ్రామాలు పక్కనపెట్టి వాస్తవాలను ప్రజల ముందుంచాలి. స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అన్ని రాజకీయ పార్టీలు బాధ్యతగా వ్యవహరించాలి. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలను ప్రజలు సహించరు' అని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ స్పష్టం చేశారు.

# వైద్య విద్యలో పరిశోధనలకు పెద్దపీట

- **త్వరలో 'క్వాంటం బయాలజీ' కోర్సు ప్రారంభం**
- **వైద్యుల నిరంతర శిక్షణ, పరిశోధనల కోసం రాష్ట్రంలో ప్రత్యేక మెడికల్ అకాడమీ ఏర్పాటు చేయాలి**
- **డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ చంద్రశేఖర్**




విజయవాడ (చైతన్యరథం): విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళా వేదికలో సోమవారం డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం రూబీ జూబ్లీ సెలబ్రేషన్స్‌ను ఘనంగా నిర్వహించారు. అధ్యక్షత వహించిన డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ పి.చంద్రశేఖర్ స్వాగతోపన్యాసం చేస్తూ... 40 సంవత్సరాల వేడుకలు చేసుకోవటం సంతోషంగా ఉందన్నారు. మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ నందమూరి తారక రామారావు దూరదృష్టితో 1986లో దేశంలోనే మొట్టమొదటి హెల్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయంగా ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆవిర్భవించిందని గుర్తు చేశారు. గత 40 ఏళ్లుగా వైద్య విద్యా రంగంలో విశ్వవిద్యాలయం విశేష ప్రగతి సాధించిందన్నారు. అల్లోపతి, డెంటల్, ఆయుష్, నర్సింగ్, ఫార్మసీ విభాగాల్లో లక్షలాది మంది నిపుణులను తీర్చిదిద్ది అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందన్నారు.

**వైద్య పరిశోధనలకు రూ.13 కోట్లు కేటాయింపు**

వైద్య రంగంలో పరిశోధనలను ప్రోత్సహించేందుకు విశ్వవిద్యాలయం ఇప్పటికే సుమారు రూ.13 కోట్ల నిధులను కేటాయించిందని వీసీ తెలిపారు. వైద్య రంగంలో వస్తున్న ఆధునిక మార్పులకు అనుగుణంగా నూతన కోర్సులను ప్రవేశపెడుతున్నామని చెప్పారు. గైనకాలజీ ఎండోస్కోపీ, లాపరోస్కోపిక్ సర్జరీ, కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ, రిప్రొడక్టివ్ మెడిసిన్, ఫీటల్ మెడిసిన్, పీడియాట్రిక్ క్రిటికల్ కేర్ వంటి ప్రత్యేక విభాగాల్లో పోస్ట్-డాక్టోరల్ ఫెలోషిప్ కోర్సులను ప్రారంభించినట్టు వివరించారు. రీసెర్చ్ మెథడాలజీ, బయోస్టాటిస్టిక్స్, హాస్పిటల్ ఇన్ఫెక్షన్ కంట్రోల్ తదితర అంశాల్లో సర్టిఫికెట్ కోర్సులు అందిస్తున్నామని తెలిపారు. వైద్య విద్య, పరిశోధనల్లో సరికొత్త అవకాశాలకు మార్గం సుగమం చేసేలా త్వరలోనే వినూత్నమైన 'క్వాంటం బయాలజీ' కోర్సును కూడా ప్రవేశపెడతామని వెల్లడించారు.

**ఏఐ, డిజిటల్ టెక్నాలజీలకు అనుగుణంగా వైద్య విద్య**

భవిష్యత్తులో వైద్య విద్య ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్, సిమ్యులేషన్ ఆధారిత సాంకేతిక పరిజ్ఞానంతో మరింతగా ముడిపడి ఉంటుందని వీసీ పేర్కొన్నారు. ఈ మార్పులకు అనుగుణంగా విద్యార్థులకు ఆధునిక వైద్య పరిజ్ఞానాన్ని అందిస్తూ, భవిష్యత్తు సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేలా వారిని తీర్చిదిద్దుతున్నామని తెలిపారు.

**రాష్ట్రంలో ప్రత్యేక 'మెడికల్ అకాడమీ' ఏర్పాటు చేయాలి**

ఆంధ్రప్రదేశ్‌లో వైద్యుల నిరంతర శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, వైద్య పరిశోధనలకు మరింత ప్రోత్సాహం అందించేందుకు ప్రత్యేకంగా 'మెడికల్ అకాడమీ' ఏర్పాటు చేయాలని వీసీ డాక్టర్ చంద్రశేఖర్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఐఏఎస్ అధికారులకు ముస్సోరీలో లాల్‌బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్, న్యాయాధికారులకు భోపాల్‌లో జ్యుడీషియల్ అకాడమీ ఉన్నట్లుగానే, రాష్ట్ర వైద్యులకు నిరంతర శిక్షణ, ఆధునిక వైద్య పరిజ్ఞానం, పరిశోధనల కోసం ప్రత్యేక వ్యవస్థ అవసరమని అభిప్రాయపడ్డారు.

హైకోర్టు కమిటీ చైర్మన్ జస్టిస్ దుర్గాప్రసాద్ ఆలోచన మేరకు డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ చట్టానికి సవరణలు చేసి, ప్రత్యేక అధ్యాయం ద్వారా మెడికల్ అకాడమీని చట్టబద్ధంగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ అకాడమీ ఏర్పాటుతో వైద్యుల వృత్తిపరమైన నైపుణ్యాల పెంపు, నిరంతర వైద్య విద్య, పరిశోధనల అభివృద్ధికి గణనీయమైన ప్రోత్సాహం లభిస్తుందని వీసీ ఆశాభావం వ్యక్తం చేశారు.

నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) మెడికల్ అసెస్‌మెంట్ అండ్ రేటింగ్ బోర్డు డైరెక్టర్ డాక్టర్ ఎంకే రమేష్ మాట్లాడుతూ... వైద్య రంగంలో సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత తరుణంలో ఆధునిక టెక్నాలజీని సమర్థంగా వినియోగించుకుంటూనే మానవీయ విలువలు, సానుభూతి, నైతిక ప్రమాణాలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చే అంతర్జాతీయ స్థాయి వైద్యులను తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నాలుగు దశాబ్దాల ప్రస్థానంలో దేశానికి ఎంతోమంది ప్రతిభావంతులైన వైద్యులను అందించిందని ఆయన ప్రశంసించారు. దేశంలోనే మొట్టమొదటి హెల్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయంగా ఆవిర్భవించిన ఈ సంస్థ వైద్య విద్యా రంగంలో విశిష్ట గుర్తింపు సాధించిందని పేర్కొన్నారు.

జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా 2030 నాటికి ఉన్నత విద్యా సంస్థలు బహుళ విభాగాల సమ్మేళనంతో కూడిన మల్టీడిసిప్లినరీ విశ్వవిద్యాలయాలుగా రూపాంతరం చెందాల్సిన అవసరం ఉందని డాక్టర్ రమేష్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక ఆరోగ్య విశ్వ విద్యాలయాలు తమ లక్ష్యాలు, విద్యా విధానాలు, భవిష్యత్తు ప్రణాళికలను సమీక్షించుకోవాల్సిన సమయం ఆసన్నమైందని అభిప్రాయపడ్డారు. వైద్య విద్యను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు మారుతున్న అవసరాలకు అనుగుణంగా బోధనా విధానాలు, పరిశోధనా కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు.

అమెరికా, యూరప్ వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో వైద్య చికిత్సల ఖర్చులు భారీగా పెరిగిపోవడంతో పాటు, చికిత్స కోసం రోగులు దీర్ఘకాలం వేచి ఉండాల్సిన పరిస్థితులు ఉన్నాయని డా. రమేష్ వివరించారు. దీనికి భిన్నంగా భారతదేశంలో నాణ్యమైన వైద్య సేవలు తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉండటం దేశానికి ప్రధాన బలమని పేర్కొన్నారు. అత్యుత్తమ వైద్య నైపుణ్యాలు, ఆంగ్ల భాషపై ప్రావీణ్యం, అందుబాటు ధరల్లో చికిత్స అందించే సామర్థ్యం కారణంగా భారత్ అంతర్జాతీయ హెల్త్ టూరిజం కేంద్రంగా ఎదుగుతోందని తెలిపారు. విదేశీ రోగులు భారత దేశంలో చికిత్స పొందేందుకు ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో ఈ అవకాశాలను మరింతగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వైద్య కళాశాలల్లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లను విస్తృతంగా నిర్వహించి అధ్యాపకుల బోధనా నైపుణ్యాలను పెంపొందించాలని డాక్టర్ రమేష్ సూచించారు. విద్యార్థుల్లో చిన్న వయస్సు నుంచే పరిశోధనా దృక్పథాన్ని, ప్రశ్నించే తత్వాన్ని, శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఆధునిక సాంకేతికత వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నప్పటికీ వైద్యుడు-రోగి మధ్య ఉండే అనుబంధం, పరస్పర విశ్వాసం, సానుభూతి, నైతిక విలువలు ఎప్పటికీ కీలకమేనని స్పష్టం చేశారు. టెక్నాలజీని మానవీయ దృక్పథంతో సమన్వయం చేస్తూ, మారుతున్న వైద్య రంగ సవాళ్లను ఎదుర్కొనేలా విద్యార్థులను సిద్ధం చేయాలని ఆయన ఆకాంక్షించారు.



# వ్యాపారం పేరుతో రూ.50 లక్షలు స్వాహా... ఆపై బెదిరింపు

- **వైసీపీ నేతలపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు**
- **వైసీపీ నాయకురాలి భూదందాపై చర్యలు తీసుకోవాలంటూ వినతి**
- **దివ్యాంగుడి భూమి కబ్జా.. న్యాయం చేయాలని విజ్ఞప్తి**
- **అర్జీలు స్వీకరించిన గ్రీవెన్స్ మేనేజర్**

మంగళగిరి (చైతన్యరథం): మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్రాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు రాష్ట్రం నలుమూలల నుంచి పలువురు తరలివచ్చారు. వారి నుంచి గ్రీవెన్స్ మేనేజరు అర్జీలు స్వీకరించారు. కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన గుడిసె నరసింహులు అభ్యర్థన... 'వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన పొన్నా శంకరయ్య (ప్రస్తుతం విశాఖపట్నంలో నివాసం), కడపకు చెందిన పట్నం లక్ష్మీనారాయణ నన్ను సంప్రదించారు. కడప జిల్లా మైలవరం మండలం వద్దిరాల వద్ద ఎంఆర్‌కేఆర్ సంస్థ పరిధిలోని క్రషర్ మిషన్ ప్రాజెక్టులో భాగస్వామ్యం కల్పిస్తామని నమ్మించారు. 7-6-2021 నాటి ఒప్పంద అగ్రిమెంట్ ప్రకారం మొత్తం రూ.50 లక్షలు సమకూర్చాను. ఇందులో రూ.30 లక్షలను 'మెసర్స్ లక్ష్మీ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్' ఓనర్ పట్నం లక్ష్మీ బ్యాంక్ ఖాతాకు ఆన్‌లైన్ ద్వారా బదిలీ చేశారు. మిగిలిన రూ.20 లక్షలను పొన్నా శంకరయ్య, ఆయన భార్య మీనా, పట్నం లక్ష్మీనారాయణ, పట్నం లక్ష్మీల సమక్షంలో సాక్షుల ఎదుట నగదు రూపంలో అందజేశాను. ఒప్పందం ప్రకారం వ్యాపారంలో రావాల్సిన లాభం గానీ, అసలు మొత్తం గానీ చెల్లించకుండా తప్పించుకు తిరుగుతున్నారు. ఇటీవల ప్రొద్దుటూరులో నిందితులను కలిసి నిలదీయగా, "మేము వైసీపీ నాయకులం.. ఎవరికి చెప్పుకుం టావో చెప్పుకో" అంటూ దుర్భాషలాడి, డబ్బులడిగితే చంపేస్తామని బెదిరించారు. కావున వారిపై చర్యలు తీసుకోవాలని కోరాడు.



అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం పెనకచెర్ల కొత్తపల్లి గ్రామానికి చెందిన ఎం.అనిల్‌కుమార్ అర్జీ... 'మా గ్రామంలో సర్వే నెం.144లో నా తల్లి పేరిట ఒక ఎకరం భూమి ఉంది. ఈ భూమి విషయంలో అనంతపురం జిల్లా జాయింట్ కలెక్టర్, డీఆర్వో మాకు అనుకూలంగా స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేశారు. అన్ని చట్టబద్ధమైన పత్రాలు మా వద్ద ఉన్నప్పటికీ పెనకచెర్లకు చెందిన వైసీపీ నాయకురాలు బి.రామాంజనమ్మ ఆ భూమితో పాటు సర్వే నెం.81లోని భూమిని కూడా అక్రమంగా కబ్జా చేశారు. ఈ విషయంపై అధికారులకు ఐదుసార్లు వినతిపత్రాలు అందజేశాం. అయినప్పటికీ గార్లదిన్నె తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వో, స్థానిక వీఆర్ఏ కబ్జాదారులపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు.'

చిత్తూరు జిల్లా గంగవరం మండలం గండ్రాజుపల్లి గ్రామానికి చెందిన కె.మంజునాథ్ వినతి... 'దివ్యాంగుడైన నేను పశువులను మేపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. గ్రామంలోని సర్వే నెం.141/5లో ఒక ఎకరం, సర్వే నెం.141/3(బి)లో 0.20 సెంట్ల భూమి ఉంది. జీవనాధారమైన ఈ భూమిని పి.సుబ్రమణ్యం శెట్టి, కె.అశ్వత్థమ్మ అనే వ్యక్తులు దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారు. ఈ సమస్యపై స్థానిక తహసీల్దార్, వీఆర్వోలకు అర్జీ సమర్పించినా వారు న్యాయం చేయకుండా ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.'

అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం పప్పిరెడ్డిపల్లికి చెందిన ఆర్.నారాయణస్వామి అర్జీ... '1972లో నా తండ్రి ఆర్. గుర్రప్ప కొనుగోలు చేసిన భూమిని అప్పటి నుంచి మేమే సాగు చేసుకుంటున్నాం. క్రమం తప్పకుండా భూమి శిస్తు చెల్లిస్తూ విద్యుత్ కనెక్షన్ తీసుకున్నాం. రెవెన్యూ రికార్డుల ప్రకారం 1(బి), 10(1) అడంగల్‌తో పాటు ప్రభుత్వమే జారీ చేసిన మూడు పట్టాదారు పాసుపుస్తకాలు కూడా మా పేరిటే ఉన్నాయి. గతంలో సెటిల్‌మెంట్ ఆర్డర్ కాపీలో ఎస్ఆర్ నెంబరు నమోదు కాలేదన్న నెపంతో ఈ భూమిని నిషేధిత ఆస్తుల జాబితా 22(ఎ)లో చేర్చి రిజిస్ట్రేషన్ కాకుండా నిలిపివేశారు. ఈ విషయంపై అనేకసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి న్యాయం జరగలేదు.'

పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మండలం పాత పూసలమర్రు గ్రామానికి చెందిన పుష్పరాజ్ అభ్యర్థన... 'మా గ్రామంలో డోర్ నెం.1/100-4లో నివసిస్తున్న దివ్యాంగుడైన నా ఇంటి ఖాళీ స్థలంలోకి చొచ్చుకొచ్చి బొమ్మిడి లక్ష్మీనాగేశ్వరమ్మ అనే వ్యక్తి దౌర్జన్యంగా నిర్మాణం చేపడుతున్నారు. ఈ స్థలం సరిహద్దులకు సంబంధించి ఇంతవరకు ప్రభుత్వ సర్వేయర్లెవరూ వచ్చి అధికారికంగా కొలతలు వేయలేదు. దీనివల్ల సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. కావున వారిపై చర్యలు తీసుకుని నా సమస్యను పరిష్కరించండి'

పై వీటితో పాటు పలువురు పింఛను, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్‌లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం ఆర్థిక తోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థనలు అందించారు.

# చెప్పాం.. చేస్తున్నాం.. సగర్వంగా ప్రజలకు వివరించండి

**●28 నెలల్లో కూటమి ప్రభుత్వం సాధించిన అభివృద్ధిని ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలి!**

**●టీడీపీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేసిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



కోటబొమ్మాళి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 28 నెలల్లో రాష్ట్రంలోని పల్లెలు, పట్టణాల అభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలను, ప్రజలకు అందించిన సంక్షేమ ఫలాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. 'చెప్పాం.. చేస్తున్నాం..' అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లి, ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రభుత్వం సాధిస్తున్న ప్రగతిని సగర్వంగా వివరించాలని పిలుపునిచ్చారు.ఎంపీటీసీ, జెడ్పీటీసీ నామినేషన్ల ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో ముఖ్య నాయకులు, పార్టీ శ్రేణులతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ నాయకులు, కార్యకర్తలు అనుసరించాల్సిన కార్యాచరణపై పలు సూచనలు చేశారు.

**ప్రతి ఓటరును కలవాలి.. ప్రతి ఇంటికీ వెళ్లాలి!**

2024 ఎన్నికల్లో ప్రజలు కూటమిపై నమ్మకంతో అద్భుతమైన విజయాన్ని అందించారని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ, సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. ఈ 28 నెలల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, గ్రామాలు, పట్టణాల్లో జరుగుతున్న మార్పులను ప్రజలకు క్షేత్రస్థాయిలో వివరించాలని సూచించారు.కేవలం ఎన్నికల సమయంలోనే కాకుండా, నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలను తెలుసుకోవాలని, ప్రభుత్వం చేపట్టిన మంచి కార్యక్రమాలను ప్రతి ఓటరుకు అర్థమయ్యేలా వివరించాలని నాయకులకు సూచించారు. గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ ప్రజలతో మమేకం కావాలని, పార్టీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు.

**ప్రభుత్వ ప్రగతే మన ప్రచార అస్త్రం!**

కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే పార్టీకి ప్రధాన బలమని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ, రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందనే విషయాన్ని ప్రజలకు గర్వంగా చెప్పాలన్నారు. 'చెప్పాం.. చేస్తున్నాం' ప్రచారాన్ని మరింత ముమ్మరం చేసి, ప్రభుత్వ పనితీరును ప్రజలకు చేరువ చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేయాలని, క్షేత్రస్థాయిలో ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగించాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసుకుంటూ, కూటమి ప్రభుత్వం సాధించిన ప్రగతిని ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికీ తీసుకెళ్లడమే లక్ష్యంగా ముందుకు సాగాలని నాయకులు, కార్యకర్తలకు స్పష్టం చేశారు.

**టెక్కలి నియోజకవర్గంలో కొనసాగుతున్న చేరికల పరంపర**

టెక్కలి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలోకి చేరికల పరంపర కొనసాగుతోంది. నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో వైకాపాకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఆ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారు. త్వరలో జరగనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో టీడీపీలో చేరేందుకు పలువురు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో టెక్కలి మండలం తొలుసూరిపల్లి గ్రామానికి చెందిన 15 వైకాపా కుటుంబాల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

# కూటమి అభ్యర్థి గెలుపు... విశాఖ సమగ్ర అభివృద్ధికి తోడ్పాటు



విశాఖపట్నం (చైతన్యరథం): జీవీఎంసీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన మేయర్ అభ్యర్థి ముక్కా శ్రావణిని, 120 వార్డుల్లో పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థులందరినీ భారీ మెజార్టీతో గెలిపించి విశాఖ నగర సమగ్ర అభివృద్ధికి తోడ్పడాలని టీడీపీ ముస్లిం మైనారిటీ కమిటీ నేతలు పిలుపునిచ్చారు. సోమవారం విశాఖలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మైనారిటీ కమిటీ ప్రతినిధులు మాట్లాడారు. కూటమి పాలనలోనే ముస్లిం సమాజానికి సంపూర్ణ భరోసా లభించిందన్నారు. టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ వైస్ ప్రెసిడెంట్ అబ్దుల్ చిన్న రెహమాన్ మాట్లాడుతూ... టీడీపీ, జనసేన, బీజేపీల ప్రజా కూటమి ఎల్లప్పుడూ ముస్లిం మైనారిటీల సంక్షేమం, సాధికారతకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తోందని పేర్కొన్నారు. సమాజంలో మైనారిటీలు ఆత్మగౌరవంతో, సామాజిక భద్రతతో జీవించేందుకు కూటమి ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోందని స్పష్టం చేశారు. 120 వార్డుల్లోని ముస్లిం సోదరులు ఏకతాటిపై నిలవాలని, విశాఖ నగర పరిధిలోని 120 వార్డుల్లో నివసిస్తున్న ప్రతి ముస్లిం కుటుంబం కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు మద్దతు తెలపాలని జిల్లా మైనారిటీ సెల్ నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో విశాఖ టీడీపీ ముస్లిం మైనారిటీ కమిటీ ముఖ్య నాయకులు అబ్దుల్ చిన్న రెహమాన్, అబ్దుల్ అనీఫ్, మహమ్మద్ గౌస్, షేక్ కాలేశా,సుభాన్ అలీ, షేక్ రఫీ, అబ్దుల్ సత్తార్ తదితర నాయకులు, కార్యకర్తలు, మైనారిటీ ప్రముఖులు పాల్గొన్నారు.

# తీవ్ర తుపానుగా అర్నబ్... విశాఖ- బాపట్ల మధ్య తీరం దాటే అవకాశం



అమరావతి (చైతన్యరథం): బంగాళాఖాతంలో అర్నబ్ తుపాను తీరం దిశగా దూసుకొస్తుంది. విశాఖకు 580 కిలోమీటర్లు, కాకినాడకు 660 కిలోమీటర్లు, మచిలీపట్నానికి 760 కిలోమీటర్లు, బాపట్లకు 830 కిలోమీటర్లు, గోపాల్‌పూర్ (ఒడిశా)కు 550 కిలోమీటర్ల దూరంలో తుపాను కేంద్రీకృతమైంది. ఈ క్రమంలోనే మంగళవారం నాటికి తీవ్ర తుపానుగా బలపడనుంది. నేడు అతి తీవ్ర తుపానుగా మారనుంది. బుధవారం ఉదయం బాపట్ల-విశాఖ మధ్య యానాం వద్ద తీరం దాటే అవకాశం ఉంది. తీరం దాటే సమయంలో గరిష్ఠంగా 140 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని అధికారులు తెలిపారు. రేపు, ఎల్లుండి కొన్నిచోట్ల అత్యంత భారీ వర్షాలు కురవడంతో పాటు బలమైన ఈదురుగాలులు వీస్తాయని వివరించారు. మంగళవారం కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించారు. శ్రీకాకుళం, మన్యం, విజయనగరం, విశాఖ, అల్లూరి, పోలవరం, అనకాపల్లి, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. పల్నాడు, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు జిల్లాల్లో భారీ వర్షాలు కురవనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కోస్తా తీరం వెంబడి 90 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని అధికారులు పేర్కొన్నారు. చెట్లు, భారీ హోర్డింగ్స్, శిథిలావస్థలోని భవనాల్లో ఉండరాదని హెచ్చరించారు. ఇబ్బందులు ఉంటే ముందే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. అదేవిధంగా మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని, ఎగసిపడే అలల వద్దకు వెళ్లి సెల్ఫీలు దిగవద్దని హెచ్చరికలు జారీ చేశారు. అత్యవసర సహాయక చర్యలకు జిల్లాల్లో 7 ఎన్‌డీఆర్ఎఫ్, 8 ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచారు. అత్యవసర సహాయం కోసం విపత్తుల సంస్థ టోల్‌ఫ్రీ నంబర్లు 112, 1070, 1800 425 0101ను సంప్రదించాలని అధికారులు తెలియజేశారు.

# పైడితల్లి అమ్మవారి ఆశీస్సులు ప్రజలపై ఉండాలి



విజయనగరం (చైతన్యరథం): విజయనగరంలోని శ్రీపైడితల్లి అమ్మవారిని డీసీసీబీ చైర్మన్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. విజయనగరం జిల్లా ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. పైడితల్లి అమ్మవారి చల్లని దీవెనలు జిల్లా ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు. ప్రజలందరికీ మంచి జరగాలని, జిల్లా సుభిక్షంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని అమ్మవారిని వేడుకున్నారు.

# పైడితల్లి తొలేలు ఉత్సవం... ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతి కుటుంబసభ్యుల ప్రత్యేక పూజలు



విజయనగరం (చైతన్యరథం): విజయనగరం పైడితల్లి అమ్మవారి తొలేలు ఉత్సవం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు కుటుంబసభ్యులతో అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర సమర్పించి పూజలు చేశారు. ప్రధాన ఘట్టమైన సిరిమానోత్సవం మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభమవుతుంది. కలెక్టర్ రామసుందర్ రెడ్డి ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎస్పీ ఏ.ఆర్. దామోదర్ ఆధ్వర్యంలో పోలీస్ బస్సు ఏర్పాటు చేసి భద్రతా చర్యలను చేపట్టారు. పైడితల్లి అమ్మవారి నామ స్మరణతో విజయనగరం జిల్లా కేంద్రం మారు మోగుతుంది. భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ఘటాలు సమర్పించుకొని పూజలు చేస్తున్నారు.

# సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలి... జీవీఎంసీ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే గణబాబు



విశాఖపట్నం (చైతన్యరథం): నగరంలోని 69వ వార్డులో ప్రభుత్వ విప్ గణబాబు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 69వ వార్డు కూటమి కార్పొరేటర్‌గా పోటీ చేస్తున్న అభ్యర్థి యలమంచిలి ప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. బుచ్చిరాజుపాలెం నుండి బాజీ జంక్షన్ వరకు కూటమి నేతలు, కార్యకర్తలతో కలిసి ఆయన భారీ ర్యాలీగా వెళ్లి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. స్థానిక ప్రజలు గణబాబుకి, కూటమి శ్రేణులకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ... రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ సంక్షేమం, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తోందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి ఫలాలు వార్డు స్థాయికి సమర్థవంతంగా చేరాలన్నా, స్థానికంగా నెలకొన్న డ్రైనేజీ, రహదారులు, తాగునీరు వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం దక్కాలన్నా జీవీఎంసీలో కూడా కూటమి పాలనే రావాలని స్పష్టం చేశారు. వార్డు సమగ్ర అభివృద్ధి కోసం... కూటమి కార్పొరేటర్ అభ్యర్థి యలమంచిలి ప్రసాద్‌ని, జీవీఎంసీ మేయర్ అభ్యర్థిని డాక్టర్ ముక్కా శ్రావణిని, సైకిల్ గుర్తుపై మీ అమూల్యమైన ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వార్డు ప్రజలను కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో కూటమి సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు మరియు స్థానిక కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఈ నెల 27, 28 తేదీల్లో పాఠశాలలకు సెలవులు... కాకినాడకు ప్రత్యేక బృందాలు

అమరావతి (చైతన్యరథం): అర్నాబ్ తుపాను తీవ్రత దృష్ట్యా ఏపీలోని వివిధ జిల్లాల్లో పాఠశాలలకు అధికారులు సెలవులు ప్రకటించారు. ఈ నెల 27, 28 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతోపాటు అంగన్వాడీ కేంద్రాలకు సెలవులిస్తున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి వెల్లడించారు. మరోవైపు విశాఖ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పాఠశాలలకు మంగళ, బుధవారాల్లో సెలవులు ప్రకటించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమకుమార్ వెల్లడించారు. విద్యార్థుల రక్షణ, భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి ఎవరైనా పాఠశాలలు తెరిస్తే.. కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కృష్ణా జిల్లా వ్యాప్తంగా పాఠశాలలకు రేపు, ఎల్లుండి సెలవులు ఇస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రకటన విడుదల చేశారు.

## తాడేపల్లి ప్యాలెస్‌లో దాక్కుని ప్రెస్ మీట్లా?

- పులివెందుల ఏకగ్రీవాలతో జగన్‌కు మతిభ్రమించింది
- వైసీపీ నాయకుడు జగన్‌పై మండిపడ్డ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



జగ్గంపేట (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రజలు తిరస్కరిస్తారనే అభద్రతాభావంతో పులివెందుల ఎమ్మెల్యే జగన్ మతిభ్రమించి తాడేపల్లి ప్యాలెస్ లో దాక్కుని రోజుకో ప్రెస్ మీట్ పెడుతున్నారని జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యులు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ తీవ్రంగా విమర్శించారు. జగ్గంపేట రావులమ్మ నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు ప్రజల మధ్యకు వెళ్లి రెండున్నరేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ దూసుకుపోతుంటే, జగన్ ప్రజల మద్దతు కూడగట్టలేక ప్రజాస్వామ్యం ఖూనీ అయిందంటూ డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. సాక్షాత్తు తన సొంత నియోజకవర్గం పులివెందులలోనే కూటమి అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికవుతున్నారని, ఇది జగన్ కు చెంపపెట్టు అని అన్నారు. 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ ఎలాంటి అరాచకాలు సృష్టించిందో ఒక్కసారి మీడియా క్లిప్పింగ్స్ తెచ్చుకుని చూసుకోవాలని జగన్‌కు హితబోధ చేశారు. ఇప్పటికైనా కళ్లు తెరుచుకుని ప్రజల్లోకి వెళ్లి ఓట్లు అడగాలని, కూటమి ప్రభుత్వం తప్పులు చేస్తే వాటిని ప్రజల్లో చెప్పాలని తప్ప తాడేపల్లిలో కూర్చుని అబద్ధపు ప్రెస్ మీట్లు పెడితే ప్రజలు నమ్మే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో నిత్యావసర ధరల స్థిరీకరణ కోసం ప్రభుత్వం రైతు బజార్లు, ప్రభుత్వ అవుట్ లెట్ల ద్వారా ప్రజలకు తక్కువ ధరకే నిత్యావసర వస్తువులు అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తోందని జ్యోతుల నెహ్రూ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ వి ఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, అన్నవరం దేవస్థానం పాలకమండలి సభ్యులు పాలచర్ల నాగేంద్ర చౌదరి, గోకవరం మండల టిడిపి అధ్యక్షులు పీల్లా చంటిబాబు, వేములకొండ జోగారావు తదితరులు పాల్గొన్నారు.

## కూటమి చైర్‌పర్సన్ అభ్యర్థిని విస్తృత ప్రచారం



జంగారెడ్డిగూడెం (చైతన్యరథం): పశ్చిమ గోదావరి జిల్లా జంగారెడ్డిగూడెం పురపాలక సంఘం కూటమి చైర్ పర్సన్ అభ్యర్థిని రొంగల అనూష పట్టణంలోని పలు వార్డుల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 9వ వార్డు పరిధిలోని మీ సేవా కేంద్రం సమీపంలో సోమవారం ఉదయం తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. 9వ వార్డు టీడీపీ కౌన్సిలర్ అభ్యర్థిని సుంకర వెంకటలక్ష్మితో కలిసి ప్రచారం చేశారు . అనంతరం పదో వార్డు టీడీపీ కౌన్సిలర్ అభ్యర్థిని తెలగారపు లావణ్య, 11వ వార్డు తెదెపా అభ్యర్థి కరణం రాంబాబులతో కలిసి ఏలూరు రోడ్డు, మారుతి నగర్, లక్ష్మీ గణపతి టౌన్షిప్ తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. పలుచోట్ల ఓటర్లు అనూష నుదుట తిలకం దిద్ది, హారతులతో స్వాగతం పలికారు. 17వ వార్డు టీడీపీ అభ్యర్థిని కరుటూరి రమాదేవి, కూటమి నాయకులు మండవ లక్ష్మణరావు, పరిమి సత్యనారాయణ, గుమ్మడి ప్రసాద్, కరాటం ఉమా తదితరులు పాల్గొన్నారు.

## ఒంగోలులో ఇంటింటి ప్రచారం... పాల్గొన్న ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు



ఒంగోలు (చైతన్యరథం): నగరంలోని కార్పొరేషన్ ఎలక్షన్స్‌లో భాగంగా సోమవారం ఉదయం నుండి 14,15,16,29,30 డివిజన్‌లలో ఎన్నికల ప్రచార కార్యక్రమాలలో ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూటమి పార్టీల మేయర్ అభ్యర్థి శిల్ప, కార్పొరేటర్ టీడీపీ అభ్యర్థులు ముప్పిరి ముత్యాలరాణి, నందూరి లక్ష్మి ప్రసన్న, గొర్రెముచ్చు దీప్తి, షేక్ మున్వర్ బాషా మరియు కరేటి మాధవి లతకు మద్దతుగా ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్‌రావు ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. అభ్యర్థుల అందరకూ సైకిల్ గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజలకు అందిస్తున్న ప్రయోజనాలను ఇంటింటికీ వెళ్లి వివరిస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను గెలిపించి, స్థానిక అభివృద్ధికి సహకరించాలని ఓటర్లను కోరారు.

## ప్రజలను ఓట్లు అడిగే హక్కు వైసీపీకి ఉందా ? : ఎమ్మెల్యే నసీర్



గుంటూరు (చైతన్యరథం): 'ప్రజలను ఓట్లు అడిగే హక్కు వైసీపీకి ఉందా? గుంటూరు తూర్పు నియోజకవర్గంలో పదేళ్ల కాలంలో ఒక్క అభివృద్ధి పనులైనా చేశారా? ఇప్పుడు ప్రజలను వద్దకు ఎలా వెళతారు? రెండున్నరేళ్ల కాలంలో అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలను అందించాం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వ సమష్టి కృషి ఇది. అందరూ సమన్వయంతో కూటమి అభ్యర్థులకు విజయాన్ని అందించండి' అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. సోమవారం స్థానిక 7, 8, 9, 73, 74 డివిజన్లలో కూటమి బలపరిచిన కార్పొరేటర్ అభ్యర్థులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ నెహ్రూనగర్ ప్రాంతంలో ఎన్నడూలేని అభివృద్ధి చేసి చూపించామని తెలిపారు. ఈ ప్రాంత ప్రజలను కూటమికి మద్దతుగా నిలిచారని, ఇప్పుడు కూడా అదే ఆదరణ చూపించాలని కోరారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాజధాని ఎక్కడ అని గూగుల్‌ని అడిగినా చెప్పలేని పరిస్థితి ఉండేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేశంలోనే గొప్ప రాజధానిగా అమరావతిని సీఎం చంద్రబాబునాయుడు తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. విజనరీ లీడర్‌లో విజయాలు వెతుక్కుంటూ వస్తాయన్నారు. పోలవరం వంటి ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టులు పూర్తి చేస్తున్నామన్నారు. గుంటూరు నగరంలో శంకర్ విలాస్, నందివెలుగు బ్రిడ్జిల నిర్మాణాలు చేపట్టామని చెప్పారు. నెహ్రూనగర్ ప్రాంతంలో రైల్వే డ్రెయిన్ నిర్మాణం కారణంగా ఇల్లు కోల్పోయిన వారికి సహాయం అందించామని తెలిపారు. మరో వైపు తల్లికి వందనం, పింఛన్లు, రేషన్ కార్డులు, స్త్రీశక్తి, దీపం వంటి పథకాలతో ప్రజలకు ప్రభుత్వ సేవలు అందిస్తున్నామని చెప్పారు. కార్పొరేటర్ అభ్యర్థులు అబ్దుల్ సలాం (బాపి), చిలకల ఝాన్సీరాణి, పోతురాజు సమత, అయిశెట్టి శ్రీను, గుడిపల్లి స్వాతిని గెలిపించాలని ప్రజలను కోరారు. మీరు వేసే ఓటు గుంటూరు నగరాభివృద్ధికి బాటగా మారుతుందని చెప్పారు.

## చెప్పాం... చేస్తున్నాం... ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెడుతున్నాం

- మండపేట మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో జిల్లా ఎన్నికల కన్వీనర్, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు



మండపేట (చైతన్యరథం): ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ, అభివృద్ధి--సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని చాటిచెప్పేలా "చెప్పాం... చేస్తున్నాం..." కార్యక్రమంలో భాగంగా తూర్పుగోదావరి జిల్లా ఎన్నికల కన్వీనర్, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మండపేట మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుతో కలిసి పట్టణంలోని 33, 34వ వార్డుల్లో పర్యటిస్తూ ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. స్థానిక ప్రజలతో మమేకమై వారి సమస్యలు, వార్డుల అభివృద్ధికి సంబంధించిన అవసరాలపై చర్చించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, సంక్షేమ పథకాలతో పాటు పట్టణాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని ప్రచారంలో వివరించారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో స్థానిక నాయకులు, టీడీపీ, కూటమి శ్రేణులు పాల్గొన్నారు. చెప్పిన మాటను చేతల్లో చూపిస్తూ... ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ... అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా "చెప్పాం... చేస్తున్నాం..." కార్యక్రమంతో మండపేటలో ఎన్నికల ప్రచారం కొనసాగింది.

## వైసీపీ కుట్ర రాజకీయాలను ప్రజలు గుర్తించాలి : ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు



రాయదుర్గం (చైతన్యరథం): ప్రజాస్వామ్యబద్ధంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలకు విఘాతం కలిగించేలా వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆరోపించారు. బెంగళూరు ప్యాలెస్లో ఉంటూ కుట్ర రాజకీయాలకు ప్రణాళికలు రచిస్తున్నారని విమర్శించారు. రాయదుర్గం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నాయన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశీస్సులు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనా అనుభవం, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహకారం, యువనేత నారా లోకేశ్ వేగం కలిసి రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువల దూసుకొస్తున్నాయన్నారు. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్న తరుణంలో ప్రతిపక్ష వైసీపీ దానిని సహించలేక కుట్రపూరిత రాజకీయాలకు పాల్పడుతోందని ఆయన విమర్శించారు. రాష్ట్రానికి కేంద్ర నిధులు రాకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేయడంతోపాటు, హింసాత్మక రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. దొడ్డన్నాల ద్వారా రాజకీయాలను శాసించాలనే ఉద్దేశంతో బెంగళూరు కేంద్రంగా కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు.

## కడప కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసిన వైసీపీకి బుద్ధి చెప్పాలి

కడప (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ మేయర్ అభ్యర్థి మల్లి సువర్ణ విద్యావంతురాలని ఆమె గెలుపు నగర ప్రజల సర్వతో అభివృద్ధికి ఆదర్శంగా మారిపోతుందని తెలుగుదేశం పార్టీ కడప జిల్లా సీనియర్ నాయకులు క్లస్టర్ ఇన్‌ఛార్జ్ అమూరి బాలదాసు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా బాలదాసు మాట్లాడుతూ... గత 30 ఏళ్ల పాలనలో ప్రజల మౌలిక వసతులు కల్పించటంలో అటు కాంగ్రెస్ పార్టీ, వైయస్సార్ ప్రభుత్వం కడప కార్పొరేషన్ నిర్వీర్యం చేశారని, రోడ్లు, అండర్ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్తు మొదలగు సౌకర్యాలు నిర్లక్ష్యం చేస్తూ చివరకు చెత్తపై కూడా పన్ను వేసి వైసిపి ప్రభుత్వం ప్రజలకు తీరని ద్రోహం చేసిందన్నారు. ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి ఈ రాష్ట్రాన్ని పరిపాలించిన రోజుల్లో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసి నిరుద్యోగ యువతను మత్తుకు బానిసలుగా మార్చి నాసిరకం మద్యం తయారు చేయడం దాన్ని సేవించిన కార్మికులు కర్షకులు వ్యవసాయ కూలీలు భవన నిర్మాణ కూలీలు యువత తాగడం ద్వారా ఆరోగ్యం క్షీణించి కిడ్నీ, లివరు, గుండె, ఊపిరితిత్తులు పాడైపోయి అర్ధాంత మరణాలకు కారణమైన దుర్మార్గుడు జగన్మోహన్‌రెడ్డి అని 2021లో జరిగిన జడ్పిటిసి ఎంపిటిసి పంచాయతీ సర్పంచులు నగరపాలక సంస్థల ఎన్నికలను ప్రజాస్వామ్య పద్ధతి ద్వారా జరపకుండా ప్రజల ఓటు హక్కును కాలరాస్తూ పోలీసులను ప్రభుత్వ అధికారులను గూండాలను లోపరుచుకొని పోటీ చేస్తున్న అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేసి ఏకగ్రీవాలను చేసుకుని ఈ రాష్ట్రంలో రాష్ట్ర శక్తిగా మారిన నాయకుడు జగన్మోహన్‌రెడ్డి అని తెలిపారు.

# అభివృద్ధి పనులతోనే ఆరోపణలకు సమాధానం చెబుతాం

**●వినుకొండ అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం... వైసీపీ ఎమ్మెల్యే బొల్లాకు ప్రభుత్వ ఛీఫ్ విప్ జీవీ సవాల్**



వినుకొండ (చైతన్యరథం): వినుకొండలో రూ.240 కోట్ల శాశ్వత తాగునీటి పథకం పైప్‌లైన్ పనులు గ్రాఫిక్స్ అంటూ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చేసిన విమర్శలకు ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు ఘాటుగా సమాధానమిచ్చారు. వినుకొండ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా జీవీ మాట్లాడుతూ మధ్యాహ్నం 2 గంటలకు తిమ్మాయపాలెం రోడ్డుకు వస్తే అక్కడ జరుగుతున్న తాగునీటి పథకం పనులను చూపిస్తానని బొల్లా బ్రహ్మనాయుడుకు సవాల్ విసిరారు. కళ్లున్న కబోది కూడా అక్కడ జరుగుతున్న పనులను చూస్తే అవి గ్రాఫిక్సా, వాస్తవంగా జరుగుతున్న పనులా అర్థమవుతుందని వ్యాఖ్యానించారు. తాగునీటి పథకం పనులు శరవేగంగా జరుగుతున్నాయని మూడు చెరువుల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు లక్షల లీటర్ల నీటి సరఫరాకు అవసరమైన ఫిల్టర్ బెడ్ల ఏర్పాటుకు పనులు చేపడుతున్నామని జీవి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తన స్థాయికి మించి అబద్దాలు ప్రచారం చేయడం సిగ్గుచేటని విమర్శించారు. వినుకొండ పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూపించేందుకు కూటమి నాయకులతో కలిసి తాను స్వయంగా వస్తానని దమ్ముంటే బొల్లా బ్రహ్మనాయుడు రావాలని సవాల్ విసిరారు. వాస్తవాలను పరిశీలించకుండా అభివృద్ధి పనులపై అబద్దాలు మాట్లాడటం, దుష్ప్రచారం చేయడం బొల్లా అలవాటుగా మార్చుకున్నారని జీవీ విమర్శించారు.

# టీడీపీ అభ్యర్థులకు బి-ఫారాలు అందజేసిన ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



వేమూరు (చైతన్యరథం): నియోజకవర్గ శాసనసభ్యులు, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు చేతుల మీదుగా సోమవారం తెనాలి పట్టణంలోని వేమూరు నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో చుండూరు, భట్టిప్రోలు మండలాలకు చెందిన స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తున్న తెలుగుదేశం పార్టీ అభ్యర్థులకు బి-ఫారాలు అందజేశారు. ఈ సందర్భంగా అభ్యర్థులు ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన తదుపరి కార్యక్రమాలను నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని నక్కా ఆనందబాబు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు ఏకాభిప్రాయంతో, పరస్పర అవగాహనతో, ఐకమత్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధిని ప్రధాన లక్ష్యాలుగా చేసుకుని, కూటమి పార్టీల మధ్య సమన్వయం, పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సమష్టిగా కృషి చేస్తూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి తరపున పోటీ చేస్తున్న అభ్యర్థుల విజయానికి మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, ముఖ్యంగా జనసేన ఎంపీటీసీ అభ్యర్థులకు తెలుగుదేశం పార్టీ శ్రేణులు పూర్తి సహకారం అందించాలని పిలుపునిచ్చారు. కూటమి ఐక్యతను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేస్తూ, అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు.

# కూటమి అభ్యర్థుల విజయానికి శ్రేణులు కృషి చేయాలి : ఎమ్మెల్యే ధూళిపాళ్ళ



పొన్నూరు (చైతన్యరథం): మండలంలో ప్రతి ఎంపీటీసీ స్థానాన్ని కైవసం చేసుకునే దిశగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పొన్నూరు పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేస్తూ, తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఎంపీటీసీ అభ్యర్థుల ఎంపికలో భాగంగా వివిధ గ్రామాల్లో పర్యటించి అభ్యర్థులను నిర్ణయించిన నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... పొన్నూరు మండలంలో కూటమి అభ్యర్థుల విజయమే ప్రధాన లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని అన్నారు. జనసేనకు కేటాయించిన వెల్లలూరు, ఆరేమండ, కసుకర్రు స్థానాల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు జనసేన అభ్యర్థులకు సంపూర్ణ మద్దతు అందించాలని, అదేవిధంగా తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తున్న స్థానాల్లో జనసేన నాయకులు, కార్యకర్తలు సహకరించాలని కోరారు. గ్రామాల్లో వ్యక్తిగత అభిప్రాయ భేదాలు, స్థానిక విభేదాలు ఉన్నప్పటికీ వాటిని పక్కనపెట్టి పార్టీ నిర్ణయించిన అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని స్పష్టం చేశారు. పార్టీ గుర్తుపై జరిగే ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు చేసే ప్రతి చర్య పార్టీ విజయంపై ప్రభావం చూపుతుందని, అభ్యర్థులకు వ్యతిరేకంగా మాట్లాడటం, పార్టీ విజయానికి విఘాతం కలిగించే విధంగా వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. ప్రతి గ్రామానికి నియమించిన ఇన్‌ఛార్జ్‌లు, ఎంపీటీసీల వారీగా బాధ్యతలు తీసుకున్న నాయకులు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని సూచించారు. సీనియర్ నాయకులు ప్రత్యేక బాధ్యతలు తీసుకొని ప్రతిరోజూ గ్రామాల్లో పర్యటిస్తూ, ఇంటింటి ప్రచారం నిర్వహించి ఓటర్లను కలిసి కూటమి అభ్యర్థులకు మద్దతు కోరాలని తెలిపారు. అభ్యర్థులు సైతం ప్రతి ఓటరును వ్యక్తిగతంగా కలిసి తమకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేయాలన్నారు. ప్రస్తుతం ఎంపీటీసీ ఎన్నికల్లో విజయం సాధించడంతో పాటు, భవిష్యత్తులో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి మద్దతుదారులను గెలిపించుకునేలా ఇప్పటి నుంచే పటిష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పొన్నూరు మండలం పార్టీకి అత్యంత కీలకమని, మండలంలోని అన్ని స్థానాల్లో విజయం సాధించేలా నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని సూచించారు.

# బీసీ సంఘాలతో గుంటూరు మేయర్ అభ్యర్థి ఆత్మీయ సమ్మేళనం



గుంటూరు నగరంలోని శ్రీనివాసరావుపేట ఏ-1 కన్వెన్షన్‌లో రాష్ట్ర బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కేసన శంకరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్‌తో కలిసి గుంటూరు నగర కూటమి మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల ప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. పరస్పర పలకరింపులు, ఆత్మీయ సంభాషణలతో సమావేశం కొనసాగింది. గుంటూరు మేయర్ అభ్యర్థిగా బరిలో ఉన్న తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. అనంతరం గుంటూరు నగరంలోని వికాస్‌నగర్, గోరంట్ల తదితర ప్రాంతాల్లో పర్యటించి ఓట్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కార్పొరేషన్ ఎన్నికల్లో వార్ వన్‌సైడ్ కావాలి

**●టీడీపీ యువనాయకులు గద్దె క్రాంతి కుమార్ పిలుపు**



విజయవాడ (చైతన్యరథం): నగర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజలు అండగా నిలచి వార్ వన్ సైడ్ చేయాలి టీడీపీ యువ నాయకులు గద్దె క్రాంతి కుమార్ కోరారు. సోమవారం ఉదయం 10వ డివిజన్ శిఖామణి సెంటర్, బాడవపేట ప్రాంతాల్లో కూటమి కార్పొరేటర్ అభ్యర్థిని కలపాల శ్రీప్రియతో కలిసి గద్దె క్రాంతి కుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలను నేరుగా కలుసుకుని కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. మేయర్ అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణతో పాటు 10వ డివిజన్ కూటమి అభ్యర్థిని కలపాల శ్రీప్రియను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. తొలుత టీడీపీ పార్టీ సీనియర్ నాయకులు సొంగా రవీంద్ర వర్మ ఇంటికి వెళ్లి ఆయనను ఆప్యాయంగా పలుకరించి ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు.

**ఈ సందర్భంగా గద్దె క్రాంతికుమార్ మాట్లాడుతూ...** రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు నిరంతరాయంగా కొనసాగాలంటే స్థానిక సంస్థల్లోనూ అభివృద్ధికి కట్టుబడి పనిచేసే ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాలని క్రాంతి కుమార్ పేర్కొన్నారు. రాష్ట్రంలోనూ, స్థానిక సంస్థల్లోనూ కూటమి ప్రజాప్రతినిధులు ఉంటే ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ డివిజన్‌లో అభివృద్ధి పనులను వేగవంతం చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు.

# మాజీ మంత్రి యనమలకు దేవినేని ఉమా పరామర్శ



కాకినాడ (చైతన్యరథం): కాకినాడలోని కిమ్స్-ట్రస్ట్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్స్‌లో చికిత్స పొందుతున్న మాజీమంత్రి, సీనియర్ టీడీపీ నాయకులు యనమల రామకృష్ణుడిని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పరామర్శించారు. తూర్పుగోదావరి జిల్లా టీడీపీ అధ్యక్షులు, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరితో కలిసి ఆసుపత్రికి వెళ్లిన దేవినేని ఉమా, యనమల రామకృష్ణుడు ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజాసేవలో పాల్గొనాలని ఆకాంక్షించారు.

# ఉపరాష్ట్రపతికి స్వాగతం పలికిన యార్లగడ్డ



గన్నవరం (చైతన్యరథం): భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్‌కు గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయంలో ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు స్వాగతం పలికారు. రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌తో కలిసి ఆయన ఉపరాష్ట్రపతికి స్వాగతం పలికారు. విజయవాడలోని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం 40వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న రూబీ జూబ్లీ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యేందుకు ఉపరాష్ట్రపతి సోమవారం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావుతో పాటు పలువురు ఉన్నతాధికారులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఉపరాష్ట్రపతి విజయవాడలోని అంబేద్కర్ కళావేదికలో నిర్వహించనున్న రూబీ జూబ్లీ వేడుకల్లో పాల్గొనేందుకు రోడ్డు మార్గాన బయలుదేరి వెళ్లారు.

# లక్ష మెజార్టీతో కోవెలమూడి అపర్ణను గెలిపిస్తాం !

**● గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి వెల్లడి**

గుంటూరు (చైతన్యరథం): గుంటూరు నగర పాలక సంస్థ ఎన్నికల్లో 1లక్ష పైగా మెజారిటీతో మేయర్ అభ్యర్థి కోవెలమూడి అపర్ణను, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని ఎన్డీయే కూటమి బలపర్చిన అభ్యర్థులను గెలిపిస్తామని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం గుంటూరు జీటీ రోడ్డులోని ఏ కన్వెన్షన్‌లో కేశన శంకరరావు ఆధ్వర్యంలో ఎన్డీయే కూటమి అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణ, ఎన్డీయే కూటమి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ నిర్వహించిన బీసీ సంఘాల సమైక్య సమావేశానికి ఎమ్మెల్యే గళ్ళా మాధవి హాజరై ప్రసంగించారు బీసీ సామాజికవర్గ నాయకులు, ప్రజలందరినీ ఒకే వేదికపై కలుసుకునే అవకాశం కల్పించిన ఈ సమావేశం ఎంతో ముఖ్యమైనదన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారాల కోసం అడిగే బాధ్యతను బీసీ నాయకులు నిర్వర్తిస్తుంటే, వారికి అండగా ఉంటామని భరోసా ఇవ్వడం కూడా నాయకుల బాధ్యతేనని పేర్కొన్నారు.

## ఆమంచిపై ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ఫైర్

**●ఓట్ల కోసం నోటికొచ్చినట్లు మాట్లాడితే ప్రజలే బుద్ధి చెబుతారు**



చీరాల (చైతన్యరథం): మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత ఆమంచి కృష్ణమోహన్‌పై ఎమ్మెల్యే మద్దులూరి కొండయ్య తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఓట్ల కోసం ఇష్టారాజ్యంగా మాట్లాడితే సహించేది లేదని ఘాటుగా హెచ్చరించారు. రాజకీయ లబ్ధి కోసం ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. చీరాలకు రావాల్సిన మెడికల్ హాస్పిటల్‌ను వెనక్కి పంపించారని, వ్యాన్‌పిక్ భూముల వ్యవహారంలో అవినీతికి పాల్పడ్డారని ఆమంచిపై ఆరోపణలు గుప్పించారు. గతంలో ఏం చేశారో గుర్తు చేసుకోవాలని, విమర్శలు చేసే ముందు వాస్తవాలు తెలుసుకోవాలని మండిపడ్డారు.

**రెండేళ్ల అభివృద్ధి కనిపించడం లేదా?**

చీరాలలో రెండేళ్లలో జరిగిన అభివృద్ధిని చూసి మాట్లాడాలని మద్దులూరి మాలకొండయ్య హితవు పలికారు. రాజకీయాల కోసం ఇష్టానుసారంగా మాట్లాడటం మానుకోవాలని, ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు చేస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

## మార్కాపురంలో జిల్లా ప్రజాప్రతినిధుల కీలక భేటీ



మార్కాపురం (చైతన్యరథం): స్థానిక మార్కెట్ యార్డులో జిల్లా ఎన్నికల ఇన్‌ఛార్జ్, ఎమ్మెల్సీ బీటీ.నాయుడు అధ్యక్షతన జిల్లాలోని కూటమి ప్రజాప్రతినిధుల సమన్వయ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా పార్టీ అధ్యక్షుడు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, యర్రగొండపాలెం టీడీపీ ఇన్‌ఛార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు తదితరులు పాల్గొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు, ఎన్నికల వ్యూహాలు మరియు జిల్లా పరిషత్ ఛైర్మన్ అభ్యర్థి ఎంపిక తదితర కీలక అంశాలపై నేతలు సుదీర్ఘంగా చర్చించారు. కూటమి నేతలంతా సమన్వయంతో పనిచేసి ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని నిర్ణయించారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన వైసీపీ

**●2021ఎన్నికల్లో జరిగిన అక్రమాలు ప్రజాస్వామ్య వ్యవస్థకే మచ్చ**

**●ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు మండిపాటు**




అనంతపురం (చైతన్యరథం): గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుసరించిన విధానాలు ప్రజాస్వామ్య వ్యవస్థకే మచ్చ తెచ్చాయని అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు విమర్శించారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, మాజీ మంత్రి, జిల్లా ఎన్నికల పరిశీలకుడు పీరాసు ప్రతాప్ రెడ్డితో కలిసి పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పూల నాగరాజు మాట్లాడుతూ... ఎన్నికల ప్రక్రియలో ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యతను విస్మరించి, అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రతిపక్ష అభ్యర్థులను ఇబ్బందులకు గురిచేయడం, ఏకగ్రీవాల కోసం ఒత్తిళ్లకు పాల్పడటం వంటి పరిణామాలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. గత స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన గణాంకాలను పరిశీలిస్తే, బలవంతపు నామినేషన్ల ఉపసంహరణలు, నామినేషన్ల ప్రక్రియలో అవకతవకలు, ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలు వంటి అంశాలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరగాల్సి ఉండగా, ఇలాంటి పరిణామాలు ప్రజాస్వామ్యంపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి అభ్యర్థికి సమాన అవకాశాలు కల్పించడం, ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చూడటం ఎన్నికల వ్యవస్థలో అత్యంత కీలకమని పూల నాగరాజు స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పే అంతిమమని, ఎన్నికల్లో అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించేందుకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ, ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే తమ లక్ష్యమని పూల నాగరాజు తెలిపారు.

# అదానీ కృష్ణపట్నం పోర్టుకు 15 అవార్డులు

సర్వేపల్లి (చైతన్యరథం): క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా (క్యూసీఎఫ్ఐ) తిరుపతిలో నిర్వహించిన 12వ వార్షిక కన్వెన్షన్ ఆన్ క్వాలిటీ కాన్సెప్ట్ (సీసీక్యూసీ-26) లో అదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ సోమవారం 15 అవార్డులను గెలుచుకుంది. కార్యాచరణ నైపుణ్యం, ఉద్యోగుల నియామకం, నాణ్యమైన సంస్కృతి, స్థిరమైన వ్యాపార పరివర్తనలో అత్యుత్తమ కృషికి గుర్తింపుగా, ఎకేపీఎల్ ప్రతిష్ఠాత్మక ఉత్తమ పరివర్తన సంస్థ అవార్డుతో సత్కరించింది. అదనంగా, ఈ నౌకాశ్రయం కన్వెన్షన్లో తొమ్మిది బంగారు, ఒక వెండి పతకాలతోపాటు, వివిధ విభాగాల్లో మూడు వ్యక్తిగత అవార్డులు, ఒక ఉత్తమ ప్రదర్శన విభాగంలో అవార్డును గెలుచుకుంది. ఈ అద్భుతమైన విజయానికి బృందాన్ని అభినందిస్తూ, ఎకేపీఎల్ సీఈఓ జగదీష్ పటేల్ మాట్లాడుతూ, కృష్ణపట్నం నౌకాశ్రయం ఆవిష్కరణ, సమస్య పరిష్కార సామర్థ్యాలు, నిరంతర మెరుగుదల కార్యక్రమాలపై దృష్టి సారించిందన్నారు. ఈ అవార్డులు నాణ్యత, జట్టు కృషి, ఆవిష్కరణతోపాటు నిరంతర మెరుగుదల పట్ల ఎకేపీఎల్ యొక్క అచంచలమైన నిబద్ధతను ప్రతిబింబిస్తాయి. శ్రేష్ఠతకు కొత్త ప్రమాణాలను నిర్దేశిస్తూనే తమ ఉద్యోగుల అంకితభావం, అభిరుచి, సమష్టి కృషికి అవి నిదర్శనం అని ఆయన పేర్కొన్నారు. ఈ గుర్తింపు సంస్కృతిని పెంపొందించడానికి, నాణ్యత ఆధారిత కార్యక్రమాల ద్వారా స్థిరమైన వృద్ధిని సాధించడానికి ఎకేపీఎల్ నిబద్ధతను మరింత బలోపేతం చేస్తుందన్నారు.

## ప్రకాశం జిల్లా బాలిక ఘటనపై మహిళా కమిషన్ దిగ్భ్రాంతి

ప్రకాశం జిల్లా (చైతన్యరథం): ప్రకాశం జిల్లాలోని నాగులుప్పలపాడు మండలం చదలవాడలో ఐదేళ్ల బాలికపై అత్యాచారం, ఆపై హత్యకు గురైన విషయం తెలిసిందే. బాలిక ఘటనపై ఏపీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాలిక కుటుంబాన్ని సోమవారం శైలజ పరామర్శించారు. నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. చిన్నారి మృతికి కారణమైన ఘటనపై ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు జరపాలని అన్నారు. నిందితుడిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. బాలిక కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని రాయపాటి శైలజ మాటిచ్చారు.



## ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించండి : టీడీపీ నేతలు



కమలానగర్ (చైతన్యరథం): రాష్ట్రం, నగరం అభివృద్ధి చెందాలంటే కూటమి అభ్యర్థులను ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్సీ రమాదేవి ఓటర్లను కోరారు. అనంతపురంలోని 9వ డివిజన్లో అభ్యర్థి నాగరత్న, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, తెదేపా జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజుతో కలిసి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంక్షేమంతో ముందుకు సాగుతున్న రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే కూటమి బలపరిచిన అభ్యర్థులే అధికారంలో ఉండాలని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

## కళ్యాణదుర్గం పట్టణం ఊహించని విధంగా అభివృద్ధి

**●కూటమి అభ్యర్థులకు ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించండి : ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు**

కళ్యాణదుర్గం (చైతన్యరథం): గత వైసీపీ ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి చేయకుండా అవినీతి, అక్రమాలు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారని, రాష్ట్రంలో వైసీపీ నాయకులు అల్లర్లు సృష్టించడమే పనిగా పెట్టుకున్నారని వారి నాయకుడే మూర్ఖుడు కాబట్టి ఆయన అడుగుజాడల్లో వైసీపీ నాయకులు ప్రవర్తిస్తున్నారని ఏ నియోజకవర్గంలోనూ జరగని విధంగా ఎలాంటి గొడవలు, అల్లర్లు లేకుండా ప్రశాంత వాతావరణంలో అన్ని పార్టీల వాళ్ళు నామినేషన్ లు వేయగలిగారంటే అది కూటమి ప్రభుత్వ విజయమని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పేర్కొన్నారు. సోమవారం రామాయణ రచయిత మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ప్రజావేదికలో స్థానిక వాల్మీకి సోదరులు, మహిళా నాయకురాళ్ళతో కలిసి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు... వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ... మన ప్రాంతంలో తాగునీటి ఇబ్బందులకు ముఖ్యకారకులు గత వైసీపీ పాలకులని, ఉమ్మడి అనంత జిల్లాకు తాగునీటి కోసం నాడు భగవాన్ సత్యసాయి నీళ్లు అందిస్తే వాటిని నిర్వహించే వైసీపీ కాంట్రాక్టర్లు కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా బకాయిలు పెట్టడంతో కార్మికులు దీక్షలు చేసి నీటిని వదలకుండా ఉండటంతోనే నీళ్లు అందకుండా పోతున్నాయని ఇక ముందు అలాంటి ఇబ్బందులు రాకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పట్టణంలోని 13 వేల ఇళ్లకు కుళాయి ఇచ్చేందుకు 179 కోట్ల రూపాయలతో పనులు జరుగుతున్నాయని, అంతే కాకుండా బీటీపీతో పాటే నియోజకవర్గంలోని చెరువులకు కూడా 2028 మార్చి నాటికి కృష్ణా జలాలతో నింపుతామని, మొన్న చాపిరి చెరువుకు నీళ్లు ఇవ్వడంతో ప్రజల్లో కూడా నమ్మకం పెరిగిందని, ఎట్టి పరిస్థితిలో కూడా వైసీపీకి ఓటు వేయకుండా కూటమి అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.



## సమిష్టి కృషితో ఎన్నికల్లో విజయం : ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్



కదిరి (చైతన్యరథం): నల్లచెరువు మండల జెడ్పీటీసీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన అనంతరం, కదిరి పట్టణంలోని పీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో నల్లచెరువు మండలానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ క్యాడర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పరిటాల శ్రీరామ్, కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ హాజరయ్యారు. వారి సమక్షంలో నిర్వహించిన ఈ సమావేశంలో నల్లచెరువు మండలానికి చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల్లో సమన్వయంతో పనిచేస్తూ పార్టీ విజయానికి కృషి చేయాలనే లక్ష్యంతో సమావేశమయ్యారు. నాయకులు, కార్యకర్తల భారీ హాజరుతో సమావేశ ప్రాంగణంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. నాయకులు, కార్యకర్తల ఐక్యత, సమష్టి కృషితో ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని ఈ సమావేశం ద్వారా పిలుపునిచ్చారు.

జోన్-5
(నంద్యాల, కర్నూలు, హిందూపూరం, అనంతపురం, కడప)
చైతన్యరథం

# వాల్మీకి రామాయణమే ఆదర్శంగా కూటమి పాలన

●వాల్మీకి, బోయలకు ప్రాధాన్యమిస్తున్న కూటమి... పెనుకొండలో ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి

● నివాళులర్పించిన రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



పెనుకొండ/శ్రీసత్యసాయి : వాల్మీకి మహర్షి స్ఫూర్తితో రాష్ట్రంలో సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో రామరాజ్యం నడుస్తోందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. వాల్మీకీలు, బోయల రాజకీయ, సామాజిక, ఆర్థిక గుర్తింపు సీఎం చంద్రబాబునాయుడుతో సాధ్యమన్నారు. ప్రస్తుతం జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వాల్మీకి, బోయలకు అధిక ప్రాధాన్యమిచ్చామన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ టీడీపీ కార్యాలయంలో సోమవారం వాల్మీకి మహర్షి జయంతి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి మంత్రి సవిత పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వాల్మీకి మహర్షి రచించిన రామాయణం చారిత్రాత్మకమైనదని, ప్రపంచ ప్రఖ్యాత కాంచిందని తెలిపారు. భార్యా భర్తల బంధానికి, అన్నా దమ్ముల అనుబంధానికి, కుటుంబా బాంధవ్యాలకు రామాయణం ఎంతో స్ఫూర్తినిస్తోందన్నారు. రామాయణంలో వాల్మీకి మహర్షి పేర్కొన్నవిధంగా ప్రస్తుతం రాష్ట్రంలో సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో రామరాజ్యం నడుస్తోందన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని జోరుగుర్రాల్లా పరుగులు పెట్టిస్తున్నారన్నారు. బీసీల ఉన్నతికి కోసం ఆనాడు అన్న ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారన్నారు. ఆయన స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు అన్నింటా బీసీలకు అగ్రతాంబూలం వేస్తున్నారన్నారు. బీసీల్లో భాగమైన వాల్మీకీలు, బోయలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ గుర్తింపునిచ్చిన ఘనత టీడీపీదేనన్నారు. ఎందరో వాల్మీకి, బోయ నాయకులకు ఎంపీలుగా, ఎమ్మెల్యేలుగా, ఎమ్మెల్సీలుగా, మంత్రులుగా అవకాశమిచ్చిన ఘనత అన్న ఎన్టీఆర్ ది, సీఎం చంద్రబాబుదేనన్నారు. ప్రస్తుతం జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ వాల్మీకి, బోయ సామాజిక వర్గానికి అధిక ప్రాధాన్యమిచ్చామన్నారు. సోమందేపల్లి, గోరంట్ల ఎంపీపీ స్థానాలతో పాటు పలు ఎంపీటీసీ స్థానాలు, సర్పంచులుగా కేటాయించామన్నారు. పెనుకొండ నియోజక వర్గానికి చెందని వ్యక్తికి వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించామన్నారు. వాల్మీకి, బోయల అభివృద్ధికి కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమన్నారు. 2017లో వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తూ సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని టీడీపీ జీవో జారీ చేసిందని మంత్రి సవిత గుర్తు చేశారు. వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ ను కూడా ఏర్పాటు చేసిన ఘనత సీఎం చంద్రబాబునాయుడిదేనన్నారు. పెనుకొండలో వాల్మీకి మహర్షి కాంస్య విగ్రహం ఏర్పాటు చేయబోతున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికలు ముగియగానే, వాల్మీకి విగ్రహం ఆవిష్కరించనున్నామన్నారు. బోయలు, వాల్మీకీలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామన్నారు.

# ఎమ్మెల్యే కాలువ సమక్షంలో వైసీపీ మాజీ కౌన్సిలర్ జైపుత్ర పార్టీలోకి చేరిక



రాయదుర్గం (చైతన్యరథం): పట్టణంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ కౌన్సిలర్ జై పుత్ర తెలుగుదేశం పార్టీలో చేరారు. సోమవారం ఉదయం 8వ వార్డులో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు సమక్షంలో ఆయన టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. జై పుత్రతో పాటు మరో 40 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు వారందరికీ టీడీపీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీ అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, రాయదుర్గం నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల పట్ల ఆకర్షితులై పలువురు పార్టీలో చేరడం సంతోషకరమన్నారు.

# అభివృద్ధికి పట్టం కట్టండి... ప్రజల్ని కోరిన సినీ నటుడు సాయికుమార్

అనంతపురం అర్బన్ (చైతన్యరథం): రాబోయే స్థానిక ఎన్నికల్లో అభివృద్ధి చూసి ఓటు వేయాలని, కూటమి పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఏపీ బీజేపీ నాయకుడు, సినీ నటుడు సాయికుమార్ వ్యాఖ్యానించారు. సోమవారం అనంతరపురం అర్బర్ టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సాయికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, అనంతపురం మేయర్ అభ్యర్థి అజేష్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. కూటమి అభ్యర్థుల గెలుపుపై సమాలోచనలు చేసిన నటుడు సాయికుమార్ అనంతపురం జిల్లాతో తనకు ఎంతో అనుబంధం ఉందన్నారు. శ్రీ సత్య సాయి బాబా తాగునీటి పథకాన్ని ప్రకటించింది తానేనని, చిన్ననాటి నుంచి దేశభక్తి తనలో ఉందన్నారు. 2003లో బీజేపీలో చేరానని, అనంతపురం, ఏపీతోపాటు ఎన్నో జిల్లాల్లో ఎన్నో రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారాలు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం కేంద్రంతో పాటు రాష్ట్రంలో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని ప్రజలు కూటమి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా విస్తృత ప్రచారం

●పుట్టపర్తి మున్సిపాలిటీ వార్డుల్లో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి విస్తృత పర్యటన



పుట్టపర్తి (చైతన్యరథం): పుట్టపర్తి మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో గెలుపే లక్ష్యంగా పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మున్సిపాలిటీలోని 10, 11, 17, 18, 19, 20, 22, 23, 24, 25వ వార్డుల్లో పర్యటిస్తూ తమ వార్డులో ఉన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్క కూటమి అభ్యర్థి ఎన్నికల ప్రచారంలో పాల్గొని ఎన్నికల విజయానికి దోహద పడాలని తెలియజేశారు. కూటమి ప్రభుత్వ నాయకత్వంలో ప్రజలకు మరింత మెరుగైన మౌలిక సదుపాయాలు, అభివృద్ధి కార్యక్రమాలు అందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ పేదల సంక్షేమం కోసం పనిచేసే పార్టీ అని, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి కట్టుబడి ఉంటుందని ఆమె పేర్కొన్నారు. దౌర్జన్యాలకు తావులేని ప్రజా పాలన, సంక్షేమం, అభివృద్ధి లక్ష్యాలతో ముందుకు సాగాలని, చంద్రబాబునాయుడు ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ ప్రజాసేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రతి వార్డులో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల సమస్యలను తెలుసుకోవాలని, కూటమి ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు.

# రాప్తాడు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ జోరు

స్థానిక ఎన్నికల వ్యూహాలపై ఎమ్మెల్యే పరిటాల సునీత దిశానిర్దేశం

●నసనకోట, మాదాపురం, ఎం.సి.పల్లి ఎంపీటీసీల ఏకగ్రీవ ఎన్నికపై హర్షం

●అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే సునీత



రాప్తాడు (చైతన్యరథం): నియోజకవర్గంలో జెడ్పిటిసి, ఎంపీటీసీ ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యంగా పని చేయాలని పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశించారు. ఎంపీటీసీలుగా ఏకగ్రీవంగా ఎన్నికైన పలువురు నేతలు.. ఎమ్మెల్యే సునీతను కలిశారు. రామగిరి మండలానికి చెందిన నసనకోట ఎంపీటీసీ అభ్యర్థి కాశి భారతి, మాదాపురం ఎంపీటీసీ అభ్యర్థి గంగాదేవి, ఎం.సీ.పల్లి ఎంపీటీసీగా రాధాకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ విజయంతో రామగిరి మండలంలో టీడీపీ బలం ఏంటన్నది మరోసారి నిరూపితమైంది. ఏకగ్రీవంగా ఎన్నికైన అభ్యర్థులతో పాటు గ్రామ, మండల ముఖ్య నాయకులు వెంకటాపురంలోని నివాసంలో ఎమ్మెల్యే పరిటాల సునీతని మర్యాదపూర్వకంగా కలిశారు. అభ్యర్థులకు, నాయకులకు అభినందనలు తెలిపారు. అనంతరం కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో పరిటాల సునీత కీలక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు, మండల కన్వీనర్లు, జెడ్పిటిసి, ఎంపీటీసీ అభ్యర్థులు, కార్యకర్తలు పాల్గొన్నారు. జెడ్పిటిసి, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణ, అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ప్రతి కార్యకర్త సమిష్టిగా పనిచేసి, ప్రభుత్వ ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా ఎన్నికల్లో భారీ విజయాలు నమోదు చేయాలని ఆమె పిలుపునిచ్చారు. మనం చేసిన అభివృద్ధి ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. ఎక్కడా గొడవలకు తావు లేకుండా ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూసుకోవాలన్నారు. మరోవైపు రామగిరి మండలం ఎగువపల్లి గ్రామానికి చెందిన వైసీపీ ముఖ్య నాయకుడు చిగిచెర్ల రవి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎమ్మెల్యే సునీత ఆయనకు కండువా వేసి తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ విధానాలు నచ్చకపోవడం, ఎమ్మెల్యే సునీతతోనే అభివృద్ధి సాధ్యమన్న నమ్మకంతోనే పార్టీలో చేరినట్లు రవి తెలిపారు.

### మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు

ఆదికవి మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా ఎమ్మెల్యే సునీత తన నివాసంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రామాయణ మహాకావ్యం ద్వారా ధర్మం, సత్యం, మానవీయ విలువలతో కూడిన ఆదర్శ జీవితానికి మహర్షి వాల్మీకి మార్గదర్శనం చేశారని కొనియాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించి, పాలనలోనూ ధర్మబద్ధత, న్యాయం, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారని గుర్తుచేశారు. ఆ మహర్షి ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకుని, ఆయన చూపిన ధర్మమార్గంలో మనమంతా పయనించాలని ఎమ్మెల్యే సునీత పిలుపునిచ్చారు.

# చందకచర్లలో ఘనంగా కూటమి ఎన్నికల ప్రచారం



మడకశిర (చైతన్యరథం): మడకశిర మండలం చందకచర్ల గ్రామంలో ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి స్థానిక శ్రీ ఆంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కూటమి జడ్పీటీసీ అభ్యర్థి చంద్రప్ప విజయాన్ని కాంక్షిస్తూ ఇంటింటి ప్రచారం చేపట్టి, ప్రజల సంక్షేమం, గ్రామాభివృద్ధి కోసం కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, మండల కన్వీనర్ నాగరాజు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అభివృద్ధికి సహకరించండి.. కూటమి అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించండి



పెనుకొండ (చైతన్యరథం): పెనుకొండ మున్సిపాలిటీ అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని సీనియర్ నాయకులు వెంకటేశ్వర్రావు మెకానిక్‌లను కోరారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అభివృద్ధికి సహకరించండి.. కూటమి అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించండి కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండున్నరేళ్ల కాలంలో పెనుకొండ మున్సిపాలిటీలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఈ సందర్భంగా ఆయన వివరించారు. అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలతో రూపొందించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు మెకానిక్‌లు, తదితరులు పాల్గొన్నారు.



## నరసరావుపేట యువకుడికి అమెరికాలో గౌరవం

**'మిస్టర్ ఇంటర్నేషనల్-సీ ఆఫ్ ఆరెంజ్ పరేడ్' బిరుదు అందుకున్న కిరణ్ కాంత్**

**నరసరావుపేట (చైతన్యరథం):** పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణానికి చెందిన ఓగూరి కిరణ్ కాంత్ అంతర్జాతీయ గుర్తింపు సాధించి మాతృభూమికి గర్వకారణంగా నిలిచాడు. అమెరికాలోని ఓక్లహోమా స్టేట్ యూనివర్సిటీ అత్యంత వైభవంగా నిర్వహించిన 'సీ ఆఫ్ ఆరెంజ్ పరేడ్'లో ఇతడు భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించి ప్రతిష్టాత్మక 'మిస్టర్ ఇంటర్నేషనల్-సీ ఆఫ్ ఆరెంజ్ పరేడ్' బిరుదు అందుకున్నాడు. స్థానిక వాగ్దేవి జూనియర్ కళాశాలలో విద్యనభ్యసించి ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన కిరణ్ కాంత్ అంతర్జాతీయ వేదికపై తన ప్రతిభతో అరుదైన గౌరవాన్ని దక్కించుకోవడంపై నరసరావుపేటతో పాటు ఉమ్మడి గుంటూరు, పల్నాడు జిల్లాల ప్రజలు తీవ్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

# బాల పారిశ్రామికవేత్త... సమైరా మెహతా

**వయసు కేవలం అంకె మాత్రమేనని... గొప్ప ఆలోచనలకు, సంకల్పానికి ఎలాంటి హద్దులు ఉండవని నిరూపించింది భారతీయ మూలాలున్న అమెరికన్ బాలిక సమైరా మెహతా. కేవలం 11ఏళ్ల ప్రాయంలోనే సొంతంగా కంపెనీని స్థాపించి ప్రపంచవ్యాప్తంగా ఉన్న టెక్ నిపుణులను తనవైపు తిప్పుకునేలా చేసింది.**



**11 ఏళ్లకే సీఈవోగా సంచలనం**

**కోడింగ్ గేమ్‌తో ప్రపంచాన్ని ఆకట్టుకుంటున్న బాలిక**

**పాఠశాల విద్యనభ్యసిస్తూనే 'కోడర్ బన్నీజ్' సంస్థ స్థాపన**

**చిన్నారులకు ఆటపాటలతోనే కోడింగ్ మెళకువలు**

**గూగుల్, మైక్రోసాఫ్ట్ ప్రశంసలు అందుకున్న వైనం**




**యూఎస్ఏ:** చదువుకునే వయసులోనే అద్భుతమైన ఆలోచనతో సరికొత్త చరిత్ర సృష్టించింది సమైరా మెహతా. చిరు ప్రాయంలోనే 'కోడర్ బన్నీజ్' అనే ప్రముఖ సంస్థకు సీఈవోగా బాధ్యతలు నిర్వర్తిస్తూ ప్రపంచవ్యాప్తంగా వందలాది మందికి ఆదర్శంగా నిలిచింది. చిన్నప్పటి నుంచే కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌పై ఉన్న ఆసక్తితో కోడింగ్ అనే సంక్లిష్టమైన అంశాన్ని పిల్లలకు తేలికగా ఎలా నేర్పించాలో ఆలోచించింది సమైరా. ఈ ఆలోచన నుంచే జన్మించిన CoderBunnyz బోర్డ్ గేమ్ ద్వారా పిల్లలు ఆటలాడుకుంటూనే కోడింగ్, ప్రోగ్రామింగ్ ప్రాథమిక పాఠాలను సులువుగా నేర్చుకునేలా డిజైన్ చేసింది. ఒకవైపు బడి చదువులు కొనసాగిస్తూనే మరోవైపు స్వయంగా కంపెనీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తూ వ్యాపార రంగంలో ప్రత్యేక ముద్ర వేసింది. ఈ చిన్నారి సాధించిన అసాధారణ విజయానికి గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి టెక్ దిగ్గజాలు సైతం ముగ్ధులై ప్రత్యేకంగా అభినందించడం విశేషం.

వయసుతో నిమిత్తం లేకుండా గొప్ప ఆలోచన, కఠిన శ్రమ ఉంటే ఎంతటి ఘనత సాధించవచ్చో నిరూపించిన సమైరా మెహతా నేటి యువతకు, విద్యార్థులకు ఎంతో స్ఫూర్తిదాయకం.

# కంపాలాలో శ్రీవారి వైభవం

**పవిత్ర తిలకం ఆకారం, సామూహిక గోవింద నామస్మరణతో సరికొత్త చరిత్ర**

**మూడు గిన్నిస్ రికార్డులు సొంతం చేసుకున్న తిరుమల తిరుపతి దేవస్థానం**



**కంపాలా (ఉగాండా):** భారతీయ సనాతన ధర్మం, భక్తి సాంప్రదాయాలు, శ్రీ వేంకటేశ్వరస్వామి వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పే లక్ష్యంతో ఉగాండాలోని కంపాలా నగరంలో టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమం అరుదైన ఘనత సాధించింది. కంపాలాలోని లుగోగో ఎంటీఎన్ ఒమోండి స్టేడియం వేదికగా జరిగిన వేడుక ఏకంగా మూడు గిన్నిస్ వరల్డ్ రికార్డులను సొంతం చేసుకుంది. అధిక సంఖ్యలో శ్రీవారి భక్తులు విచ్చేసి పవిత్ర తిలక ఆకారాన్ని రూపొందించడం, సామూహికంగా గోవింద మంత్రాన్ని జపించడం, స్వామి వారి వేషధారణలో ఒకేచోట సమావేశమై ఆయన రూపాన్ని ప్రదర్శించడం ద్వారా ఈ మూడు రికార్డులు నమోదయ్యాయని నిర్వాహకులు తెలిపారు. విదేశీ గడ్డపై భారతీయ ఆధ్యాత్మిక వారసత్వాన్ని సగర్వంగా ప్రతిష్ఠించిన ఈ ఘనత ఉగాండాలోని భారతీయ సమాజానికి, తెలుగు ప్రజలకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న స్వామి భక్తులందరికీ అత్యంత గర్వకారణమని నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు.



# జానపద కవి సార్వభౌముడు 'కొసరాజు'

## ఫ్రిస్కోలో రాఘవయ్య చౌదరి రచనల ఆవిష్కరణ

**ఫ్రిస్కో:** 'కవిరత్న', 'జానపద కవి సార్వభౌమ' కొసరాజు రాఘవయ్య చౌదరి రచనల ఆవిష్కరణ ఫ్రిస్కోలో వైభవంగా జరిగింది. తానా ప్రపంచ సాహిత్య వేదిక, కళావాహిని, టాంటెక్స్ సంస్థలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. కొసరాజు కవితా వైభవం పేరిట సిద్ధాంత వ్యాసాన్ని రచించి నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టాతో పాటు బంగారు పతకం అందుకున్న ప్రముఖ రచయిత డాక్టర్ నల్లూరి రామారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి పరిమళాలను గట్టిగా పట్టుకున్న కొసరాజు జానపదాలకు సరికొత్త సువాసనలు అద్దారని కొనియాడారు. ఆయన రచనలను ఉటంకించారు. శ్రీనాథ పద నిఘంటువు, తిక్కన పదకోశం మాదిరిగా కొసరాజు పద నిఘంటువు రూపొందించాల్సిన ఆవశ్యకతను గుర్తు చేశారు. పల్లె జీవన శైలిని అతి సమీపంగా గమనించిన ఆయన వాటినే తన పాటలకు పునాదులుగా చేసుకున్నారని తెలిపారు. కొసరాజు రచించిన 'గండికోట యుద్ధం' ఆయనలోని మరో కోణాన్ని స్పృశిస్తుందని వెల్లడించారు. మద్దుకూరి చంద్రహాస్ మాట్లాడుతూ వ్యంగ్యానికి, హాస్యానికి చిరునామాగానే గాక దూరదృష్టితో వాస్తవికతను ప్రతిబింబించే రచనలు చేసిన ప్రతిభాశాలి కొసరాజు అన్నారు. టోపీ, లారీ, సిగరెట్, ఇల్లరికం, పేకాట, పకోడి... ఇలా వస్తువు ఏదైనా సహజ సిద్ధమైన పదజాలంతో రాఘవయ్య మంచి పాటలు రాశారని వెల్లడించారు. డాక్టర్ తోటకూర ప్రసాద్ మాట్లాడుతూ రాఘవయ్య చౌదరి జానపద కవితా రసరాజుగా చిరస్మరణీయులని పేర్కొన్నారు. రైతు అన్నదాత, కవి జ్ఞానదాత... ఇవి రెండూ కలిసిన కొసరాజు సాహితీ చైతన్య ప్రదాత అన్నారు. నాలుగో తరగతి వరకు మాత్రమే చదువుకున్న రాఘవయ్య పరిశ్రమతో, పల్లెకారుల జీవనాన్ని సమీపంగా చూసిన అనుభవాలతో ఆలోచింపజేసే పాటలకు ప్రాణం పోశారని వెల్లడించారు. కొసరాజు సాహిత్యాన్ని రూపొందించే క్రమంలో తనకు సహకరించిన వారికి ధన్యవాదాలు తెలిపారు. అనంత్ మల్లవరపు సమన్వయపరిచిన ఈ కార్యక్రమంలో స్థానిక గాయనీ, గాయకులు కొసరాజు రచించిన గేయాలను ఆలపించారు.



# ఛార్లెట్‌లో మెగా ఆరోగ్య శిబిరం




**ఛార్లెట్:** తెలుగు అసోసియేషన్ ఆఫ్ గ్రేటర్ ఛార్లెట్ (TAGCA) ఏరియా సంఘం ఆధ్వర్యంలో అమెరికాలో ప్రవాసాంధ్రుల కోసం ఉచిత మెగా ఆరోగ్య శిబిరం నిర్వహించారు. టీఏజీసీఏ, శ్రీసాయి గురుదేవ్ దత్త మందిర్ సహకారంతో Early detection, better protection, your health our commitment నినాదంతో హెల్త్ ఫెయిర్ జరిపారు. తొలి విడత శిబిరం పైన్‌విల్లె డెంటల్ స్టూడియో, 10635 పార్క్ రోడ్ సూట్-బి, ఛార్లెట్, NC 28210 వేదికగా జరిగింది. ఎలాంటి అపాయింట్‌మెంట్/రిజిస్ట్రేషన్ లేకుండానే ప్రజలు ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు కూడా నిర్వహించారు. రుమటాలజీ నిపుణులు డాక్టర్ శ్రీలత చలసాని ఆధ్వర్యంలో వైద్య బృందం విశేష సేవలందించింది. హాజరైన ప్రతి ఒక్కరికీ ఉచితంగా మందులు అందజేశారు. వైద్య పరీక్షల కోసం వచ్చిన వారికి మధ్యాహ్నం రుచికరమైన భోజనాన్ని కూడా నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

రెండో విడత ఆరోగ్య శిబిరం ఈ నెల 31వ తేదీన శ్రీసాయి గురుదేవ దత్త మందిర్ 10345 KERNSRD, HUNTERSVILLE, NC 28078 చిరునామాలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరగనుంది. నిపుణులైన వైద్యులతో పాటు దంత వైద్యులను ఉచితంగా సంప్రదించవచ్చు. దీనికి ఎలాంటి ఇన్సూరెన్స్ అవసరం లేదని నిర్వాహకులు ప్రకటించారు. శిబిరంలో పాల్గొనాలంటే ముందస్తుగా కన్సల్టేషన్, అపాయింట్‌మెంట్ తీసుకోవాల్సి వుంటుంది. www.tagca.org/healthfair వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకోవాలి. మరిన్ని వివరాల కోసం సురేంద్ర యలవర్తిని +17048064131 నెంబరులో సంప్రదించవచ్చు.

**సేవలు అందించే వైద్య నిపుణులు:** డాక్టర్ శ్రీలత చలసాని (రుమటాలజీ), డాక్టర్ నిశ్చల్ నాథా (ఆర్థోడాంటిస్ట్), డాక్టర్ శ్రీనివాస్ కోయ (ఇంటర్నల్ మెడిసిన్), డాక్టర్ శోభ జయరామ్ (న్యూరాలజీ), డాక్టర్ కృష్ణ జొన్నలగడ్డ (ఇంటర్నల్ మెడిసిన్, గెరియాట్రిక్స్)



# ఖర్గే వ్యాఖ్యలతో భగ్గుమన్న బీజేపీ శ్రేణులు!

## దేశవ్యాప్తంగా ఏఐసీసీ చీఫ్ మల్లిఖార్జున దిష్టిబొమ్మల దగ్ధం



ప్రధాని మోదీపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో బీజేపీ శ్రేణులు దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టాయి. ఖర్గే తన అధ్యక్ష పదవికి రాజీనామా చేయాలంటూ కమలనాథులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఆదివారం బీహార్‌లోని పట్నాలో ఓ కార్యక్రమానికి హాజరైన మల్లికార్జున ఖర్గే.. 'మోదీ కాదు.. ఆయన బాబైనా పోవాల్సిందే' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. దీంతో కాషాయ పార్టీ నాయకులు కాంగ్రెస్ అధ్యక్షుడిపై భగ్గుమన్నారు. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా ఉన్న బీజేపీ ప్రధాన కార్యాలయాల్లో ఆ పార్టీ నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఖర్గే దిష్టిబొమ్మలను దహనం చేశారు. అలాగే ఆయన పోస్టర్లకు నిప్పంటించి, వ్యతిరేక నినాదాలు చేశారు. బీహార్‌లో కమలనాథులు ఆందోళనలు నిర్వహించి, కాంగ్రెస్ అధ్యక్షుడు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీకి ఖర్గే బహిరంగ క్షమాపణ చెప్పాలని పట్టుబట్టారు. ఈ వివాదంపై బీజేపీ అగ్ర నాయకులూ స్పందించారు. ఖర్గేను కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్రంగా విమర్శించారు. 'ఇది చాలా బాధాకరం. ఈ మొత్తం వ్యవహారంలో అత్యంత దిగ్భ్రాంతికరమైన విషయం ఏంటంటే.. ఈ వ్యాఖ్యలను కాంగ్రెస్‌లో చిన్న స్థాయి వ్యక్తి చేయలేదు. ఏకంగా ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు చేశారు' అని ఆవేదన వ్యక్తం చేశారు.



# ఫర్జీ వెబ్‌సిరీస్ ఫక్కీలో నకిలీ నోట్ల ముద్రణ

## ఆపరేషన్ నాట్‌ఫ్లిక్స్‌తో ఆరుగురిని అరెస్టు చేసిన రాజస్థాన్ పోలీసులు

ఫర్జీ అనే వెబ్‌సిరీస్ స్ఫూర్తితో ఓ ముఠా నకిలీ నోట్ల ముద్రణకు దిగింది. ఐదు రాష్ట్రాలకు విస్తరించింది. ఈ ముఠా గుట్టురట్టు చేసేందుకు ఆపరేషన్ నాట్‌ఫ్లిక్స్‌ను ప్రారంభించిన రాజస్థాన్ పోలీసులు తాజాగా ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. యూపీకి చెందిన రవికుమార్, ముహమ్మద్ ఆరిఫ్, హర్యానాకు చెందిన ఆనంద్ రాజ్‌పుత్, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన తరుణ్ మలేకర్, రాజస్థాన్‌కు చెందిన భవేశ్ ఖతిక్, నయన్ జ్యోషిలను అదుపులోకి తీసుకున్నారు. గత నెల 29వ తేదీన భవేశ్ ఖతిక్, నయన్ జ్యోషిలను దుంగర్‌పూర్ (రాజస్థాన్) పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 4.95 లక్షల నకిలీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో గ్యాంగ్ కార్యకలాపాల విస్తృతిపై పోలీసుల దృష్టిపడింది. పట్టుబడ్డ ఇద్దరు నిందితులను విచారించడంతో మిగతా వారి గుట్టుమట్లు తెలిశాయి. ఈ కేసులో ప్రధాన నిందితుడు రవి కుమార్ అని దుంగర్‌పూర్ డీఎస్పీ తెలిపారు. పోలీసులకు చిక్కకుండా అతడు తన సిమ్‌లను తరచూ మార్చేవాడని తెలిపారు. చివరకు అతడిని పంజాబ్‌లోని ఓ రైల్వే స్టేషన్ వద్ద పోలీసులు అరెస్టు చేశారు. మరోనిందితుడైన రాజ్‌పుత్‌కు వెబ్‌సిరీస్ స్ఫూర్తితో దొంగనోట్ల ముద్రణ ఐడియా వచ్చిందని చెప్పారు. ఇందుకు సంబంధించి యూట్యూబ్ వీడియో లింకులు కూడా లభించాయి. నిందితులు ఓ టెలిగ్రామ్ ఛానల్ ద్వారా నోట్ల ముద్రణకు కావాల్సిన పేపర్‌ను సమకూర్చుకున్నారు. వీళ్లకు పేపర్ సప్లై చేసిన ఆరిఫ్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఫేక్ కరెన్సీ ముద్రణకు కావాల్సిన డిజిటల్ ఫైల్‌ను సరఫరా చేసిన తరుణ్ మలేకర్ కూడా పోలీసులకు చిక్కాడు. అసలు వీళ్లకు డిజిటల్ ఫైల్, పేపర్లు ఎలా లభించాయనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ముఠా నెట్‌వర్క్ ఏ స్థాయిలో ఉందో తెలుసుకునేందుకు విస్తృత దర్యాప్తును ప్రారంభించారు.

# సైబర్ టెర్రరిస్టులతో బ్యాంకింగ్ వ్యవస్థకు ముప్పు

## భారత ప్రధాని నరేంద్ర మోదీ హెచ్చరిక



నేటి కాలంలో ఆయుధాలతో సంప్రదాయ యుద్ధాలు మాత్రమే జరగవని, ఆర్థిక వ్యవస్థలపైనా యుద్ధాలు జరుగుతాయని ప్రధాని నరేంద్ర మోదీ హెచ్చరించారు. అందువల్ల దేశ బ్యాంకింగ్ వ్యవస్థను సైబర్ టెర్రరిస్టుల బారి నుంచి కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. భువనేశ్వర్‌లో రూ. 169 కోట్లతో ఏర్పాటు చేసిన ఆర్బీఐ డేటా సెంటర్, సైబర్ సెక్యూరిటీ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్‌లను ప్రధాని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆర్థిక వ్యవస్థలపై దాడులతోనూ ఒక దేశాన్ని బలహీనపరచవచ్చని చెప్పారు. మన దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతున్న ఈ తరుణంలో మన బ్యాంకింగ్ వ్యవస్థను సైబర్ క్రిమినల్స్, సైబర్ టెర్రరిస్టుల దాడుల నుంచి కాపాడుకోవడం ఎంతో ముఖ్యమని తెలిపారు. కాలం చెల్లిన విధానాలు, శిక్షణ, టూల్స్‌తో వీటిని ఎదుర్కోలేమని వివరించారు. అందుకు ఆధునిక వ్యవస్థలు, నైపుణ్యం గల మానవ వనరులు తప్పనిసరి అని పేర్కొన్నారు.

# టైగర్ ష్రాఫ్‌పై దాడి కేసులో కీలక మలుపులు



టైగర్ ష్రాఫ్‌పై దాడి కేసులో తాజాగా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ కేసులో పోలీసులు అరెస్టు చేసిన 11వ నిందితుడు ప్రాంజల్ ఠాక్రాల్ మార్చ్ నెలలోనే మరో కేసులో బెయిల్‌పై విడుదలయ్యాడు. బయటకు వచ్చిన వెంటనే టైగర్ ష్రాఫ్‌ను టార్గెట్ చేసుకున్నట్టు పోలీసుల దర్యాప్తులో తేలిసింది. టైగర్ ష్రాఫ్‌పై దాడి కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న అనిల్ పండిట్ యూఎస్ నుంచే బిష్ణోయ్ గ్యాంగ్ తరఫున తన కార్యకలాపాలు సాగిస్తున్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. నటుడిపై దాడికి కుట్ర పన్నింది అనిల్ పండిట్ కాగా ప్లాన్‌కు కార్యరూపం ఇచ్చే బాధ్యతను ప్రాంజల్ ఠాక్రాల్ తీసుకున్నాడు. షూటర్లకు నిధులు సమకూర్చడం, ఇతరత్రా సహాయాలు చేసింది ఠాక్రాల్ అని దర్యాప్తులో వెలుగులోకి వచ్చింది. ఈ దాడిలో పాల్గొన్న షూటర్‌కు ఠాక్రాల్ రెండో పిస్టల్ సమకూర్చాడు. 22 ఏళ్ల ఠాక్రాల్ ఇంజినీరింగ్ డిప్లొమా పూర్తి చేశాడు. పానిపట్‌లోని ఓ వ్యాపారిపై దాడి కేసులో జైలుపాలైన ఠాక్రాల్ ఈ మార్చ్‌లో బెయిల్‌పై విడుదలయ్యాడు. ఆ తరువాత అనిల్ పండిట్‌తో కలిసి కుట్రకు తెరితీశాడు. పానిపట్ వ్యాపారిపై దాడి వెనుక కూడా పండిట్ ఉన్నట్టు అప్పట్లో వెలుగులోకి వచ్చింది. ఇక తాజా కేసులో పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు పండిట్, ఠాక్రాల్ ఓ సీక్రెట్ యాప్ ద్వారా చర్చించుకునే వారని కూడా పోలీసులు గుర్తించారు. శుక్రవారమే పోలీసులు ఠాక్రాల్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం కోర్టు అతడికి అక్టోబర్ 31 వరకూ పోలీసు కస్టడీ విధించింది. అక్టోబర్ 18న ముంబైలోని జుహూ ప్రాంతంలో నిందితులు టైగర్ ష్రాఫ్ కారుపై కాల్పులు జరిపిన విషయం తెలిసిందే. నేపాల్‌కు పారిపోయే ప్రయత్నంలో ఉన్న ముగ్గురు షూటర్లను పోలీసులు రాజస్థాన్‌లో అదుపులోకి తీసుకున్నారు. ఆ తరువాత మరికొందరిని అరెస్టు చేశారు.



# తమిళనాడు మాజీ మంత్రి, డీఎంకే సీనియర్ నేత అన్బిల్ అరెస్టు

## ప్రైవేట్ పాఠశాలల అనుమతులు, గుర్తింపులో రూ. 100 కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఆరోపణలు

తమిళనాడు రాజకీయాల్లో పెను సంచలనం చోటుచేసుకుంది. డీఎంకే సీనియర్ నేత, మాజీ విద్యా శాఖ మంత్రి అన్బిల్ మహేశ్ పొయ్యమొళిని చెన్నైసెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ అధికారులు అరెస్టు చేశారు. ప్రైవేట్ పాఠశాలల అనుమతులు, గుర్తింపు విషయంలో రూ. 100 కోట్ల అవినీతికి పాల్పడ్డాడని ఆయనను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. డీఎంకే ప్రభుత్వ హయాంలో ప్రైవేట్ విద్యా సంస్థలకు శాశ్వత గుర్తింపు, అప్‌గ్రేడేషన్, భవన నిర్మాణ అనుమతులు, నో-అబ్జెక్షన్ సర్టిఫికెట్లు ఇప్పిస్తామంటూ కొందరు వ్యక్తులు భారీగా వసూళ్లకు పాల్పడ్డారన్న ఆరోపణలపై ఈ దర్యాప్తు ప్రారంభమైంది. తమిళనాడు ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బీటీ అరసుమ కుమార్ తదితరులు ఈ వసూళ్లకు పాల్పడినట్లు ప్రైవేట్ పాఠశాలల సమాఖ్య కార్యదర్శి ఇళంగోవన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ దర్యాప్తులో భాగంగా డిజిటల్ పరికరాల ద్వారా సేకరించిన ఆధారాలు, పలువురి వాంగ్మూలాల ఆధారంగా డీఎంకే ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రిగా పని చేసిన అన్బిల్ మహేశ్ ప్రమేయం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో ఆయనపై అవినీతి నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేశారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం మహేశ్ దాఖలు చేసిన పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు సోమవారం కొట్టేసింది. హైకోర్టు బెయిల్ నిరాకరించిన గంటల వ్యవధిలోనే సీసీబీ ప్రత్యేక బృందాలు ఆయనను అరెస్టు చేశాయి. అయితే, తనపై వస్తున్న ఆరోపణలను మాజీ మంత్రి ఖండించగా రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే టీవీకే పార్టీ అధికారిక యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తుందని డీఎంకే మండిపడింది. ఈ మొత్తం కుంభకోణంలో ప్రస్తావనకు వచ్చిన 177 పాఠశాలలపై పోలీసులు మరింత లోతుగా విచారణ జరుపుతున్నారు.

# భారత్ ఆచరణాత్మక సిద్ధాంతం.. వసుధైక కుటుంబం!

## కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ వెల్లడి



ఐక్యరాజ్యసమితి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఢిల్లీలోని భారత్ మంటపంలో నిర్వహించిన చిన్మయ అమృత్ మహోత్సవ్ గ్లోబల్ సమ్మేళనంలో కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ప్రసంగించారు. ప్రపంచ దేశాలకు టీకాల పంపిణీ, అభివృద్ధి భాగస్వామ్యాలు, మానవతా సాయం ద్వారా భారత్ తన 'వసుధైక కుటుంబం' (ప్రపంచమంతా ఒకే కుటుంబం) సిద్ధాంతాన్ని కేవలం ప్రచారం చేయడమే కాకుండా ఆచరణలో చూపిస్తోందని ఆయన స్పష్టం చేశారు. కోవిడ్ సమయంలో సాయం: దేశంలో వ్యాక్సినేషన్ ప్రక్రియ వేగంగా జరుగుతున్న సమయంలోనే, ఇతర వెనుకబడిన దేశాలకు కూడా టీకాలను అందించి భారత్ పెద్దమనసు చాటుకుందని గుర్తుచేశారు. అభివృద్ధి భాగస్వామ్యం: భారత్ నేడు 78 దేశాలలో వందలాది అభివృద్ధి ప్రాజెక్టులను నిర్వహిస్తోందని, శిక్షణ, సామర్థ్య నిర్మాణ సంస్థలలో ప్రపంచానికి చోటు కల్పిస్తోందని తెలిపారు. తక్షణ స్పందన: నేపాల్, శ్రీలంక, వెనిజులా లేదా జమైకా వంటి దేశాల్లో విపత్తులు ఎదురైనప్పుడు భారత్ మొదటిగా స్పందించి ఆదుకుందని తెలిపారు. ఉక్రెయిన్, పశ్చిమాసియా ప్రాంతాల్లో జరుగుతున్న రెండు ప్రధాన యుద్ధాల ప్రభావం నేరుగా సంబంధం లేని ప్రపంచ దేశాలు, ఆర్థిక వ్యవస్థలపై తీవ్రంగా పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. 'మనం మూగప్రేక్షకులుగా మిగిలిపోలేము.. చర్చలు, దౌత్య మార్గాలే ఏకైక పరిష్కారమని భారత్ స్పష్టం చేస్తోంది' అని ఆయన అన్నారు. ఐక్యరాజ్యసమితిలో సంస్కరణల ఆవశ్యకత: ఐక్యరాజ్యసమితి బలహీనతలను, పరిమితులను గుర్తించి మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని జైశంకర్ పిలుపునిచ్చారు. ప్రపంచ నిర్ణయాధికారాల్లో పెద్ద భాగమైన దేశాలను పక్కనబెట్టలేరని, ఐక్యరాజ్యసమితి సంక్షోభాల వేళ నాయకత్వాన్ని వహించాలి తప్ప ప్రేక్షక పాత్ర వహించకూడదని వ్యాఖ్యానించారు.





# బ్రెజిల్ అధ్యక్ష పీఠంపై మళ్లీ లూలా డా సిల్వా

## 51.76 శాతం ఓట్లతో అప్రతిహతంగా నాలుగోసారి ఎన్నిక

రియో డి జెనీరో (బ్రెజిల్)లో జరిగిన రెండవ విడత అధ్యక్ష ఎన్నికల రసవత్తర పోరులో, 80 ఏళ్ల వర్కర్స్ పార్టీ నాయకుడు, ప్రస్తుత అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డా సిల్వా ఘన విజయం సాధించి 4వ సారి బ్రెజిల్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 99.77 శాతం ఓట్ల లెక్కింపు పూర్తయ్యే సమయానికి లూలా డా సిల్వా 51.76 శాతం చెల్లుబాటు అయ్యే ఓట్లు సాధించగా, ఆయన ప్రత్యర్థి ఫ్లావియో బొల్సోనారో 48.24 శాతం ఓట్లు సాధించారు. గెటులియో వర్గాస్ తర్వాత బ్రెజిల్ చరిత్రలో అత్యధిక కాలం అధ్యక్షుడిగా పనిచేసిన రెండో వ్యక్తిగా లూలా రికార్డు సృష్టించారు. ఈ విడత పూర్తయ్యేసరికి ఆయన మొత్తం 16 ఏళ్ల పాటు అధికారంలో ఉన్నట్లవుతుంది. 1989లో బ్రెజిల్‌లో ప్రత్యక్ష అధ్యక్ష ఎన్నికలు ప్రారంభమైనప్పటి నుంచి, మొదటి విడత ఎన్నికల్లో రెండో స్థానంలో నిలిచి, ఆ తర్వాత రన్ ఆఫ్ (రెండో విడత)లో గెలిచిన మొదటి అభ్యర్థిగా లూలా నిలిచారు. ద్రవ్యోల్బణం, నేరాలు, అవినీతి వంటి అంశాలు ఈ ఎన్నికల ప్రచారంలో ప్రధాన పాత్ర పోషించాయి. 2003 నుంచి 2010 వరకు బ్రెజిల్‌ను పాలించిన లూలా, గతంలో అవినీతి ఆరోపణలపై ఒక ఏడాదికి పైగా జైలు శిక్ష అనుభవించారు. 1970లలో కార్మిక సంఘం నాయకుడిగా ప్రస్థానం ప్రారంభించిన లూలా, 'వర్కర్స్ పార్టీ' స్థాపనలో కీలక పాత్ర పోషించారు. 2002లో మొదటిసారి అధ్యక్షుడిగా ఎన్నికైన ఆయన, 2006లో రెండోసారి గెలిచారు. లూలా విజయంతో దక్షిణాసియా, గ్లోబల్ సౌత్, చైనాతో బ్రెజిల్ దౌత్య సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయి. బ్రెజిల్ సార్వభౌమత్వాన్ని కాపాడుకుంటూ స్వతంత్ర విదేశాంగ విధానాన్ని కొనసాగిస్తామని లూలా స్పష్టం చేశారు.

# అమెరికా మళ్లీ దాడి చేసినా మా విధానాలు మారవు!

## ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ స్పష్టీకరణ





హార్మూజ్ జలసంధి విషయంలో తమ దేశ విధానాలు మారబోవని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ స్పష్టం చేశారు. ఇరాన్‌పై తాము మళ్లీ దాడులతో విరుచుకుపడతామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంకేతాలిచ్చిన కొన్ని గంటలకే అబ్బాస్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయన ఓ మీడియా సంస్థతో మాట్లాడుతూ అమెరికా, ఇజ్రాయెల్ తమపై మరో దాడి చేసినా, హార్మూజ్ అంశంలో తాము వెనక్కి తగ్గబోమని తేల్చిచెప్పారు. ఆ జలసంధి యుద్ధం రాకముందు నాటి స్థితిలోకి తిరిగి వెళ్లదని తెలిపారు.

యుద్ధం జరిగినా, జరగకున్నా తమ విధానాల్లో మాత్రం మార్పు ఉండదని పునరుద్ఘాటించారు. అమెరికాకు కొంచెం హేతుబద్ధత ఉన్నా కూడా తమపై ఎలాంటి దాడులూ చేయదని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ అన్నారు. అలాగే పశ్చిమాసియా యుద్ధాన్ని ఆయన రమదాన్ (రంజాన్) వార్‌గా పేర్కొన్నారు. అన్ని రంగాల్లో ఈ రమదాన్ యుద్ధం ముగిసిపోవాలని కోరుకున్నారు.

## మళ్లీ నోరు జారిన ట్రంప్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి నోరు జారారు. ప్రముఖ ర్యాపర్ నిక్కీ మినాజ్ వస్త్రధారణ, శరీరాకృతిపై ఆయన అసభ్యకరంగా వ్యాఖ్యలు చేశారు. రిపబ్లికన్ సెనేట్ అభ్యర్థి మైక్ రోజర్స్‌తో పాటు మరికొందరు అభ్యర్థుల కోసం మిచిగన్‌లోని పోర్ట్ హ్యురాన్‌లో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయనతో పాటు ర్యాపర్ నిక్కీ మినాజ్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ నిక్కీ శరీరాకృతి గురించి జోకులు వేశారు. ఆమె అందాన్ని మిస్ అవడం కష్టమని పేర్కొన్నారు. అదే సమయంలో నిలబడాలని ఆమెను కోరారు. తన వ్యాఖ్యలతో నిక్కీ అవమానపడినట్లుగానీ, బాధపడినట్లుగానీ తాను అనుకోవడం లేదన్నారు. రిపబ్లికన్ పార్టీకి ఆమె మద్దతు ఇస్తున్నదన్నారు. 'నిక్కీ మినాజ్‌ను మనం ప్రేమిస్తాం. ఆమె చాలా కాలంగా మనతో (రిపబ్లికన్ పార్టీ) ఉన్నారు' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. గతంలోనూ పలువురు రిపబ్లికన్ నేతలపైనా ఆయన అలాగే వ్యాఖ్యలు చేసి తీవ్రంగా విమర్శలు ఎదుర్కొన్నారు. ఇటీవలే కెంటకీలో జరిగిన ప్రచార కార్యక్రమంలో ఓహియో సెనేటర్ జాన్ హుస్టెడ్‌పైనా అభ్యంతరకరంగా వ్యాఖ్యలు చేశారు. 'జాన్ వెనుకభాగాన్ని నేను గమనించాను. అలాగే ఆయన భుజాలు, పాదాలు, చేతులు చూశాను. ఆయన జాలైన్ (దవడ ఆకృతి) కూడా గమనించాను. ఆయనను అధ్యయనం చేశా' అని అన్నారు. అలాగే కెంటకీ నాలుగో కాంగ్రెషనల్ జిల్లా రిపబ్లికన్ నామినీ, నేవీ సీల్ మాజీ అధికారి గాల్రీన్‌ను అందమైన వ్యక్తి అని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆయనపై పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి.



# ఏఐ రంగంలో చిన్న కంపెనీలకు పెద్ద కష్టాలు

## టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్ హెచ్చరిక

ఏఐ రంగంలో చోటుచేసుకుంటున్న మార్పులతో కంప్యూటర్ చిప్‌లకు డిమాండ్ భారీగా పెరిగింది. దీంతో ఏఐ సేవల కోసం డేటా సెంటర్లను ఏర్పాటు చేసేందుకు కంపెనీలు పోటీపడుతున్నాయి. అయితే, ఈ రంగంలో పెట్టుబడులు పెట్టిన చిన్నచిన్న కంపెనీలకు త్వరలో కష్టకాలం వస్తుందని టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్ హెచ్చరించారు. వందల ఏఐ క్లౌడ్ స్టార్టప్‌లు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆయన తన సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో పేర్కొన్నారు. ఏఐ డేటా సెంటర్లపై మాత్రమే ఆధారపడి ఆదాయం పొందే సంస్థలకు రుణాలు ఇచ్చేందుకు రుణదాతలు వెనుకడుగు వేస్తున్నారని మస్క్ అన్నారు. ఇతర సంస్థలకు ఏఐ చిప్‌లు, కంప్యూటింగ్ సామర్థ్యాన్ని అద్దెకు ఇచ్చే చిన్న క్లౌడ్ సేవల కంపెనీలు (నియోక్లౌడ్స్) 200కుపైగా తీవ్ర కష్టాల్లో ఉన్నాయని ఆయన వెల్లడించారు. ఆ సంస్థల్లో చాలా వరకు కనుమరుగవుతాయని, మిగిలినవి ఇతర కంపెనీల్లో విలీనం కావాల్సిన పరిస్థితులు ఏర్పడతాయని పేర్కొన్నారు. 'ఏఐ డేటా సెంటర్ల ఏర్పాటుకు భారీగా పెట్టుబడులు అవసరమవుతాయి. అత్యాధునిక గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్లను (జీపీయూ) కొనుగోలు చేసి నిర్వహించేందుకు భారీ మొత్తంలో కరెంట్ కావాలి. పెట్టుబడుల కోసం రుణాలపై ఆధారపడే కంపెనీలకు ప్రస్తుతం రుణాలు ఇచ్చే కంపెనీల నుంచి ఆశించిన స్థాయిలో సహకారం లభించడం లేదు. ఆర్థిక వనరులు బాగా ఉన్న కంపెనీల వైపు మాత్రమే రుణదాతలు చూస్తున్నారు' అని మస్క్ వివరించారు.

స్పోర్ట్స్

చైతన్యరథం

# ఆరోగ్యంపై మరింత శ్రద్ధ పెట్టడం అవసరం

## జెన్ జీ, జెన్ ఆల్ఫా తరాలకు భారత క్రికెట్ మాజీ కెప్టెన్ ధోనీ పిలుపు



ప్రస్తుత జెన్ జీ, జెన్ ఆల్ఫా తరాలు ఆరోగ్యంపై మరింత శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉందని టీమిండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ సూచించారు. మారుతున్న జీవనశైలి, ఫాస్ట్‌ఫుడ్ అలవాట్లు, శారీరక శ్రమ తగ్గిపోవడం భవిష్యత్తులో ఆరోగ్యంపై ప్రభావం చూపవచ్చని హెచ్చరించారు. చిన్నప్పటి నుంచే క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని, రోజులో కనీసం గంట సమయాన్ని ఫిట్‌నెస్ కోసం కేటాయించాలని పిలుపునిచ్చారు.

రచయిత, గేయరచయిత జావేద్ అఖ్తర్‌తో కలిసి ఓ కార్యక్రమంలో పాల్గొన్న ధోనీ, యువత ఆరోగ్యం గురించి కీలక విషయాలు పంచుకున్నారు. ప్రతి ఒక్కరూ క్రీడాకారులు కావాల్సిన అవసరం లేదని, అయితే శారీరక చురుకుదనాన్ని జీవితంలో భాగం చేసుకోవడం ఎంతో ముఖ్యమని చెప్పారు. గతంలో ప్రజల దైనందిన జీవితంలో శారీరక శ్రమ ఎక్కువగా ఉండేదని ధోనీ గుర్తుచేశారు. అప్పటి ఆహారపు అలవాట్లు కూడా ఆ జీవనశైలికి అనుగుణంగా ఉండేవన్నారు. కానీ ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని వివరించారు. "గతంలో ఉన్న ఆహారపు అలవాట్లే ఇప్పటి తరానికి కొనసాగాయి. కానీ శారీరక శ్రమ మాత్రం గణనీయంగా తగ్గిపోయింది" అని ధోనీ పేర్కొన్నారు. గతంలో నడక, శారీరక శ్రమ రోజువారీ జీవితంలో సహజంగా భాగంగా ఉండేవని ఇప్పుడు చిన్న దూరాలకు వెళ్లేందుకు కూడా వాహనాలపై ఆధారపడుతున్నారని.. కార్యాలయాల్లో గంటల తరబడి కుర్చీలకే పరిమితమవుతున్నారని వివరించారు. దీనికి తోడు ఫాస్ట్‌ఫుడ్, చక్కెర అధికంగా ఉండే పదార్థాలు, నూనెలో వేయించిన ఆహారాల వినియోగం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కొంతమందిలో ఫిట్‌నెస్‌పై అవగాహన పెరుగుతున్నప్పటికీ.. సమాజంలోని ఎక్కువ మందికి ఆరోగ్యకరమైన జీవనశైలి ప్రాధాన్యాన్ని తెలియజేయాల్సిన అవసరం ఉందని ధోనీ అభిప్రాయపడ్డారు. పిల్లలను చిన్న వయసు నుంచే వివిధ క్రీడల్లో పాల్గొనేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ధోనీ సూచించారు. ఒకే ఆటకు పరిమితం చేయకుండా.. వారికి ఆసక్తి ఉన్న క్రీడలను ప్రయత్నించే అవకాశం ఇవ్వాలన్నారు. అలా పిల్లలు తమకు నచ్చిన ఆటను ఎంచుకోవడంతోపాటు శారీరక శ్రమకు అలవాటు పడతారని వివరించారు. ప్రతి ఒక్కరూ ప్రొఫెషనల్ క్రీడాకారులు కావాల్సిన అవసరం లేదని.. అయితే చిన్నప్పటి నుంచి క్రీడల్లో పాల్గొనడం జీవితాంతం ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఉపయోగపడుతుందని చెప్పారు. "30, 35 ఏళ్లు దాటిన తర్వాత క్రీడలు ఆడినవారు, ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యమిచ్చినవారు మధ్య వయసులో మెరుగైన ఆరోగ్యాన్ని కలిగి ఉంటారని మీరు గుర్తిస్తారు." అని ధోనీ పేర్కొన్నారు. వయసు పెరిగే కొద్దీ కుటుంబ బాధ్యతలు కూడా పెరుగుతాయని, అలాంటి సమయంలో శారీరక దృఢత్వం ఎంతో ముఖ్యమని చెప్పారు. పిల్లలతో కలిసి ఆడుకోవడం వంటి రోజువారీ ఆనందాలను ఆస్వాదించాలన్నా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.

## కివీస్‌తో మూడో టీ20లో ఆడేదెవరో!

న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌లో టీమిండియాకు మరో ఎదురుదెబ్బ తగిలింది. వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ మూడో టీ20కి కూడా దూరమయ్యాడు. తొలి టీ20లో తొడ కండరాల గాయం బారిన ఇషాన్.. రెండో టీ20కి కూడా అందుబాటులో లేని సంగతి తెలిసిందే. అతడు ఇంకా ఫిట్‌నెస్ సాధించలేదని తాజాగా బీసీసీఐ వెల్లడించింది. మరోవైపు రెండో టీ20లో ఇషాన్ స్థానంలో యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ బరిలోకి దిగాడు. మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి కేవలం నాలుగు పరుగులకే ఔటయ్యాడు. ఈ నేపథ్యంలో మూడో టీ20లో అతడికి మరో అవకాశం దక్కుతుందా? జట్టు మేనేజ్‌మెంట్ బ్యాటింగ్ కూర్పులో మార్పులు చేస్తుందా? అనేది ఆసక్తిగా మారింది. ఇషాన్ గాయం నుంచి కోలుకుంటున్నాడని, అయితే మ్యాచ్‌లో ఆడేందుకు అవసరమైన పూర్తి ఫిట్‌నెస్ ఇంకా సాధించలేదని బీసీసీఐ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టింది. వైద్య బృందం అతడి పరిస్థితిని పర్యవేక్షిస్తోందని పేర్కొంది. దీంతో ఇషాన్ స్థానంలో జట్టులోకి వచ్చిన కుమార్ కుశాగ్ర మూడో టీ20కి కూడా జట్టుతోనే కొనసాగనున్నాడు. ఇషాన్ కిషన్ అందుబాటులో లేకపోవడంతో భారత జట్టు మేనేజ్‌మెంట్ ముందు బ్యాటింగ్ కూర్పును నిర్ణయించాల్సిన అవసరం ఏర్పడింది. వైభవ్ సూర్యవంశీకి మరో అవకాశం ఇస్తే అతడిని ఓపెనర్‌గా పంపిస్తారా? లేక జట్టు అవసరాల కోసం మిడిలార్డర్‌లోనే కొనసాగిస్తారా? అన్నది ఆసక్తికరంగా మారింది. యువ ఆటగాళ్లకు అవకాశాలు ఇవ్వడంతో పాటు, వారు సహజమైన ఆటతీరుతో రాణించే పరిస్థితులను కల్పించడం కూడా అంతే ముఖ్యమని మాజీ క్రికెటర్లు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. న్యూజిలాండ్‌తో అక్టోబర్ 27న వెల్లింగ్టన్‌లో జరగనున్న మూడో టీ20లో భారత జట్టు ఎలాంటి కూర్పుతో బరిలోకి దిగుతుందో చూడాల్సి ఉంది.



# దీప్తి శర్మ అరుదైన రికార్డు

## వన్డేల్లో రెండు కంటే ఎక్కువ సెంచరీలు సాధించిన క్రీడాకారిణి

భారత మహిళా క్రికెటర్ దీప్తి శర్మ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకుంది. వన్డే క్రికెట్‌లో రెండు లేదా అంతకంటే ఎక్కువ సెంచరీలు చేయడంతో పాటు బౌలింగ్‌లో 150పైగా వికెట్లు తీసిన మూడో క్రికెటర్‌గా, తొలి భారత మహిళా క్రికెటర్‌గా దీప్తి శర్మ రికార్డులకెక్కింది. జింబాబ్వేతో జరిగిన రెండో వన్డేలో ఈ ఫీట్ సాధించింది. ఈ మ్యాచ్‌లో మాజీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌తో పాటు దీప్తి శర్మ సెంచరీలతో రాణించడంతో, భారత్ 121 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. వైష్ణవి శర్మ (4 వికెట్లు), దీప్తి శర్మ (3 వికెట్లు) నిప్పులు చెరిగే బౌలింగ్‌తో జింబాబ్వే పతనాన్ని శాసించారు. వన్డేల్లో దీప్తి శర్మకు జింబాబ్వేపై చేసిన శతకం రెండోది. ఆమె 2017 మే 15న ఐర్లాండ్‌తో మ్యాచ్‌లో 160 బంతుల్లో 188 పరుగులు చేసి వన్డేల్లో తొలి సెంచరీ సాధించింది. తొమ్మిదేళ్ల నిరీక్షణకు తెరదించుతూ తాజాగా వన్డేల్లో మరో శతకాన్ని అందుకుంది. దీప్తి శర్మ వన్డేల్లో ఇప్పటివరకు 168 వికెట్లు తీయడంతో పాటు రెండు సెంచరీలు సాధించింది. ఈ జాబితాలో క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ (49 సెంచరీలు, 154 వికెట్లు) అగ్రస్థానంలో ఉండగా.. మాజీ క్రికెటర్ మనోజ్ ప్రభాకర్ 2 సెంచరీలు, 157 వికెట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. దీప్తి శర్మ మూడో స్థానంలో కొనసాగుతోంది. మహిళల వన్డే క్రికెట్‌లో టీమిండియా తరఫున ఆరు లేదా ఆ తర్వాతి స్థానాల్లో బ్యాటింగ్‌కు వచ్చి సెంచరీ బాదిన తొలి క్రికెటర్‌గా దీప్తి చరిత్ర సృష్టించింది. 86 బంతుల్లో 106 పరుగుల అజేయ ఇన్నింగ్స్‌తో మెరిసిన దీప్తి శర్మ.. రిచా ఘోష్ (94 పరుగులు) బ్రేక్ చేసింది. జింబాబ్వేతో జరిగిన రెండో వన్డేలో 83 బంతుల్లో సెంచరీ మార్క్ అందుకున్న దీప్తి, భారత మహిళా క్రికెటర్లలో వేగంగా సెంచరీ సాధించిన మూడో క్రికెటర్‌గా రికార్డులకెక్కింది. దీప్తి కంటే ముందు కెప్టెన్ స్మృతి మంధాన, మాజీ కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ ఉన్నారు.





# దృఢమైన సంకల్పమే విరాటుని విజయ రహస్యం

## కోహ్లీకి సౌతాఫ్రికా మాజీ కెప్టెన్ డుప్లెసిస్ కితాబు

టీమిండియా స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ పోరాట పటిమ, గెలుపు విషయంలో రాజీ పడని వ్యక్తిత్వానికి సంబంధించి సౌతాఫ్రికా మాజీ కెప్టెన్ ఫాఫ్ డుప్లెసిస్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. వాండరర్స్ వేదికగా సౌతాఫ్రికా, భారత్ మధ్య జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో కోహ్లీ ప్రదర్శించిన నాయకత్వ శైలి గురించి తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో డుప్లెసిస్ గుర్తుచేసుకున్నాడు. పాడ్‌కాస్ట్‌లో డుప్లెసిస్ మాట్లాడుతూ.. గతంలో భారత్, సౌతాఫ్రికా మధ్య వాండరర్స్ వేదికగా జరిగిన ఓ టెస్ట్ మ్యాచ్‌లో పిచ్ అత్యంత ప్రమాదకరంగా మారిందని అన్నాడు. ఆ మ్యాచ్‌లో డీన్ ఎల్గర్‌కు హెల్మెట్‌పై బలమైన బంతి తగిలిందని, ఆ పిచ్ వేగం చూస్తుంటే 'ఇక్కడ ఎవరో ఒకరు చనిపోయేలా ఉన్నారు' అనిపించిందని డుప్లెసిస్ వెల్లడించాడు. బంతులు గొంతు భాగానికి, తలకు తగిలేంత ప్రమాదకరంగా పిచ్ మారిందని, అలాంటి సమయంలో కూడా విరాట్ కోహ్లీ తన జట్టు ఆటగాళ్లకు నిర్దేశించిన కఠిన వ్యూహం మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచిందని డుప్లెసిస్ తెలిపాడు. ఆ మ్యాచ్‌లో భారత్ కొంత ఆధిక్యంలో ఉంది.. మ్యాచ్ ఎలాగైనా గెలవాలనే కసితో కోహ్లీ ఉన్నాడని డుప్లెసిస్ తెలిపాడు. పిచ్ పరిస్థితిని చూసి బ్యాటర్లు ఎవరూ కూడా శరీరానికి బంతి తగిలినప్పుడు నొప్పితో ఎలాంటి రియాక్షన్ ఇవ్వకూడదని కోహ్లీ ఆదేశించినట్లు అతడు వెల్లడించాడు. అలా కోహ్లీ చెప్పడానికి కారణం.. ప్రత్యర్థికి బలహీనతను చూపించరాదన్నదే ఉద్దేశమని తెలిపాడు. చేతికి, గ్లౌజులకు లేదా తలకు తగిలినప్పటికీ ఎలాంటి బాధను బయటపెట్టకుండా భారత ఆటగాళ్లు ఎంతో పట్టుదలతో క్రీజులో నిలబడ్డారని డుప్లెసిస్ ప్రశంసించాడు. మైదానంలో కోహ్లీ ప్రదర్శించే ఈ అసాధారణ దూకుడు, పట్టుదల సహచర ఆటగాళ్లలోనూ అంతులేని పోరాట పటిమను నింపేవని డుప్లెసిస్ కొనియాడాడు. మాటల కంటే చేతలతోనే నాయకత్వం ఎలా వహించాలో కోహ్లీ తన కెప్టెన్సీ ద్వారా నిరూపించాడని అతడు పేర్కొన్నాడు. ధోనీ నుంచి పగ్గాలు చేపట్టిన తర్వాత టీమిండియా టెస్ట్ క్రికెట్‌లో అత్యంత విజయవంతమైన (40 విజయాలు) కెప్టెన్‌గా కోహ్లీ రికార్డు సృష్టించాడు. ఈ విజయాల వెనుక ఉన్న అసలు రహస్యం ఈ దృఢ సంకల్పమేనని వాండరర్స్ టెస్ట్‌లో జరిగిన ఈ సంఘటన మరోసారి రుజువు చేసింది.

చైతన్య రథం
సినిమా
మంగళవారం 27 అక్టోబరు 2026 X

# మూడు రాష్ట్రాల్లో ముచ్చటగా 'వృషకర్మ' విడుదల




యంగ్ హీరో అక్కినేని నాగచైతన్య నటిస్తున్న లేటెస్ట్ మిస్టిక్ అడ్వెంచర్ చిత్రం 'వృషకర్మ' ప్రేక్షకుల్లో సాలిడ్ బజ్ క్రియేట్ చేసింది. అడ్వెంచర్ నేపథ్యంలో ఈ సినిమా వస్తుండటంతో ఈ మూవీపై అంచనాలు భారీగా క్రియేట్ అయ్యాయి. ఈ చిత్రాన్ని కార్తీక్ దండు డైరెక్ట్ చేస్తున్నాడు. ఇక ఇప్పటికే రిలీజ్ అయిన ఈ చిత్ర ప్రమోషనల్ కంటెంట్ ఈ మూవీపై బజ్‌ను రెట్టింపు చేసింది.

కాగా, ఈ చిత్రానికి సంబంధించిన ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల డిస్ట్రిబ్యూషన్ రైట్స్ ప్రముఖ స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజుకు చెందిన శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ దక్కించుకుంది.దీంతో ఈ చిత్రాన్ని భారీస్థాయిలో రిలీజ్ చేసేందుకు దిల్ రాజు ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమాలోని కంటెంట్‌పై దిల్ రాజు పూర్తి కాన్ఫిడెంట్‌గా ఉండటంతో ఆయన ఈ చిత్ర రైట్స్ దక్కించుకున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తుండగా బాలీవుడ్ నటుడు స్పర్శ్ శ్రీవాస్తవ విలన్‌గా టాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నాడు. అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని బివిఎస్ఎన్ ప్రసాద్ భారీ బడ్జెట్‌తో ప్రొడ్యూస్ చేస్తున్నారు. డిసెంబర్ 4వ తేదీన ఈ చిత్రాన్ని గ్రాండ్ రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు.

# 'డోంట్ స్లీప్'

## సినిమా టీజర్ విడుదల






హైదరాబాద్ (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ తెలంగాణ రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త వెలివెల దుర్గారావు నిర్మాణంలో రూపుదిద్దుకున్న నూతన సైకలాజికల్ థ్రిల్లర్ చిత్రం 'డోంట్ స్లీప్' టీజర్ ఆవిష్కరణ హైదరాబాద్‌లోని ఏఏఏ సినిమాస్‌లో అత్యంత వైభవంగా జరిగింది. తెలుగు సినీ రంగం నుంచి నాగచైతన్య, తమిళ పరిశ్రమ నుంచి విజయ్ సేతుపతి, మలయాళ చిత్రసీమ నుంచి దుల్కర్ సల్మాన్ పాల్గొని ఉమ్మడిగా ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేశారు. భారీ సంఖ్యలో హాజరైన అభిమానులు, సినీ, రాజకీయ రంగ ప్రముఖుల సమక్షంలో ఈ కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా నిర్మాత వెలివెల దుర్గారావు మాట్లాడుతూ ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు–భువనేశ్వరి దంపతులు, మంత్రి నారా లోకేష్ ఆశీస్సులతో ఈ చిత్రాన్ని నిర్మించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సస్పెన్స్, వైవిధ్యమైన ఇతివృత్తంతో రూపొందిన టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటుందని దుర్గారావు ఆశాభావం వ్యక్తం చేశారు. టీడీపీ కుటుంబ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సినీ ప్రియులు టీజర్‌ను వీక్షించి ఆదరించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న చిత్ర యూనిట్ సభ్యులు, పలువురు ముఖ్య నాయకులు సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు.







# వ్యూహం మార్చిన ఆదర్శం

## జైలర్ బాటలో బజ్ మోగాలని ఆశలు

టాలీవుడ్ స్టార్ హీరో విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందిన ఫ్యామిలీ అండ్ యాక్షన్ థ్రిల్లర్ 'ఆదర్శ కుటుంబం' అక్టోబర్ 30న గ్రాండ్ రిలీజ్‌కు రెడీ అయింది. త్రివిక్రమ్, వెంకటేష్ కాంబో అనగానే అంచనాలు అమాంతం పెరిగిపోతాయి. అయితే, 'ఆదర్శ కుటుంబం' చిత్రం నుంచి ఇప్పటివరకు వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ అనుకున్న స్థాయిలో బజ్ క్రియేట్ చేయలేదని సినీ వర్గాల టాక్. దీంతో ఈ చిత్ర మేకర్స్ ఇటీవల రిలీజ్ అయ్యి బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిన 'జైలర్ 2' స్ట్రాటజీ ఫాలో అవుతున్నారనే టాక్ వినిపిస్తోంది. రజినీకాంత్, నెల్సన్ దిలీప్ కుమార్ కాంబినేషన్‌లో వచ్చిన జైలర్ 2 చిత్రం కూడా ప్రమోషనల్ కంటెంట్‌తో అనుకున్న స్థాయిలో బజ్ క్రియేట్ చేయలేకపోయింది. దీంతో మేకర్స్ ఈ చిత్రాన్ని రిలీజ్ చేయగా, బాక్సాఫీస్ దగ్గర మౌత్ టాక్‌తో ఈ సినిమా బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. ఇప్పుడు 'ఆదర్శ కుటుంబం' కోసం కూడా త్రివిక్రమ్ అండ్ టీమ్ ఇదే స్ట్రాటజీ ఫాలో అవుతున్నట్లు తెలుస్తోంది. బజ్ అనుకున్న స్థాయిలో క్రియేట్ కాకపోయినా, సినిమాలోని కంటెంట్ మాట్లాడుతుందనే ధీమాతో వారు ఉన్నట్లు తెలుస్తోంది. మరి అక్టోబర్ 30న రిలీజ్ కానున్న ఆదర్శ కుటుంబం చిత్రం జైలర్ 2 స్థాయిలో విజయాన్ని అందుకుంటుందా లేదా అనేది వేచి చూడాలి.



# నటసింహం కొత్త రూపం... మలినేని మరో దర్శక పాటవం!

## ఇద్దరి కాంబినేషన్‌లో సరికొత్తగా తెరపైకి రెండో సినిమా

నటసింహం బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కలయికలో రాబోతున్న 'దాదా' సినిమా పై భారీ అంచనాలు ఉన్నాయి. కాగా ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన లేటెస్ట్ అప్ డేట్ ఏమిటంటే.. వచ్చే వారం నుంచి ఈ సినిమా క్లైమాక్స్‌ను షూట్ చేస్తారట. ఈ క్లైమాక్స్ కోసం భారీ యాక్షన్ సీన్స్ ను ప్లాన్ చేశారు. ఐతే, రీసెంట్‌గా బాలయ్యకి గాయం తగిలి, సర్జరీ జరిగి, అనంతరం కోలుకున్న సంగతి తెలిసిందే. కాగా మళ్లీ ఈ సినిమా క్లైమాక్స్ షూట్ కోసం యాక్షన్ సీన్స్ చేయడానికి బాలయ్య రెడీ అయ్యారు. ఈ సినిమాలో కాజల్ అగర్వాల్ కథానాయికగా నటిస్తోంది. ఈ సినిమాలో మంచు మనోజ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. అన్నట్టు బాలకృష్ణ, దర్శకుడు గోపీచంద్ మలినేని కలయికలో వచ్చిన 'వీరసింహారెడ్డి' మంచి విజయం సాధించింది. ఆ సినిమా తర్వాత ఈ ఇద్దరూ కలిసి చేస్తున్న రెండో సినిమా ఇది. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. మొత్తానికి ఈ సినిమా కోసం బాలయ్య సరికొత్త మేకోవర్ లో కనిపించబోతున్నాడు.